
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 29, ఏప్రిల్ 2025



గాడినపడ్డాయ్!



వైసీపీ పాలనలో నిర్వీర్యమైన వ్యవస్థలను నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రమంగా గాడిలో పెడుతూ వస్తోంది. అందుకు గ్రామ పంచాయతీలే నిదర్శనం. గతంలో పారిశుధ్య పనులకు సైతం అప్పులు చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం అందుకు భిన్నంగా అందుబాటులో అవసరమైన స్థాయిలో ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీలకు మళ్లీ కళ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతోపాటు అధికార యంత్రాంగం పన్ను వసూళ్లపై ఒత్తిడి పెంచింది. రాష్ట్రస్థాయి అధికారులతోపాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక దృష్టి సారించడంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు రికార్డు స్థాయిలో వసూలయ్యాయి.

- పంచాయతీల్లో రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.21.05 కోట్ల ఆదాయం
- మిగిలిన బకాయిలు రాబట్టేందుకు చర్యలు
- ఇక నుంచి స్వర్ణాంధ్ర పోర్టల్ ద్వారానే చెల్లింపులు
- గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన స్థానిక సంస్థలు



బకాయిలన్నీ వసూలు చేశారు

గ్రామ పంచాయతీల్లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలను జిల్లా అధికారుల చొరవతో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వసూలు చేశారు. ప్రతి పంచాయతీకి సరాసరిన రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ఇంటి పన్నుల రూపంలో నిధులు సమకూరాయి. వాటితో వీధి దీపాలతోపాటు పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్ చల్లడం, బోరింగ్‌లు మరమ్మతులు చేయించడం, ట్యాంకులను శుభ్రం చేయించుకోవడం, అత్యవసరమైన పనులు పంచాయతీ తీర్మానాలతో చేసుకొనేందుకు సాధ్యమవుతుంది.

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే నిధులపైనే ఇప్పటివరకు ఎక్కువగా ఆధారపడిన గ్రామ పంచాయతీలకు స్థానికంగానూ పట్టు పెరుగుతోంది. ఈఏడాది అత్యవసరంతోపాటు అభివృద్ధి పనులు చేసుకునేందుకు అవసరమైన నిధులు సమకూరాయి. రికార్డు స్థాయిలో పన్నులు వసూలయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 729 గ్రామ పంచాయతీల్లో రూ.37 కోట్ల పన్నుల డిమాండ్ ఉండగా ఇప్పటివరకు రూ.21.05 కోట్లు వసూలయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.37 కోట్ల డిమాండ్ ఉంటే కేవలం రూ.13.86 కోట్లు మాత్రమే రాబట్టారు. ఆ ప్రకారం చూస్తే గత ఆర్థిక సంవత్సరంలో 52శాతం అదనంగా ఆదాయం చేకూర్చారు. గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.7.18 కోట్లు ఎక్కువగా వసూలు చేశారు. ఇంకా జిల్లాలో సుమారు రూ.13 కోట్ల మేర పన్నులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇక నుంచి యూపీఐ ద్వారా పన్నులు వసూలు

పంచాయతీల్లోని ప్రజల నుంచి ఇప్పటి వరకు పన్నులను నగదు రూపంలో పంచాయతీ కార్యదర్శులు తీసుకునే వారు. ఇక నుంచి స్వర్ణాంధ్ర పోర్టల్ ద్వారానే వసూలు

మిగతా 6వ పేజీలో

భూగర్భ శోకం

వేసవి ఆరంభంలోనే పడిపోయిన నీటి మట్టం

- జిల్లాలో మార్చి ఆఖరుకు సగటున 16.05 మీటర్లు
- మూడు మాసాల్లో ఐదు మీటర్లు తగ్గిన వైనం
- దోర్నాలలో 66.97మీటర్లు, మార్కాపురంలో 50.45 మీటర్లకు దిగజారిన పరిస్థితి
- పశ్చిమాన పలు గ్రామాల్లో పనిచేయని బోర్లు
- 93 గ్రామాల్లో వాటి తవ్వకాలు నిషేధం



జిల్లాలో వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పలుమండలాల్లో మూడు మాసాలకుపైగా చినుకు లేకపోవడం, అంతకు ముందు ఈశాన్య రుతుపవనాల కాలంలో సగం మండలాల్లో సాధారణ వర్షపాతం మాత్రమే నమోదవడం అందుకు కారణమైంది. గతంలో అధికారులు నిర్వహించిన సర్వేలో జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం 16.05 మీటర్లుగా ఉంది. ప్రస్తుతం 11.22 మీటర్లకు దిగజారింది. మూడు మాసాల్లోనే సుమారు 5 మీటర్ల మేర పడిపోయింది. జిల్లాలోని పశ్చిమప్రాంతంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. అక్కడ కొన్ని మండలాల్లో భూగర్భ జల మట్టం ఏకంగా 50నుంచి 60 మీటర్ల దిగువకు చేరడం ఆందోళన కలిగిస్తోంది.

ఒంగోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అత్యధిక ప్రాంతాలలో ప్రత్యేకించి పశ్చిమంలో సాగు, తాగునీటికి భూగర్భజలాలే దిక్కు. మంచి వర్షాలు కురిస్తే భూగర్భ జలాలు పెరిగి పంటలకు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అదే అంతంతమాత్రంగా కురిస్తే సంక్రాంతి నుంచే నీటి ఇక్కట్లు ప్రారంభమవుతాయి. దోర్నాల, దొనకొండ, గిద్దలూరు, మార్కాపురం, పుల్లలచెరువు, పెద్దారవీడు, రాచర్ల, తర్లుపాడు, ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, కొనకనమిట్ల తదితర మండలాల్లో ఈపరిస్థితి అధికంగా ఉంటుంది. అక్కడ అనేక గ్రామాల్లో మిర్చి, వరి, పత్తి, ఇతర పలు రకాల పంటలు బోర్ల ఆధారంగా వేస్తారు. కొన్ని గ్రామాల్లో 700 నుంచి వెయ్యి అడుగుల లోతులో కూడా బోర్లను తవ్వి నీటిని తీసి పంటలకు పెడుతున్నారు. అలాగే గ్రామాల్లో వెయ్యి అడుగుల లోతున బోర్లు తవ్వి విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి సింగిల్ రక్షిత పథకాల (డీప్‌బోర్ల) ద్వారా ప్రజలకు నీటి అవసరాలను తీర్చుతున్నారు. అలాంటి గ్రామాల్లో భూగర్భ జల మట్టం భారీగా పడిపోయింది. ప్రస్తుతం వ్యవసాయ అవసరాలు పెద్దగా లేక కొంత ఉపశమనంగా ఉన్నప్పటికీ తాగు, ఇతర సాధారణ అవసరాలకు నీరు దొరకడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికే పశ్చిమప్రాంతంలోని 9 మండలాల్లోని 51 ఆవాసాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతోంది. మరోవైపు రాష్ట్రంలో నీటి లభ్యతకన్నా 300 గ్రామాల్లో అధికంగా భూగర్భ జలాల

మిగతా 6వ పేజీలో

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- పాకలలో కలెక్టర్ అన్సారియాతో కలిసి గంగపుత్రులకు చెక్కుల పంపిణీ
- గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభం

6



చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా



7

అక్షయతృతీయ పర్వదినం అమిత ఫలదాయకం

- ఆరోజు చేసే ఏ వ్రతానికైనా రెట్టింపు ఫలం
- ముఖ్యంగా దానాలు చేయాలంటున్న పండితులు
- రేపే పండుగ

ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్లు

- వచ్చింది 15 మంది కూలీలు, చూపింది 250 మంది
- డ్వామా పీడీకి గ్రామస్థుల ఫిర్యాదు
- ఎంపీడీవోకు విచారణ నివేదిక ఇచ్చిన ఏపీవో
- ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు సిఫార్సు
- రూ.200 వసూలు చేస్తున్నట్లు సీఎంవోకూ ఫిర్యాదు



మర్రివేములలో ఉపాధి పనులకు వచ్చిన కూలీలు

పుల్లలచెరువు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనుల్లో బోగస్ మస్టర్లతో ప్రభుత్వ ధనాన్ని మెక్కేసిన ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు మండల అధికారులు సిఫార్సు చేశారు. సోమవారం మండలంలోని మర్రివేములలో 15 మంది ఉపాధి కూలీలు హాజరైతే 250కి మందికి పైగా వచ్చినట్లు దొంగ మస్టర్లు వేస్తున్నారని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో ఏపీవోపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఏపీవో విచారణ చేపట్టగా.. దొంగ ఫొటోలతో మస్టర్లు

మిగతా 6వ పేజీలో


విజన్ ప్లాన్‌పై దృష్టి సారించాలి

- నియోజకవర్గ స్థాయిలో పరిస్థితులు, వనరులను పూర్తిగా అధ్యయనం చేయాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయి పరిస్థితులు, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి విజన్ ప్లాన్‌ను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక ఎన్‌జీవో భవన్‌లో సోమవారం స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా నియోజకవర్గాల విజన్ డాక్యుమెంట్ రూపకల్పన, ముఖ్య నిర్దేశిత లక్ష్యాలపై ప్రకాశం, నెల్లూరు జిల్లాల అధికారులకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడారు. స్వర్ణాంధ్ర-47 డాక్యుమెంట్‌లో భాగంగా జిల్లా విజన్ ప్లాన్‌ను రూపొందించామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గాల వారీగా తయారు చేసేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ఈ వర్క్‌షాపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక నియోజకవర్గంలో రానున్న సంవత్సర కాలంలో ఏ రంగం వృద్ధి రేటు ఎలా ఉంటుంది, దానిని ఎలా మరింత అభివృద్ధి చేయాలన్న అంశాలపై నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్‌షాపులో ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలతోపాటు ప్రైమరీ, సెకండరీ, సర్వీస్ తదితర రంగాలపై అవగాహన కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో పరిస్థితులు, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి.. సృజనాత్మకంగా ఆలోచించి ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందేలా ప్రణాళికలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ వర్క్‌షాపులో ప్రకాశం, నెల్లూరు జిల్లాల సీపీవోలు వెంకటేశ్వర్లు, రఘురామయ్య, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ సలహాదారు సీతాపతి పాల్గొన్నారు.

మిలటరీ మద్యం పేరుతో మోసం



- వైసీపీ కార్యకర్త ఆన్‌లైన్ దందా
- సొంతపార్టీ నేతలే బాధితులు
- వేలల్లో వసూలు.. రూ.వందల్లో చెల్లింపులు

పెద్దారవీడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయి. బ్యాంక్ లోన్ల పేరుతో సైబర్ నేరాలు అధికమయ్యాయి. ఈ తరుణంలో అటువంటి మోసానికే ఓ వైసీపీ కార్యకర్త తెరతీశాడు. తక్కువ రేటుకే మిలటరీ మద్యం సరఫరా చేస్తానంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. బయట వాళ్లను ఎందుకులే అనుకున్నాడో ఏమో సొంత పార్టీ నేతలనే ఎంచుకున్నాడు.

మోసం చేసేది ఇలా..

వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వం సరఫరా చేసిన మద్యం నాణ్యతా లోపంగా ఉండేదనే విషయం ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెప్పేవారు. దీంతో అప్పట్లో మిలటరీ మద్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండేది. ఈ క్రమంలోనే మార్కాపురం ప్రాంతంలో ఎక్కువ మంది మద్యం ప్రియులు మిలటరీ మద్యం పట్ల ఆసక్తి చూపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తెచ్చింది. దీంతో మిలటరీ మద్యానికి

మిగతా 6వ పేజీలో

వీరిది కసి.. వారిది డబ్బాశ!

వీరయ్య హత్యకు భారీగా సుపారీ

ఒక్కో కత్తిపోటుకు రూ.2లక్షలని ప్రచారం

- చేపల పులుసు కోసమే ఆ హోటల్‌కు వెళ్లామని చెప్పిన వైసీపీ ఎంపీపీ భర్త
- ఆ ఇద్దరి కోసం ముమ్మర వేట

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తెలుగుదేశం నాయకుడు వీరయ్యచౌదరి హత్య కేసుకు సంబంధించి సూత్రధారులను గుర్తించి కీలక పాత్రధారులు, కిరాయి హంతకుల కోసం వేట ప్రారంభించిన పోలీసులకు సంచలన విషయాలు వెల్లడవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా మొత్తం సీసీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు ఒంగోలులోని ఒక హోటల్‌లో ఆరోజు మధ్యాహ్నం ఫుటేజీలో దొరికిన అంశాలపై ప్రత్యేక విచారణ కొనసాగిస్తున్నారు. ఇంకోవైపు ఈ కేసులో ఆర్థిక వనరులు కూడా కొందరు సమకూర్చినట్లు వెల్లడవుతుండటంతో ఆ దిశగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఎంత మొత్తంలో వెచ్చించారు, కిరాయి హంతకులకు ఎంత ముట్టజెప్పారు, డబ్బు ఎక్కడెక్కడి నుంచి సమకూర్చుకున్నారు అన్న విషయాలపై విచారణ చేస్తున్నారు. హత్య చేసే క్రమంలో శరీరంపై 50వరకు కత్తి పోట్లు పొడవడంలో ఆంతర్యమేమిటన్న దానిపై కూడా కూపీ లాగుతున్నట్లు తెలిసింది. పోలీసులకు లభించిన ప్రాథమిక సమాచారం మేరకు ఈ హత్య కోసం కోట్ల రూపాయలు వెచ్చించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హంతకులకు నాయకత్వం వహించిన వ్యక్తే భారీమొత్తంలో డబ్బు పొందడంతోపాటు వారికి కూడా కూడా పెద్దఎత్తున చెల్లించినట్లు భావిస్తున్నారు. పైగా రెండు మూడు నెలల నుంచి సూత్రధారులు, పాత్రధారులు ఇదే పనిలో ఉండటంలో కూడా భారీగా వెచ్చించి ఉండవచ్చన్న అవగాహనకు పోలీసులు వచ్చారు. అంతేకాక ఖరీదైన, పటిష్టమైన ఆయుధాలను కూడా కొనుగోలు చేసుకొని వినియోగించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.



వీరయ్య హత్యకు గురైన భవనం వద్ద పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్ (ఫైల్)

వీరయ్యను హత్య చేసిన వారు భారీమొత్తంలో సుపారీ అడిగినట్లుగా పోలీసులు పసిగట్టారు. సూత్రధారులు కూడా ఎలాంటి పరిస్థితుల్లో వీరయ్య తప్పించుకోకూడదని, అతన్ని విచక్షణారహితంగా చంపితే చూడాలన్న కసితో హంతకులు అడిగిన సుపారీకి అంగీకరించి ఉంటారని పోలీసుల అంచనా. ఆ సందర్భంగా సాగిన బేరసారాల్లో ఒక్కో కత్తిపోటుకు రూ.5లక్షలు ఇవ్వాలనే

హంతకులకు రూ.కోటిపైనే సుపారీ

డిమాండ్ హంతకులు పెట్టినట్లుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఆ విషయంలో తర్జనభర్జన అనంతరం చివరకు రూ.2లక్షలు

మిగతా 6వ పేజీలో

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా మే 19 నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరతులు మే 18 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తారు. ప్రత్యేక తరగతులకు ఫెయిలైన వందశాతం మంది విద్యార్థులు హాజరుకావాలన్నారు. తరగతుల నిర్వహణకు పాఠశాలల్లో తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. సబ్జెక్టు టీచర్లు తమ సబ్జెక్టులో ఫెయిలైన విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9.15 గంటల వరకు సోషల్/భాషలు, 9.15 నుంచి 10.15 వరకు సైన్స్, 10.15 నుంచి 10.30 వరకు విరామం, 10.30 నుంచి 12 గటల వరకు గణితం బోధించాలని షెడ్యూల్ ఇచ్చారు.

గాడినపడ్డాయ్!

(5వ పేజీ తరువాయి)

చేయనున్నారు. స్వర్ణాంధ్ర పోర్టల్‌లో యుపీఐ (ఫోన్ పే), ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా పంచాయతీ అకౌంట్‌కు ఇంటి పన్నులు నేరుగా జమ చేయాల్సి ఉంది. గతంలో ప్రజల నుంచి వసూలు చేసిన నగదును కొంతమంది కార్యదర్శులు పంచాయతీ అకౌంట్‌కు జమ చేయకుండా స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పారదర్శకంగా, జవాబుదారీతనంగా ఉండే విధంగా ప్రభుత్వం ఈ స్వర్ణాంధ్ర పోర్టల్‌ను తెచ్చింది. ఇంకోవైపు ఇప్పటివరకూ వసూలు చేసిన పన్నులకు సంబంధించిన బిల్లులను కూడా స్వర్ణాంధ్ర పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకుంది. అందుకు అవసరమైన దిశానిర్దేశం కూడా చేశారు. గ్రామాల్లో ఇల్లు ఒకరి పేరుతో ఉండి పన్నులు మరొకరు చెల్లిస్తూ వస్తున్నారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా స్వర్ణాంధ్ర పోర్టల్‌లో ఆ ఇంటి విస్తీర్ణంతోపాటు ఆ యజమాని పేరును కూడా నమోదు చేయనున్నారు.

జూలై ఆఖరు నాటికి వసూలు చేస్తాం

జి.వెంకటనాయుడు, డీపీవో

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయిలను జూలై ఆఖరులోపు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశాం. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2024-25లో భారీగా పన్నులు వసూలు చేయగలిగాం. జిల్లాలో రూ.37కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా రూ. 21.05 కోట్లు చేయగలిగాం. మిగిలిన బకాయిలను కూడా జూలై ఆఖరు నాటికి నూరుశాతం రాబట్టి రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతాం.

భూగర్భ శోకం

(5వ పేజీ తరువాయి)

వాడకం జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. అందులో అత్యధికంగా 93 గ్రామాలు మన జిల్లాలో ఉన్నాయి. పశ్చిమాన 12 మండలాల్లో ఇవి ఉన్నాయి. ఆ గ్రామాల్లో బోర్ల తవ్వకాలను నిషేధించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాకు పూర్తి పశ్చిమాన నల్లమల అటవీ సరిహద్దులో ఉన్న దోర్నాల మండలంలో అప్పుడే భూగర్భ జలమట్టం 66.97 మీటర్లకు పడిపోయింది. ఇలా పలు మండలాల్లో ఉండటంతో ఈ వేసవిలో 14 మండలాల్లోని 230 హ్యాబిటేషన్లలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడి ట్యాంకర్లతో సరఫరా చేయాల్సి వస్తున్నదని అధికారులు అంచనా వేశారు.

మరింత పడిపోయే పరిస్థితి

ప్రస్తుత ఎండలు తీరును పరిశీలిస్తే మే, జూన్ నాటికి భూగర్భ జలమట్టం మరింత దారుణంగా పడిపోయే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో డిసెంబరు నెలలో 11.22 మీటర్లుగా ఉన్న భూగర్భ జల మట్టం జనవరిలో 11.85 మీటర్లకు, ఫిబ్రవరిలో 14.02 మీటర్లకు, మార్చిలో 16.05 మీటర్లకు పడిపోవడం అందుకు ఊతం ఇస్తున్నది. ఇలా భూగర్భ జల మట్టం తగ్గడంతో పశ్చిమ ప్రాంతంలోని పలు గ్రామాల్లో డీప్‌బోర్లు, వ్యవసాయ బోర్లు పనిచేయక ఇక్కట్లు పడుతున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

పాకలలో కలెక్టర్ అన్సారియాతో కలిసి మత్స్యకారులకు చెక్కుల పంపిణీ

అభివృద్ధి పనులు ప్రారంభం

సింగరాయకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. మండలంలోని పాకల పల్లెపాలెంలో మత్స్యకార సేవలో కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి పాల్గొన్నారు. సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లోని 1,556 మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతిని కింద రూ.3కోట్ల 11లక్షల 20వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో భృతికింద రూ.20 వేలు మత్స్యకారులకు అందజేశామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో చంద్రన్న బీమాను, సబ్సిడీలను రద్దుచేసి మత్స్యకారులకు ద్రోహం చేశారని మండిపడ్డారు. పాకల తీరంలో టూరిస్ట్‌ల రక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రూ.15 లక్షలతో వాచ్‌టవర్ నిర్మాణం శరవేగంగా జరుగుతున్నదన్నారు. టంగుటూరు నుంచి పాకలకు రూ.5.5 కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వచ్చే నెలలో తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు స్కూల్‌కి వెళ్తుంటే అందరికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు అందజేస్తామన్నారు.



సీసీరోడ్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

మెరుగైన వైద్యసేవలు అందించాలి

వైద్యశాఖ సమీక్షలో స్వామి

ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లా వైద్యాధికారి, నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలో స్త్రీ, పురుషుల వార్డులలో చేపట్టాల్సిన మార్పులపై చర్చించారు. ఒంగోలు రిమ్స్‌లో జరుగుతున్న పెయింటింగ్ పనులపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని అందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులకు అధికం నిధులు కేటాయిస్తున్నామని మంత్రి తెలిపారు. వైద్యులు బాధ్యతయుతంగా పనిచేసి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు.

టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు : కలెక్టర్

పాకలలో టూరిజం, మత్స్యకారుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. తమిళనాడు నుంచి వస్తోన్న సోనాబోట్ల సమస్యను కూడా అక్కడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఏటా మత్స్యరంగంలో 15 శాతం వృద్ధిని సాధించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అనంతరం పాకలలో రూ.1.08 కోట్లతో నిర్మించిన సీసీరోడ్డును కలెక్టర్, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మంత్రి స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, తహసీల్దార్లు రవి, ఆంజనేయులు, ఏఈ వర్షిణి, నియోజకవర్గపరిశీలకులు అడకా స్వాములు, సర్పంచ్ సైకం చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు సన్నెబోయిన శ్రీనివాసులు, షేక్ సందానీబాషా, చీమకుర్తి కృష్ణ, గాలి హరిబాబు, పోతురాజు, కన్నా ప్రసాద్, గ్రామకాపులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకం పోస్టర్ ఆవిష్కరణ

ప్రథమ ఆహ్వాన పత్రికను లక్ష్మీ నరసింహస్వామికి అందజేత

అద్దంకి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం మే నెల 19వ తేదీన నిర్వహించనున్నారు. ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్‌లను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఉదయం చిలకలూరిపేటలోని మంత్రి స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మహాకుంభాభిషేకం విజయవంతం అయ్యేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. శింగరకొండ అభివృద్ధికి మరింత ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు హరి శంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, ఇతర పూజారులు, సిబ్బంది మంగళవాయిద్యాలతో వెళ్లి తొలి ఆహ్వాన పత్రికను క్షేత్రాధిపతి లక్ష్మీనరసింహస్వామికి అందజేశారు. అనంతరం గ్రామదేవత పోలేరమ్మకు అందజేసి పసుపు, కుంకుమ, పుష్పాలు, నూతన వస్త్రాలు సమర్పించారు. మహాకుంభాభిషేకం ఉత్సవాలు మే నెల 14 నుంచి ప్రారంభమై 19వ తేదీ వరకు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 19న ఉదయం 9-03 గంటలకు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి నూతన దేవాలయం విమాన శిఖర జీవధ్వజ ప్రతిష్ఠాపూర్వక మహాకుంభాభిషేకం కార్యక్రమాలు శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్ నిర్మాణ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన, ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకుడు కే శ్రీనివాసగౌడ్, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ దోర్నాల మండల అధ్యక్షుడు యేర్వ మల్లికార్జున రెడ్డి, వేగినాటి శ్రీను, సుబ్బారెడ్డి, వెంకటరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

టైలర్స్ అసోసియేషన్‌కు రూ.లక్ష సాయం

టైలర్స్ డే సందర్భంగా టైలర్స్ అసోసియేషన్‌కు సోమవారం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. టైలర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తానని గతంలో మాట ఇచ్చిన ఎరిక్షన్‌బాబు ఆ మేరకు లక్ష నగదును అందజేశారు. దీంతో ఎరిక్షన్‌బాబును టైలర్స్ నాయకులు దుశ్శాలువాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టైలర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, అధ్యక్షుడు వెంకటాచారి, సుబ్రమణ్యం, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సును ఢీకొన్న టిప్పర్

నలుగురికి గాయాలు

ముగ్గురిని ఒంగోలు వైద్యశాలకు తరలింపు

ఆందోళనకు గురైన ప్రయాణికులు

నామ్ రహదారిపై నిలిచిన ట్రాఫిక్

అద్దంకి, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి) : ట్రావెల్స్ బస్, గ్రావెల్ టిప్పర్ ఢీకొనడంతో ముగ్గురు ప్రయాణికులతోపాటు బస్‌డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవేకు వెంపరాల కొండ నుంచి టిప్పర్ గ్రావెల్‌ను తరలిస్తోంది. టిప్పర్ నామ్ రోడ్డులో సోమవారం వేకువజామున చినకొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకునే సమయంలో హైదరాబాద్ నుంచి కందుకూరు, కామేపల్లి వెళ్తున్న ట్రావెల్స్ బస్ ఢీకొన్నాయి. దీంతో టిప్పర్ నామ్ రోడ్డుపై బోల్తా పడింది. ట్రావెల్స్ బస్ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో బస్‌లో ప్రయాణిస్తున్న మద్దిపాడుకు చెందిన ఏ. సామ్యూల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చీమకుర్తికి చెందిన జి.అనూష, కొండపికి చెందిన శైలజ, ట్రావెల్స్ బస్‌డ్రైవర్ కూడా గాయపడ్డారు. సామ్యూల్, అనూష, శైలజలను 108 వాహనంలో ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ట్రావెల్స్ బస్‌డ్రైవర్‌కు 108 సిబ్బంది స్థానికంగానే ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి ఆందోళన చెందారు. ఘటనాస్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు. టిప్పర్ నామ్ రోడ్డుపై అడ్డంగా పడిపోవటంతో, ట్రావెల్స్ బస్ రోడ్డు పైనే నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రోడ్డుపై ఉన్న వాహనాలను తొలగింపచేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



గాయపడ్డ మహిళలు అనూష,శైలజ



నుజ్జునుజ్జు అయిన ట్రావెల్స్ బస్సు ముందుభాగం, బోల్తాపడిన టిప్పర్

వీరిది కసి.. వారిది ఆశ..

(5వ పేజీ తరువాయి)

ఇచ్చే విధంగా ఒప్పందం జరిగినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శరీరంపై అన్నిచోట్ల పొడిచారని భావిస్తున్నారు. వీరయ్య మెడపైన, గుండెపైన, పొత్తి కడుపునకు పక్కలో లోతుగా దిగిన కత్తిపోట్లకే ఆయన ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని తెలుస్తోంది. హంతకులు తదనంతరం ఎక్కడపడితే అక్కడ కత్తితో పొడవటం, గీయడం చేశారని అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించిన ఒక డాక్టర్ 50 పైగా కత్తిపోట్లు ఉన్నాయన్న సమాచారం ఇవ్వడం కూడా గమనార్హం. ఈ కత్తిపోట్ల ఒప్పందం ప్రకారమే రూ.కోటికిపైగా హంతకులకు అందినట్లు పోలీసులు అంచనాలు వేస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే 50శాతం డబ్బులు ఇచ్చే ఒప్పందం మేరకు ఆ రోజు రాత్రి వీరికి రూ.40లక్షల నుంచి రూ.50 లక్షలు అందేవిధంగా ఏర్పాటు చేసినట్లు కూడా పోలీసులు విచారణలో నిర్ధారణ అవుతున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా వీరయ్యను అంతమొందించాలనే కసి, భారీగా సొమ్ము చేసుకోవాలనే హంతకుల ఆశ కలిసి వీరయ్య శరీరంలో భారీగా కత్తిపోట్లతో దాడి చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

చేపల పులుసు కోసమే ఆ హోటల్‌కు

హత్య జరిగిన రోజు మధ్యాహ్నం ఒంగోలులో కొత్తగా ప్రారంభించిన ఒక హోటల్‌లో దొరికిన సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు మరికొందరిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేశారు. వైసీపీ మండల ప్రజాప్రతినిధిగా ఉన్న ఒకరు గత ఎన్నికల్లో సొంత మండలంలో టీడీపీకి సహకరించి, ఒంగోలులో వైసీపీ శ్రేణులతో తిరుగుతూ ఇటీవల హోటల్ వ్యాపారంలోకి ప్రవేశించారు. ఆ హోటల్ సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఘటన జరిగిన 22వ తేదీ మధ్యాహ్నం ఆ హోటల్‌కు 10 నుంచి 13 మందితో కలిసి వైసీపీ ఎంపీపీ భర్త మధ్యాహ్నం హోటల్‌కు వచ్చారు. కొంత సమయం అటుఇటుగా ఈ హత్యలో సూత్రధారుల్లో ఒకరుగా భావిస్తున్న అమ్మనబ్రోలు వాసి వెళ్లారు. ఆయన సదరు ఎంపీపీ భర్తతో మాట్లాడటం సీసీ పుటేజీలో స్పష్టంగా కనిపించింది. తదనుగుణంగానే ఎంపీపీ భర్తను పోలీసులు పిలిచి విచారణ చేశారు. ఆ హోటల్‌లో చేపల పులుసు బాగుంటుందనే నానుడితో సహచర మిత్రులు వెళ్దామనగా వెళ్లి భోంచేసి బయటకు వచ్చే సమయంలో సదరు నాగులుప్పలపాడు వాసి ఎదురయ్యాడని, ఆయన అన్నా బాగున్నావా అని అడిగితే బాగున్నానని చెప్పి వచ్చేశానే తప్ప ఎటాంటి సంభాషణ అక్కడ జరగలేదని సదరు ఎంపీపీ భర్త పోలీసులకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సూత్రధారుల్లో ఒకరు, ఎంపీపీ భర్త ఒక్క నిమిషంపాటు మాట్లాడుకున్నట్లు కూడా సీసీ కెమెరాల్లో కనిపించింది. దీంతో పోలీసులకు అంతకుముందు ఏడాది క్రితమే అమ్మనబ్రోలులో పెట్రోలు బంక్ నిర్వహణకు సంబంధించిన విషయంపై సదరు వ్యక్తితో మట్లాడానే తప్ప ఆ తర్వాత ఎటువంటి ఫోన్ సంభాషణ కూడా జరగలేదని స్పష్టం చేశారు. దీంతో పోలీసులు అతను సెల్‌ఫోన్‌లోని సమాచారం డౌన్‌లోడ్ చేసుకొని తదుపరి విచారణ చేపట్టారు. హోటల్ నిర్వాహకుడికి గతంలో పక్క జిల్లాలోని ఆయన మండలంలో ఇసుక వ్యాపారం చేసిన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుత కేసు హంతకులకు లీడర్‌గా భావిస్తున్న అనుమానితుడు కూడా ఒంగోలులో ఇసుక వ్యాపారం చేశారు.వారి మధ్య ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

గాలింపు ముమ్మరం

ఈ కేసు పూర్తిస్థాయిలో కొలిక్కి వచ్చేందుకు హైదరాబాద్‌లో ఉన్న అమ్మనబ్రోలుకు చెందిన పారిశ్రామిక వేత్త, హంతక ముఠాకు నాయకత్వం వహించిన ఇసుక వ్యాపారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. వీరిద్దరి సమీప బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పారిశ్రామికవేత్త మామ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరు ఘటన జరిగిన రాత్రి కొన్ని గంటల నుంచి వారి కోసం విశాఖ, హైదరాబాద్‌లలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తుండగా దర్యాప్తులో పురోగతి వచ్చిందనే సమాచారం పోలీసు వర్గాలు తెలుపుతున్నారు. అయితే ఆ ఇద్దరికి చెందిన సమాచారం బయటకు పోక్కకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో ఈ కేసు పురోగతి సంబంధించి ఏ క్షణంలోనైనా మరింత సమాచారం పోలీసులకు లభించే అవకాశం కనిపిస్తోంది. హంతకుల్లో ఒకరిద్దరు నెల్లూరు ప్రాంతవాసులుగా గుర్తించి అక్కడ కూడా కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

అవీఇవీ

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఉద్యోగులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే సచివాలయాల సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు వారి అవసరాల నిమిత్తం సచివాలయానికి వచ్చినపుడు వారిచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కారం చేసి జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారికి అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులకు లబ్ధిచేకూరే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజల్లో అపోహలు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ప్రజాసంక్షేమ పాలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని, అందుకు అనుగుణంగా మీరూ పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ శ్రీనివాసులు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సేద్యం లాభదాయకం



మట్టి నమూనా సేకరణలో అవగాహన కల్పిస్తున్న ఏవో

పెద్దదోర్నాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షల ఆధారంగా సేద్యం చేస్తే లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ చెప్పారు. మండలంలోని హసనాబాద్, ఎగువ చెర్లోపల్లి గ్రామాల్లో మట్టి పరీక్షల నమూనా సేకరణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సేద్యం చేసే భూముల్లో మట్టి పరీక్షలు చేయించడం ద్వారా లోపాలను గుర్తించి సరిచేయడం వల్ల పంటలు బాగా పండుతాయన్నారు. భూసార పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా చేస్తోందని, అదేవిధంగా చౌడు భూముల్లో సారవంతం చేసేందుకు జిప్సం, జింక్, పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము పిల్లిపెసర విత్తనాలు రాయితీపై సరఫరా చేస్తోందని చెప్పారు. ఏఈవో చైతన్య పాల్గొన్నారు.

ఉచిత వేసవి క్రీడా శిక్షణ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాల క్రీడామైదానంలో రాయల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీకే రహమతుల్లా, డీఎస్ రామకృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి ఈ శిక్షణ ప్రారంభమవుతుందని ఫుట్‌బాల్, వాలీబాల్‌లలో శిక్షణ ఇస్తామన్నారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో డాగ్, బాంబు స్క్వాడ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రైల్వే పోలీసులు అప్రమత్తం అయ్యారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు రైల్వే ఇన్‌స్పెక్టర్ షేక్ మౌలా షరీఫ్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య సంయుక్తంగా తమ సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. డ్యాగ్ స్క్వాడ్ సహకారంతో ఒంగోలు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిచారు. బాంబ్ స్క్వాడ్‌తో పార్శిల్ కార్యాలయంలో పరిశీలించి తనిఖీలు చేశారు. రైళ్లలో ఈక్యూ బెర్తులు కేటాయిస్తే వారి ఆధార్ కార్డును తీసుకోవాలని టీటీఈలకు సూచనలు చేశారు.

మిలటరీ మద్యం పేరుతో మోసం

(5వ పేజీ తరువాయి)

కొంతమేర డిమాండ్ తగ్గింది. అయినప్పటికీ మండలంలోని బోయదుంపల (వైడీ.పాడు) చెందిన ఒక వైసీపీ కార్యకర్త తక్కువ ధరకే మిలటరీ మద్యం సరఫరా చేస్తానంటూ మోసాలకు పాల్పడుతున్నాడని పలువురు వైసీపీ నాయకులే చెప్తున్నారు. దీని కోసం సదరు వ్యక్తి వైసీపీలోని కొందరితో ఓ గ్రూపు ఏర్పాటు చేశాడు. ఆ గ్రూపునకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫొటోను ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్నాడు. తన పేరు, ఇంటి పేరు, మాజీ ముఖ్యమంత్రి పేరుతో కలిసి వచ్చేలా పేరు పెట్టున్నాడు. ఆ గ్రూపులో ఉన్న ఫోన్ నంబర్లకు వ్యక్తిగతంగా తక్కువ ధరకే మిలటరీ మద్యం పేరుతో సందేశాలు పంపుతున్నాడు. ఆ మద్యం కొనుగోలుకు ఆసక్తిచూపిన వారి నుంచి ముందుగానే డబ్బులు తీసుకొని సరఫరా మాత్రం చేయడం లేదు. దీంతో పలువురు బాధితులు లబోదిబోమంటున్నారు.

పెద్దారవీడు నుంచి మార్కాపురం వరకు బాధితులే..

సదరు వ్యక్తి బాధితులు ఇటు పెద్దారవీడు నుంచి మార్కాపురం వరకు ఉన్నారు. మిలటరీ మద్యం తక్కువకు వస్తుందన్న ఆశతో వైసీపీ నాయకులు సదరు ఆర్థిక నేరగానికి వేలల్లో డబ్బులు ఫోన్‌పే, గూగుల్ పేల ద్వారా పంపారు. మద్యం కోసం మళ్లీ ఫోన్ చేస్తే దొరకడు. ఎలాగోలా పట్టుకున్నా, కొద్దోగొప్పో తిరిగి ఇచ్చి మీ ప్రాప్తం ఇంతే అంటూ సర్దిపుచ్చుతున్నారు. సదరు ఆర్థిక నేరగానికి బాధితుల్లో వైసీపీ పెద్దారవీడు మండల మాజీ అధ్యక్షుడు, కలనూతల, మద్దలకట్ట, తమ్మడపల్లి గ్రామాలకు చెందిన పలువురు సర్పంచులు వారి అనుచరులు కూడా ఉన్నట్లు సమాచారం. మొత్తం మీద మిలటరీ మద్యం పేరుతో సదరు వైసీపీ కార్యకర్త ఇప్పటికే లక్షల్లో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది.

మద్యం పేరుతో మభ్యపెట్టాడు

జగన్ ఫోటో పెట్టి మోసం చేశాడు. తక్కువ ధరకు మద్యం వస్తుందన్న ఆశతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేశాం. మా డబ్బులు ఇవ్వలేదు. మద్యం ఇవ్వలేదు. అంత మోసగాడు అని అనుకోలేదు. నా ఒక్కరినే కాదు మండలంలో పలువురు నాయకులను జగన్ పేరు, ఫొటో పెట్టుకొని మోసం చేశాడు. పోలీసులు దృష్టిసారిస్తే మేము వాస్తవాలు వెల్లడిస్తాం.

వైసీపీ మాజీ మండలాధ్యక్షుడు, పెద్దారవీడు

ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్లు

(5వ పేజీ తరువాయి)

వేశారని గుర్తించి ఎంపీడీవోకు నివేదిక అందజేశారు. ఎంపీడీవో శ్రీనివాసులు ఏపీవో నివేదిక ఆధారంగా మర్రివేముల ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావును సస్పెండ్ చేయాలని కోరుతూ పీడీకి లేఖ రాశారు. గతవారం ఇదే గ్రామంలో ఉపాధి కూలీల నుంచి రూ.200 అక్రమంగా వసూలు చేస్తున్నారని సీఎంవోకు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే మండలంలోని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు కుమ్మక్కై ఉపాధి కూలీల డబ్బులు మెక్కేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



'అక్షయ తృతీయ' అంటే ప్రస్తుత కాలంలో కేవలం బంగారం కొనే రోజుగా విపరీతమైన ప్రచారం జరుగుతోంది. దానికి కారణం ఈ రోజున బంగారం కొంటే ఇంట్లో బంగారానికి కొదవ ఉండదని, మరుసటి సంవత్సరం అక్షయ తృతీయ నాటికి ఐశ్వర్యం రెట్టింపు అవుతుందని కొన్ని వ్యాపార సంస్థలు, కొందరు పండితులు కొన్నేళ్లుగా విపరీతంగా ప్రచారం చేయటమే. దీనికోసం చేతిలో డబ్బులు లేకపోయినప్పటికీ కొంతమంది అప్పు చేసి మరీ అక్షయతృతీయన బంగారం కొంటుంటారు. అలా కొంటే అది రెట్టింపు అవటం అటుంచి, చేసిన అప్పులు మాత్రం రెట్టింపు కావడం ఖాయం. అయితే దీనికి శాస్త్రబద్ధమైన ఆధారం కానీ, పురాణ సంబంధమైన రుజువుకానీ లేవనే చెప్పాలి. మరి అక్షయ తృతీయ ప్రాశస్త్యం ఏమిటి? ప్రజల్లో ఇంతగా ఎందుకు ప్రచారం జరుగుతోంది అనే విషయాలను పరిశీలిద్దాం..

అక్షయతృతీయ పర్వదినం

అమిత ఫలదాయకం

- ఆరోజు చేసే ఏ వ్రతానికైనా రెట్టింపు ఫలం
- ముఖ్యంగా దానాలు చేయాలంటున్న పండితులు

రేపే పండుగ

ఒంగోలు (కల్చరల్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పురాణాల ప్రకారం ఏ విషయమైనా మనకు పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పటం ద్వారానే లోకంలోకి వచ్చింది. అందుకే దాదాపు అన్ని వ్రత కథల్లోనూ 'ఈశ్వరౌవాచ' అంటారు. మానవుల అన్ని కోరికలు తీర్చే వ్రతం ఏది, అది ఏ రోజున చేస్తే ఎక్కువ ఫలితం ఉంటుంది అని పార్వతీదేవి పరమేశ్వరుని అడిగినప్పుడు ఆయన 'సర్వకామప్రద వ్రతాన్ని' గురించి చెప్పాడని మత్స్యపురాణం చెబుతుంది. ఈ సర్వకామప్రద వ్రతం వైశాఖ శుద్ధ తృతీయ నాడు చేస్తే రెట్టింపు ఫలం లభిస్తుందని, ఆరోజున చేసేటువంటి ఏ జపమైనా, హోమమైనా, దానమైన ఎటువంటి పుణ్యకార్యమైనా ఇదేవిధమైన ఫలితాన్ని ఇస్తుందని ఆయన చెబుతాడు. ఎందుకంటే ఈరోజున తృతీయా తిథి బ్రహ్మతో కలిసి ఉంటుంది. అందువల్ల ఈ రోజున చేసే ఏ మంచి పనియొక్క ఫలితమైనా 'క్షయం' కాకుండా 'అక్షయం'గా నిలుస్తుంది. శ్రీమహావిష్ణువుకు అక్షయుడు అని పేరు. అందుకే ఈ అక్షయతృతీయ నాడు శ్రీమహావిష్ణువును పూజించటం శ్రేష్ఠం అంటారు. మత్స్యపురాణం ప్రకారం అక్షయతృతీయ నాడు శ్రీమహావిష్ణువును పూజిస్తే రాజసూయ యాగం చేసిన ఫలితం కలుగుతుందని ప్రతీతి. అక్షతలు అంటే ఏ మాత్రం విరగని బియ్యం అని అర్థం. అందుకే ఈ అక్షయతృతీయ రోజున గట్టిగా ఉన్న బియ్యం లేదా గోధుమలు, యవలు వంటి వాటిని, నీటితో నింపిన మట్టి పాత్రను బ్రాహ్మణులకు దానం చేయాలని నారద పురాణ ప్రతీతి.

ఈ అక్షయతృతీయ పర్వదినానికి ఎన్నో ప్రాముఖ్యతలు ఉన్నాయి. ఈ రోజునే శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఆరవ అవతారమైన పరశురాముడుగా జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. పవిత్ర గంగా నది భూమి మీదకు వచ్చింది, త్రేతాయుగం మొదలైంది, వ్యాసమహర్షి మహాభారతాన్ని వినాయకుని సహాయంతో రాయడాన్ని మొదలుపెట్టింది, అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులకు సూర్యభగవానుడు 'అక్షయపాత్ర' ఇచ్చింది, శివపురాణం ప్రకారం సకల సంపదలకు అధిపతిగా కుబేరుడిని శ్రీమహాలక్ష్మి నియమించింది ఈరోజునే. ఆదిశంకరాచార్యులు శ్రీమహాలక్ష్మిని ప్రార్థిస్తూ 'కనకధారాస్తవం' చెప్పింది ఈ రోజునే. ఈ విధంగా శాస్త్ర, పురాణ సంబంధంగా అక్షయతృతీయ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఈ రోజున చేసే పుణ్యకార్యాలకు ఫలితం అక్షయంలా పదింతలై మనకు వస్తుందని పురాణాలు చెప్పాయేకానీ ఎక్కడా కూడా ఈ రోజున బంగారం వంటి వస్తువులను కొంటే మన ఇంట్లో బంగారం రెట్టింపు అవుతుందని చెప్పలేదు. కానీ కొన్ని సంవత్సరాలుగా 'అక్షయతృతీయ' సందర్భంగా నగల వ్యాపారులు విపరీతమైన ప్రచారాన్ని నిర్వహించటం, ప్రజలు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనటం మనం చూస్తున్నాం. జిల్లాలో సైతం అక్షయతృతీయ సందర్భంగా బంగారు నగల వ్యాపారులు ప్రజలను ఆకర్షించే విధంగా వివిధ ఆఫర్లు ప్రకటించటం, ప్రజలు సైతం తమ శక్తికొద్దీ బంగారాన్ని కొనటం జరుగుతోంది.

ఆశించినమేర అమ్మకాలు ఉండకపోవచ్చు

ఈ సంవత్సరం అక్షయ తృతీయ సందర్భంగా జిల్లాలో బంగారం అమ్మకాలు ఆశించిన మేర ఉండవని బంగారు నగల వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. దీనికి ముఖ్య కారణం ఇటీవలి కాలంలో భారీగా పెరిగిన బంగారం ధర. పెరిగిన బంగారం ధర మధ్యతరగతి వారికి సైతం అందనంత ఎత్తులో ఉంది. దీంతో అక్షయ తృతీయ సెంటిమెంట్‌తో ప్రతి సంవత్సరం జరిగే అమ్మకాలు భారీగా తగ్గుతాయన్న భావన వ్యాపారవర్గాల్లో నెలకొంది.

వేమవరంలో దాహం కేకలు

- 15ఏళ్లుగా తాగునీటికి నోచుకోని గ్రామస్థులు
- నిర్వీర్యమైన రక్షిత నీటి పథకం
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- పైపులు దొంగలపాలు

మర్రిపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమవరం ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. 15 సంవత్సరాలుగా సమస్య వేధిస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన రక్షిత నీటి పథకం నిర్వీర్యమైంది. నీటి ట్యాంకులు అలంకారప్రాయంగా మారాయి. పైపులైన్‌లు దొంగలపాలయ్యాయి. దీంతో గ్రామంలోని రెండు వేల మందికిపైగా ఉన్న ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. గ్రామం మీదుగా కనిగిరికి రామతీర్థం జలాలు సరఫరా అవుతున్నప్పటికీ గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీరు దొరక్క తల్లడిల్లుతున్నారు. గతంలో కూచిపూడి నుంచి వేమవరం వరకు పైపులైన్ ద్వారా సాగర్ నీటిని గ్రామానికి సరఫరా చేసేవారు. అప్పట్లో రెండు గ్రామాలకు మధ్యలో 40వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఓఎల్‌ఎస్‌ఆర్ నిర్మించారు. గ్రామంలో మరో ఓఎల్‌ఎస్‌ఆర్ ఏర్పాటు చేసి రక్షిత కొళాయిలు అమర్చారు. 20 ఏళ్లపాటు నిరాటంకంగా సాగర్ జలాలు గ్రామ ప్రజల దాహార్తిని తీర్చాయి. ఆ తరువాత అధికారుల నిర్వహణ లోపంతో రక్షిత నీటి పథకం మూలనపడింది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

గ్రామ సర్పంచ్ ముప్పరాజు సుబ్బయ్య పలుమార్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో సమస్య తీవ్రతను తెలియజేసి పరిష్కరించాలని కోరినా ఫలితం కరువైంది. పైపులైన్‌ను పునరుద్ధరించి తాగునీటిని సరఫరా చేయాలని ప్రజాప్రతినిధులను, అధికారుల పలుసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.21 లక్షలు మంజూరు చేసింది. అయితే సాగర్‌నీటి పథకానికి జలజీవన్ మిషన్ నిధులు వినియోగించే వీలులేదని అధికారులు స్పష్టం చేయడంతో గ్రామస్థుల ఆశలు అడియాశలయ్యాయి. గత ఏడాది కూచిపూడి నుంచి వేమవరం వరకు కొత్తపైపులైన్ ఏర్పాటుకు రూ.30 లక్షలతో అంచనాలు రూపొందించారు. ఆ ప్రతిపాదనలు సైతం కార్యరూపం దాల్చకపోవడంతో నీటి తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్తపైపులైన్ ఏర్పాటుకు నిధుల మంజూరుపై గ్రామస్థులు ఆశలు పెంచుకున్నారు. రాష్ట్ర మంత్రి స్వామి చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకొంటున్నారు.



వేమవరం సమీపంలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంక్

వైసీపీ ప్రభుత్వం వేధించింది.. ఈ ప్రభుత్వం బాసటగా నిలిచింది

- మంత్రి స్వామికి డెయిరీ వీఆర్‌ఎస్ ఉద్యోగుల కృతజ్ఞతలు



మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలుపుతున్న డెయిరీ వీఆర్‌ఎస్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

ఒంగోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు డెయిరీ వీఆర్‌ఎస్ ఉద్యోగుల కీలక సమస్యల పరిష్కారానికి ప్రత్యేకచొరవ చూపి పరిష్కారానికి కృషి చేసిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామికి ఆ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. తూర్పునాయుడు పాలెంలోని మంత్రి స్వామి కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులు బీఎం.శ్రీనివాసరావు, యు.బ్రహ్మయ్య, తిరుపతిస్వామి, జె.ఆంజనేయులు తదితరులు కలిసి శాలువ కప్పి సత్కరించారు. వైసీపీ పాలనలో డెయిరీని మూసేసి బలవంతంగా తమకు వీఆర్‌ఎస్ ఇచ్చి గెంటివేసిందని, కనీసం ఆ సమయంలో ఇచ్చిన ఆర్థికపరమైన హామీలు కూడా అమలు చేయలేదని అన్నారు. వేతనాలు, పీఎఫ్ వాటా చెల్లింపులను ఏళ్ల తరబడి ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం తమను వేధింపులకు గురిచేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. ఆ విషయంలో తమ అవేదనను సానుకూలంగా అర్థం చేసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మంత్రి స్వామి తీసుకున్న చొరవ పట్ల వారు ఆనందం వ్యక్తంచేశారు. తాము మంత్రి దృష్టికి తీసుకెళ్లిన మూడు నెలల్లో అన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయని అందుకు ప్రభుత్వానికి, మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు టెక్నికల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో డిప్లమో కోర్సులో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రకాశం పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ కోరారు. ఈనెల 30న జరగనున్న పాలిసెట్ నిర్వహణపై సోమవారం పరీక్షా కేంద్రాల చీఫ్‌లతో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో శివప్రసాద్ మాట్లాడుతూ పాలిసెట్‌కు 4,600 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఒంగోలులో ఏడు, మార్కాపురం నాలుగు పరీక్షా కేంద్రాలను కలిసి మొత్తం 11 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. 11 గంటల తర్వాత నిమిషం లేటుగా వచ్చినా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఆయన స్పష్టంచేశారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలన్నారు. విద్యార్థులు ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లో సమాధానాలను పెన్సిల్‌తో బబుల్ చేయాలన్నారు. ఒంగోలులోని ఏడు కేంద్రాల్లో 2,900 మంది, మార్కాపురంలోని నాలుగు కేంద్రాల్లో 1,100 మంది విద్యార్థులను కేటాయించినట్లు తెలిపారు. ఈ పరీక్షకు రాష్ట్ర పరిశీలకులుగా ఓబలవారిపల్లి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ దేవానంద్, కో ఆర్డినేటింగ్ సెంటర్ పరిశీలకులుగా నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి రాంప్రసాద్‌ను నియమించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులూ కల్పించాలని శివప్రసాద్ కోరారు.

ఒక్కరోజే రూ.కోటి పన్నులు వసూలు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు పలువురు యజమానులు పాత బకాయిలపై 50 శాతం రాయితీని వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా చెల్లించాల్సిన పన్నుల చెక్కులను కమిషనర్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. అనంతరం కమిషనరు మాట్లాడుతూ సోమవారం ఒక్కరోజే సుమారు రూ.1.3 కోట్లు పన్నులు చెల్లింపులు జరిగాయన్నారు. ఆస్తి పన్ను రూ.97.17 లక్షలు, ఖాళీ స్థలాల పన్ను 1.21 లక్షలు, తాగునీటి పన్ను రూ.4.27 వేలు వసూలు అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి విజయభాస్కర్, ఆర్‌ఐ కళ్యాణి పలువురు ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడి దర్శనం

కంభం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కంభంలో వెలసిన వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు ఆదివారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామి వారికి భక్తులు కాయకర్పూరాలు సమర్పించారు. కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



కంభంలో హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామి

ఇంటింటా సోలార్!

- పీఎం సూర్యఘర్ పథకం కింద సబ్సిడీపై సోలార్ ఏర్పాటు
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలంటున్న విద్యుత్ శాఖ

సోలార్ ప్యానల్ బోర్డు (3 కిలోవాట్లు)



ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ ఆదా, విద్యుత్ ఉత్పత్తితో పాటు కోతలు లేని విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ప్రతి ఒక్కరికి ఇంటింటా సోలార్ ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అందుకు అవసరమైనవి కేవలం ఆధార్, పాన్‌కార్డు, కరెంట్ బిల్లు, బ్యాంక్ ఖాతా ఉంటే చాలు అంటున్నారు ఎర్రగొండపాలెం విద్యుత్ శాఖ అధికారులు. అందుకు సంబంధించి ఏఈ అల్లూరయ్య వివరాలు ఇలా ఉన్నాయి.

సోలార్‌కు రాయితీ...

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకునేందుకు యాప్‌లో వినియోగదారుడు వివరాలు నమోదు చేసుకోవాలి. ఎంపిక చేసిన ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారుని ఇంటికి వెళ్లి సోలార్‌ను ఏర్పాటు చేస్తారు. ఒక కిలోవాట్ సోలార్ సిస్టం కెపాసిటీకి గాను రూ.81 వేలు చెల్లించాలి. ఇందులో సబ్సిడీ రూ.30వేలు వినియోగదారుడికి వెళుతుంది. ఈ డబ్బును కట్టాల్సిన అవసరం ఉండదు. మిగిలిన రూ.50వేలు బ్యాంక్ ద్వారా లోన్ రూపంలో తీసుకోని నెలనెలా కంతుల వలే కట్టాల్సి ఉంటుంది. రెండు కిలోవాట్ల సోలార్‌కు రూ.1,54,000 కాగా, సబ్సిడీ రూ.60వేలు వస్తుంది. మూడు కిలోవాట్లకు అయితే రూ.2,06,400 కాగా సబ్సిడీ రూ.78వేలు వస్తుంది.

విద్యుత్ నిల్వతో పాటు ఆదాయం

గతంలో సోలార్ ప్లాంట్ ద్వారా తయారైన విద్యుత్ బ్యాటరీలలో నిల్వచేసి రాత్రి వేళల్లో ఇంటి అవసరాలకు ఉపయోగించేవారు. ప్రస్తుతం బ్యాటరీలు లేకుండానే ఇన్వర్టర్ సాయంతో డీసీ కరెంటును ఏసీ కరెంట్‌గా మార్చేసి నేరుగా గ్రిడ్‌కు అనుసంధానిస్తున్నారు. ఇంట్లో ఏర్పాటు చేసిన నెట్ మీటర్ సాయంతో ప్రతి 6 నెలలకోసారి ఎన్ని యూనిట్లు వాడుతున్నామో, ఇంకా ఎన్ని యూనిట్లు విద్యుత్ మిగిలి ఉందో డిస్కమ్ లేక్క తీస్తుంది. లబ్ధిదారులు ఖర్చుచేయగా మిగిలిన యూనిట్లు లెక్కవేసి రూ.7 చెప్పున లెక్కించి లబ్ధిదారుని ఖాతాల్లో జమ చేస్తారని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.



సోలార్ ప్యానల్‌కు సంబంధించిన బోర్డు, మీటరు

విద్యుత్ ఆదా అవుతోంది

3 కిలోవాట్ల ప్యానల్ ఏర్పాటు చేసుకున్నాం. గతంలో విద్యుత్ వినియోగం కంటే సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్నాక విద్యుత్ ఆదా అవుతోంది. విద్యుత్ అంతరాయం సమస్య లేదు.

- వెంకట లక్ష్మమ్మ

విద్యుత్ ఉత్పత్తి ఇలా...



వై.పాలెంలో సోలార్ ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారుడు

సాధారణంగా ఎండ బాగా ఉన్న రోజుల్లో ప్రతి కిలోవాట్‌కు రోజుకు 4 యూనిట్ల కరెంటు ఉత్పత్తి అవుతుంది. అంటే ఇంటిపై ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే ప్రతిరోజూ 12 యూనిట్లు కరెంట్ ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్ తయారవుతుంది. వాతావరణం చల్లగా ఉండి వర్షాకాలంలో మాత్రం కొంత తగ్గిపోతుంది. వేసవి కాలంలో రోజుకు సుమారుగా 15 యూనిట్ల చెప్పున నెలకు 450 యూనిట్ల వరకు ఉత్పత్తి అవుతుంది. ఇందులో నెలకు 250 నుంచి 300 యూనిట్లు ఖర్చు చేసిన మిగిలిన 100 యూనిట్లు విద్యుత్‌ను డిస్కమ్ గ్రీడ్‌లకు వెళ్లిపోతుందని అధికారులు చెబుతున్నారు.

ఎర్రగొండపాలెం 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఇంటింటికీ సోలార్ ప్యానల్స్‌ను 15 బిగించామని, వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నామని ఏఈ అల్లూరయ్య తెలిపారు. కొంతమంది వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. విద్యుత్ ఆదా చేసి మరికొంత మందికి విద్యుత్ సరఫరా చేసేలా వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ



కొత్తమామిడిపాలెం చెరువు అలుగు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ గంగాడ సుజాత

చెరువు అలుగు నిర్మాణానికి భూమిపూజ

ఒంగోలు(రూరల్),ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని కొత్తమామిడిపాలెం చెరువు అలుగు నిర్మాణానికి కార్పొరేషన్ చైర్మన్ గంగాడిసుజాత భూమి పూజాకార్యక్రమం నిర్వహించారు. చెరువుకు అలుగు లేక నీరంతా బయటకు పోతున్నందున కార్పొరేషన్ అలుగు నిర్మాణానికి రూ. 10 లక్షలు కేటాయించిందని అన్నారు. కమిషనర్ ఎం .వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెరువు అలుగు నిర్మాణం పూర్తి అయితే చెరువు నిండిన తరువాత నీరు పుష్కలంగా ఉంటుందన్నారు. చెరువు నీటితో గ్రామస్థులకు , పశువులకు తాగునీటి సమస్య ఉండదన్నారు. వారంరోజులో పనులు పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మునిసిపల్ ఎంఈ చంద్రయ్య, డీఈ ఏసయ్య, ఏఈ డి.అనిల్‌కుమార్, స్థానిక నాయకులు జోలాసుబ్బారావు, మేదరమెట్ల రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

షిఫ్ట్ ఆపరేటర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎర్రగొండపాలెం మండలం కొలుకులకు చెందిన వెలవల చంటి కుటుంబాన్ని ఆదుకోవాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ కోరారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట చంటి కుటుంబ సభ్యులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షిఫ్ట్ ఆపరేటర్ కుటుంబం రోడ్డున పడకుండా మానవతా దృక్పథంతో ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో త్యాగరాజు, కొలకలూరి విజయ్‌కుమార్, పత్రా బంగారం, వంశీ, మంద ఆశీర్వాదం, మందజాన్, సుధాకర్, వెలివల చిన్నయ్య, గురవయ్య తదితరులు ఉన్నారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సిబ్బంది, విద్యార్థులు

డ్రగ్స్ రహిత ప్రాంగణంగా ఏకేయూ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్శిటీ (ఏకేయూ) ప్రాంగణాన్ని డ్రగ్స్ రహిత ప్రాంగణంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన ధ్యేయమని యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజమోహనరావు అన్నారు. సోమవారం స్థానిక ఏకేయూలో యాంటీడ్రగ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజమోహన్‌రావు మాట్లాడుతూ సమాజాన్ని, యువతను చెడు మార్గంలో పయనింపజేస్తున్న డ్రగ్స్‌వినియోగం పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో యూనివర్శిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

సంతనూతలపాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలోని మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను ఎంపీడీవో డి.సురేష్‌బాబు ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. ఎంపీపీ బి. విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ, మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడకాస్వాములు, టైలరింగ్ శిక్షణ జిల్లా రిసోర్స్‌పర్సన్ వెంకటరత్నం, మండలపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

సంతనూతలపాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వేసవి శిక్షణ తరగతుల శిబిరాన్ని ప్రారంభించారు. స్పోకెన్ ఇంగ్లీషు, పుస్తకపఠనం, బొమ్మలు గీయడం, ఆటలు, డ్యాన్సులు తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రంథాలయ అధికారి సత్యనారాయణ తెలిపారు. జూన్ 6వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మీకోసంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలురకాలసమస్యలను విన్నవించారు. ప్రజలనుంచి వచ్చిన అర్జీలను ఆయాశాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 268 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేసు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు పార్థసారధి, మాధురి, విజయజ్యోతి తదితరులు ఉన్నారు.

● ఒంగోలులోని పాలడెయిరీని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని అబ్బూరి శ్రీనివాసరావు, జాగర్లమూడి పూర్ణచంద్రరావులు కోరారు. డెయిరీ మూతపడటంతో పాడిపరిశ్రమ దెబ్బతిందన్నారు. అందువల్ల ఈ డెయిరీని పునరుద్ధరించి పాడిరైతులను ఆదుకోనే విధంగా చూడాలని కోరారు.

● జిల్లాలోని ఉర్దూమీడియం పాఠశాలల్లో ఉర్దూ సెకండరీ గ్రేడ్ పోస్టులను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నేతలు షేక్ అన్వర్‌బాషా, జీఎండీ వలీలు కోరారు. ఉర్దూమీడియం సెకండరీ గ్రేడ్ పోస్టులను సర్‌ప్లస్ జాబితా నుంచి తొలగించాలని కోరారు.

● కోడలు వేధింపుల నుంచి రక్షించాలని గిద్దలూరుకు చెందిన హెచ్ లక్ష్మీదేవి కోరారు. కుమారుడు చనిపోయాడని, కోడలు ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అనేక ఇబ్బందులు పెడుతూ ఇంట్లోకి కూడా రానివ్వడం లేదనిఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

● ఎస్పీ గ్రీవెన్స్‌కు 69 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుడి సమస్యను వింటున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులపై అలసత్యం వహించ వద్దని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 69 ఫిర్యాదులు ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే చట్టపరిధిలో పరిష్కరించాలని అన్నారు.

ముఖ్యమైన ఫిర్యాదులు

జిమ్ కోసం స్థానిక కర్నూల్‌రోడ్డులోని ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్న వ్యక్తి యజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసి బ్యాంక్‌లో రుణం తీసుకున్నాడని, ఎంతకీ చెల్లించక పోవడంతో బ్యాంక్ నుంచి తనకు నోటీసులు వచ్చాయని ఓ బిల్డింగ్ యజమాని ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఇదేమిటని జిమ్ నిర్వాహకులను అడుగుతుంటే తనను బెదిరిస్తున్నాడని ఎస్పీ ఎదుట వాపోయారు.

● కుటుంబ అవసరాలకోసం నన్ను షూరిటీగా పెట్టి ఓ వ్యక్తి ఐదు లక్షలు రుణం తీసుకున్నాడని, చివరకు చెల్లని బ్లాంక్ చెక్ ఇచ్చాడని ఇదేమిటి అని అడిగితే బెదిరిస్తున్నాడని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరావు,సీఐలు నాగరాజు,దేవప్రభాకర్, ఎస్సైలు రజియా సుల్తానా,ప్రభాకర్ రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

‘కవనవిజయం’తో అలరించిన జిల్లా కవులు

ఒంగోలు (కల్చరల్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దివంగత డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు రచించిన సాహితీ రూపకం ‘కవన విజయం’లో జిల్లాకు చెందిన కవులు తమ ప్రతిభాపాటవంతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. చీరాల కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నాటకోత్సవాలలో భాగంగా కవనవిజయం సాహిత్య రూపకం చీరాల కేజీఎం హైస్కూల్ ఆవరణలో ప్రదర్శితమైంది. తొలుత కవులను డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు సభకు పరిచయం చేసి ప్రయోక్తగా వ్యవహరించగా డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు.

ఈ సాహిత్య రూపకంలో స్త్రీవాద రచయిత్రిగా తేళ్ల అరుణ, ప్రజాకవిగా నూకతోటి శరత్ బాబు, ప్రబంధకవిగా సీహెచ్ ఏడుకొండలు, దిగంబర కవిగా డాక్టర్ నూనె అంకమ్మ రావు, అభ్యుదయ కవిగా కప్పగంతు జయరామయ్య, భావకవిగా నట్టే ప్రసాద్, దళితకవిగా డాక్టర్ బీరం సుందర రావు, సినీకవిగా కసుకుర్తి శ్రీనివాస రావు, క్లార్క్ సూర్యారావుగా బత్తుల బ్రహ్మారెడ్డి, నవలా రచయిత్రిగా ఈదుమూడి జయంతి తదితరులు తమ పాత్రలను అద్భుతంగా పోషించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. అనంతరం నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు.



సాహితీరూపకంలో పాల్గొన్న కవులు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా 3న ప్రతిజ్ఞ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదంపై ఐక్యంగాఉద్యమించాలని వచ్చేనెల 3వతేదీన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ మాజీ కార్యదర్శి జీ ఈశ్వరయ్య, జాతీయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబులు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండించారు. ఈ దాడి భారత ప్రజాస్వామ్యంపైనే దాడిగా భావిస్తూ ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మే 3న ఉగ్రవాద ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మే 15నుంచి 18 వరకు తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలకు యువత పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.



ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.యుగంధర్, పరుచూరి రాజేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. సంతోష్‌కుమార్, కత్తి రవి, నాగరాముడు, ప్రభాకర్, సుభాని తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు

మద్దిపాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):భూమి సారవంతగా ఉంటే పంటలకు మేలు జరుగుతుందని తద్వారా దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారి కే.రమేష్ బాబు తెలిపారు. సోమవారం భూసార పరీక్షల నమూనాను సేకరించే విధానంపై శిక్షణ మద్దిపాడు వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో 18 గ్రామ సచివాలయాల పరిధిలో 18 రైతు సేవా కేంద్రాల్లో 900 మట్టి నమూనాలు సేకరించడానికి ప్రణాళిక రూపొందించామని, ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ టీచర్ల నిరసన

ఒంగోలు విద్య, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడిజిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల పునర్విభజనలో ఉర్దూ టీచర్లకు అన్యాయం జరుగుతుందని ఉర్దూ సెకండరీ గ్రేడ్ టీచర్లు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. టీచర్ల పునర్విభజన నిబంధనల వల్ల జిల్లాలో 60 మంది ఉర్దూ సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుగా తేలుతున్నారని వాపోయారు. టీచర్ల పునర్ విభజనకు ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల వల్ల ముస్లిం విద్యార్థులు తమ మాతృభాష ఉర్దూలో చదువుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉర్దూ విద్యార్థుల కోసం ఉర్దూ ఎస్‌జీటీలను నియమించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై కోరారు.

జిల్లా మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



ఎంపికయిన నూతన కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):జిల్లా మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడుగా గోపతోటి శాంసన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలు మాల ఉద్యోగుల సంఘ భవన్‌లో సోమవారం జిల్లా ఉద్యోగుల సంఘ కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా ఎంపికైంది. ఈసంఘంలో జిల్లా గౌరవాధ్యక్షుడిగా పీకా మధుసూదన్‌రావు(రిటైర్డ్),ప్రధాన కార్యదర్శిగా మద్దులూరి రమణయ్య,ఉపాధ్యక్షుడిగా చిడిపోతు నరేంద్రకుమార్, పీకా సుధాకర్,వర్కింగ్ ప్రసిడెంట్‌గా దమ్మధామస్ , ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజేంద్ర ,కోశాధికారిగా తుల్లబిల్లి శ్రీకాంత్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కట్టా సుచరిత, జాయింట్ సెక్రటరిగా స్వర్ణ యానాది, జజ్జర ఆనందరావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

1 నుంచి హైదరీ క్లబ్‌లో ‘చెస్ సమ్మర్ క్యాంప్’

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు చెస్ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, కోచ్ రాజ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి 9.30 గంటల వరకు శిక్షణ అందిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వివరాలకు సెల్ నంబర్ 8688740885 ద్వారా సంప్రదించాలన్నారు.

అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఉద్యమాల్లో త్యాగాలు చేస్తూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న జాతీయ పార్టీ నేతల పట్ల అనుచిత వ్యాఖ్యలుచేసిన ఉపసభాపవతి, ఉండి శాసనసభ్యుడు రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పట్ల రఘురామకృష్ణరాజు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సోమవారం రాత్రి స్థానిక సాగర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర కార్యదర్శివర్గ సభ్యుడు జీ రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు కంకణాల ఆంజనేయులు, కాలం సుబ్బారావు, కంకణాల రమాదేవి, రఘురాం, పి.కల్పన, జాలా అంజయ్య, తంబి శ్రీనివాసులు, టి. మహేష్, ఆదిలక్ష్మి, సీహెచ్ వినోద్, విశ్వసేన్, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ,ఎస్టీ సెల్ సీఐగా దుర్గా ప్రసాద్

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీఎస్టీ సెల్ సీఐగా ఓ.దుర్గా ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్‌ను కలిసి బొకే అందజేశారు.

3న మండల సర్వసభ్య సమావేశం

సంతనూతలపాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయంలో మే 3న మండలస్థాయి సర్వసభ్య సమావేశం జరుగనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు సోమవారం ఓ‌ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే దామచర్ల పిలుపు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలులోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన దామచర్ల మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో మే 2వ తేదీన అమరావతిలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని హాజరు కావడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో పార్టీశ్రేణులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ప్రత్యేకించి నియోజకవర్గం నుంచి 5వేల మందికి తగ్గకుండా పాల్గొనేలా చూడాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రధాన నరేంద్ర మోదీ రాజధాని నిర్మాణంలో భాగంగా రాష్ట్రానికి విచ్చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు మదన్ తోపాటు పార్టీ శ్రేణులు, మహిళా నాయకులు, ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలం, నగరానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



పొగాకు రైతుల సదస్సులో మాట్లాడుతున్న జయంతిబాబు

బర్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల 5వతేదీన చలో ముఖ్యమంత్రి కార్యాలయానికి బర్లీ రైతులు తరలిరావాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం జరిగిన బర్లీ పొగాకు రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. బర్లీ పొగాకు సాగు చేసిన రైతులందరూ పేద రైతులు అని తెలిపారు. పొగాకు కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అందువల్ల ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించి పొగాకు సాగు చేయించిన కంపెనీలు ఇప్పుడు కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం కంపెనీల వైపో, రైతుల వైపో తేల్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం కార్యదర్శి వి. బాలకోటయ్య, సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, రైతు సంఘం నాయకులు కే హనుమంతరావు, పెంట్యాల హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, టి. శ్రీకాంత్, పెంట్యాల సురేష్, పలపర్తి మోనా, నాగినేని ప్రతాప్, ఆదామ్, లింగారావు, చుండూరి శ్రీధర్, కనపర్తి సుబ్బారావు తదితరులు ఉన్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళలు

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

చీమకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనందించటానికి అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు.చీమకుర్తి మున్సిపాల్టీలో మహిళల అభ్యున్నతిలో భాగంగా అర్హత కల్గిన 143 మంది మహిళలను గుర్తించి వారికి కుట్టుమిషన్లు అందిస్తామన్నారు. వీరందరికి సోమవారం పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి, టీడీపీ నాయకులు సూరంపల్లి హనుమంతరావు, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధరరావు, అవనిగడ్డ శేషారావు,పూనాటి ధనలక్ష్మి, ఆర్పీలు పాల్గొన్నారు.



ఆర్‌జేడీకి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కాంట్రాక్టు ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టనున్న రేషనలైజేషన్, బదిలీల నేపథ్యంలో కాంట్రాక్టు లెక్చరర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ గుంటూరు ఇంటర్ విద్యా ఆర్‌జేడీని కోరారు. సర్వీస్‌కు ఇబ్బందులు లేకుండా వారిని సర్దుబాటు చేయాలని కోరారు. సోమవారం గుంటూరులో ఆర్‌జేడీ జగన్నాథం పద్మను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరిగుంట సురేష్, కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరి సైదులు,జాయింట్‌సెక్రటరి వీరయ్య తదితరులు ఆర్‌జేడీని కలిసిన వారిలో ఉన్నారు.

150 మందికి ఉచిత గుండె పరీక్షలు

సంతనూతలపాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ హెల్ప్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గుమ్మళంపాడులో ఉచితంగా 150 మందికి గుండె పరీక్షలు నిర్వహించారు. వైద్యులు జి.కిరణ్ ఆధ్వర్యంలో ఈసీజీ పరీక్షలను చేశారు. ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా విజయవాడ హెల్ప్ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌వో సంతోష్, స్థానిక టీడీపీ నేతలు ఎం.శ్రీనివాసరావు, ఎన్.కనకయ్య, బీవీ రమణారావు, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల అభివృద్ధి జరిగేనా?

- ఆరేళ్ల కిందట నీరు,చెట్టు కింద అభివృద్ధి పనులు
- వైసీపీలో పట్టించుకోని వైనం
- పూడికతో అస్తవ్యస్తంగా చెరువులు, వాగులు, కుంటలు
- ఒట్టిపోయిన బోరుబావులు

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సకల జీవరాసులకైనా, పంటలకైనా నీరే ప్రాణాధారం. భూగర్భంలో సమృద్ధిగా నీరంటూ ఉంటే బావుల ద్వారానో, బోర్ల ద్వారానో తోడుకొని పంటలు పండించ వచ్చు. ఏటికేడు భూగర్భంలో జలాలు అడుగంటుతుంటే అన్నదాతలు ఆశలు ఆవిరై పోతున్నాయి. వర్షాధారంతో సాగు చేసే పరిస్థితి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం రైతులది. ఈ ప్రాంతంలో ఉన్న నీటి వనరులు చెరువులు, కుంటలు, వాగులు పూర్తి సామర్థ్యంతో ఉన్నప్పుడే వర్షపు నీటి నిల్వ శాతం పెరుగుతుంది. ఆ నీటి వనరులను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసినప్పుడే వాన నీటిని ఒడిసి పట్టుకోగలం. కానీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితులకు భిన్నంగా తయారయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకంలో భాగంగా చెరువులు, వాగులు, కాలువలు, కుంటల్లో కంప తదితరాలను తొలగించి మేట వేసిన మట్టిని తోడి పొలాలకు తరలించడం ద్వారా నీటి సామర్థ్యం పెరిగింది. వ్యవసాయ భూములు సారవంతమయ్యాయి. భూగర్భ జలాలు పెరిగి సేద్యం లాభసాటిగా మారింది.



చిల్ల కంపతో అల్లుకుపోయిన చిన్నగుడిపాడు చెరువు



కడపరాజుపల్లె చెరువుకట్టపై పెరిగిన చిల్లకంప



నీటితో కళకళలాడుతున్న గంటవానిపల్లె చెరువు

పట్టించుకోని వైసీపీ పాలకులు

గత వైసీపీ పాలకులు పట్టించుకోక పోవడంతో చెరువులు, కుంటలు, వాగులు, కాలువల్లో చిల్లకంప పెరిగి వర్షానికి చెక్‌డ్యాంలు తెగి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వానలు పడినా వనరుల్లో నీరు లేకుండా పోయింది. దీంతో భూగర్భ జలాల సామర్థ్యం గణనీయంగా పడిపోయింది. బోరుభావులు వట్టిపోయాయి. పంటలకు కీలక సమయంలో తడులు ఇవ్వలేక ఎండిపోయి రైతులు నష్టాలను చూశారు. ఈ పరిస్థితి నుంచి బయట పడాలంటే వృథాగా పోయే వాన నీటిని భూమిలోపలికి ఇంకింప జేసుకోవడమే సరైన మార్గం.

వచ్చే ఖరీఫ్‌కైనా దృష్టి సారించేనా

ప్రభుత్వం ఏర్పడి పది నెలల కావస్తోంది. ఈ ఏడాది కూడా మండలంలో వర్షాభావం ఏర్పడింది. నల్లమల అటవీ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో వాగులు ప్రవహించి చెరువులకు పుష్కలంగా నీరు చేరింది. నీటి సామర్థ్యం కోల్పోయి ఉండడంతో ఆ నీరు ఎంతో కాలం నిల్వ లేదు. దీంతో పంట దశలో నీటి కొరత ఏర్పడింది. మండలంలో ఎగువ చెర్లోపల్లి, పెద్ద బొమ్మలాపురం, కడపరాజుపల్లె, బలిజేపల్లి,చిన్నగుడిపాడు చెరువులు పెద్దవి. అధిక విస్తీర్ణంలో ఆయకట్టు భూములు ఉన్నాయి. గంటవానిపల్లె చెరువులో ఇప్పటికీ నీరు ఉంది. వెలిగొండ ప్రాజెక్టు వ్యర్థ నీరు ప్రవహిస్తుండడంతో ఆ చెరువులోకి నీరు చేరింది. తద్వారా పరిసర రైతులకు ఉపయుక్తంగా మారింది. పెద్ద చెరువులతో పాటు చిన్న చిన్న కుంటలు, కాలువల ద్వారా పొలాలకు సాగు నీరందుతోంది. మండలం మొత్తం మీద పది వేల ఎకరాలకు పైగా ఆయకట్టు భూములు సాగులోకి వస్తాయి. కాగా ఏ పొలాలకు కూడా సాగు నీరు అందించే (సప్లై చానల్)సాగు కాలువలు లేవు. అన్నీపాడయ్యాయి. ఎక్కువ శాతం ఆక్రమణకు గురయ్యాయి. చెరువుల తూములు చెడిపోయాయి. చెరువు కట్టలపై చిట్టడవిలా చెట్లు, పొదలు అల్లుకుపోయాయి. వచ్చే ఖరీఫ్ నాటికి ప్రత్యేక చర్యలు చేపట్టి చెరువులు, వాగులు, కాలువలు, కుంటలను ప్రభుత్వం అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిరసన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ర్యాలీ

బేస్తవారపేట, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ బేస్తవారపేటలోని అనంతపురం - అమరావతి జాతీయ రహదారిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడుల్లో 28 మంది పర్యాటకులు మృతి చెందడం బాధాకరమని, ఇటువంటి దాడులకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమానికి పట్టణ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం ఆధారంగా ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో మస్తాన్ నాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 25 శాతం ఉచిత సీట్ల కోసం ఈనెల 28వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు, బలహీన వర్గాల పిల్లలకు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1 వతరగతిలో చేరే అవకాశముందన్నారు. మే 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎన్జీవో స్థలాన్ని ఆన్‌లైన్ చేయాలని వినతి

మార్కాపురం రూరల్, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి) : ఎన్జీవో సంఘానికి కేటాయించిన స్థలాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ తహసీల్దార్ చిరంజీవికి మీకోసం కార్యక్రమంలో ఎన్జీవో సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మార్కాపురం తాలుకా యూనిట్ కార్యదర్శి వడ్లమాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఎన్జీవోలకు కేటాయించిన స్థలానికి, అందులోని భవనానికి రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆన్‌లైన్ చేసి వన్‌బీ, అడంగల్ రికార్డులను జారీ చేయాలని కోరామన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్, ఆకుల హర్ష పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ జీతాలను చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద, ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 4 నెలలుగా జీతాలను నిలిపివేసినట్లు చెప్పారు. దీనిపై సూపరింటెండెంట్‌కు పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ జీతాలను ఇప్పించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని మీకోసం కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రఫి, కే శివారెడ్డి, సుబ్రమణ్యం, రూబెన్, రాజు, స్వప్న, బాలకృష్ణ, కొండమ్మ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పన్నుపై రాయితీ

గిద్దలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను, స్థలాలపై ఏకమొత్తంలో ఒకే సారి పన్ను చెల్లించేవారికి వడ్డీలో 50శాతం రాయితీ, అలాగే పన్నుపై 5 శాతం తగ్గింపు ఉంటుందని, ఈ అవకాశం నెలాఖరులోగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పాత బకాయిలతో కలిపి ఏకమొత్తంలో ఒకేసారి చెల్లించిన వారికి 50శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని, ప్రస్తుత ఇంటి పన్నుపై 5శాతం తగ్గింపు ఉందని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

తీగలేరు పనులు ప్రారంభించాలి

సీఎంకు పోస్టుకార్డులు పంపిన రైతులు



పోస్టు కార్డులను చూపిస్తున్న రైతులు

పుల్లలచెరువు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరును పుల్లలచెరువు చిన్న కండ్లేరుకు అనుసంధానం చేసే కాలువ పనులు వెంటనే ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వెంకటరెడ్డిపల్లెలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులు రాసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, మండల కార్యదర్శి గురునాథం, రైతు సంఘ నాయకుడు జానకిరఘు, రైతులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే భక్తి భావం అవసరం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచి చదువుతోపాటు భక్తి భావం అవసరమని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి పులుకూరి అమృతతేజ్ అన్నారు. తెలుగు బాప్టిస్టు చర్చిలో వేసవి కాల విరామ బైబిల్ పాఠశాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి అధ్యక్షుడె శామ్యూల్ మాట్లాడుతూ.. విద్యార్థులు బైబిల్ పాటలు, కథలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో చర్చి సెక్రటరీ జయరావు, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగాభవాని, సంఘ నాయకులు జయపాల్, ప్రభుదాస్, వీబీఎస్ టీచర్లు హర్షిత, సుస్మిత, సుజాత, సలోమి, ఎలిజబెత్, సౌమ్య, రఘుబాబు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే దీక్షలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ డిపో ఎదురు ఎన్ఎంయూ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ రీజనల్ నాయకులు బీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని కేటగిరీలో ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. డిపో కార్యదర్శి కాశయ్య మాట్లాడుతూ.. రిటైర్డ్ అయిన ఉద్యోగుల బకాయిలు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలన్నారు. దీక్షలో వైవీ రెడ్డి, ముత్తయ్య, నాయక్, శ్రీనివాస రెడ్డి, హనీఫ్ కూర్చున్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న వాహనం



లారీని ఢీకొన్న వాహనం

ఎర్ర గొండ పాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం దూ పాడు వద్ద నాగార్జునసాగర్ బ్రిడ్జిపై సోమ వారం ఎదురెదురుగా వస్తున్న లారీని లగేజీ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో డ్రైవర్ సాయిరామ్ కు తీవ్రరక్తగాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

కిశోర వికాసంపై అవగాహన

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు బాల్య వివాహాలు అరికట్టాలని మునిసపల్ కమిషనర్ నారాయణ రావు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం సమ్మర్ ప్రోగ్రాం సోమవారం ఎంఎస్‌కేలు, ఆశాలు, ఆర్పీలకు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో సుశీలాదేవి, ఎంఈవో శర్వాణి, మెప్మా సీఎంఎం ఏలీశా పాల్గొన్నారు.

కంభం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బడి బయట ఉన్న పిల్లలను తిరిగి బడిలో చేర్పించడంతోపాటు బాల్యవివాహాలను అడ్డుకోవాలని ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో కిశోర బాలిక వికాసంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు పిల్లలు, వారి తల్లిదండ్రులు అవగాహన కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ రత్నప్రసాద్, ఈవోఆర్డీ విజయలక్ష్మి, ఎంఈవో మాల్యాద్రి, మెడికల్ ఆఫీసర్ అత్తర్‌రసూల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలోఫర్, సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, ఏపీఎం మాధవి, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, వీవోఏలు పాల్గొన్నారు.

బేస్తవారపేట : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఏవీ రంగనాయకులు మాట్లాడుతూ మే2 నుంచి జూన్ 10వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశం బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు విద్యను కొనసాగించేలా చూడాలని, ఆడపిల్లల రక్షణ, భద్రత అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో నీలోఫర్ బేగం, లీగల్ అడ్వయిజర్ రత్న ప్రసాద్, వైద్యాధికారి పృథ్వీ, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, వీవోఏలు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : కిశోర వికాసంపై దృష్టి సారించాలని సీడీపీవో కమల కుమారి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏపీఎం మూల వెంకిరెడ్డి అధ్యక్షతన బంగారు బాల్యం కార్యక్రమంపై మహిళా పోలీసులు, వీవోఏలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికలకు వ్యక్తి గత శుభ్రతతో పాటు ఉన్నత చదువులపై ఆసక్తి కల్గించేలా ప్రోత్సహించాలన్నారు. ఎంఎస్‌కే కన్వీనర్‌గా అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా, వీవోఏ సభ్యులుగా ఉంటారని, వారిని గ్రూపులుగా చేసి శిబిరాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో చాణిక్య, సూపర్‌వైజర్ అంజమ్మ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అలీ జహీర్



అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న న్యాయవాదులు

మార్కాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది సయ్యద్ అలీజహీర్ ఎన్నికయ్యారు. కోర్టు ప్రాంగణంలో సోమవారం మార్కాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పోస్టులకు మాత్రమే ఎన్నికలు జరగ్గా మిగిలినవి ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా సయ్యద్ అలీజహీర్, కె.శ్రీనివాసచౌదరి, ప్రధాన కార్యదర్శి పదవికి నాగేంద్రరాజు, వై.అనిల్‌కుమార్ పోటీ పడ్డారు. మొత్తం 138 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలీజహీర్‌కు 83 ఓట్లు, శ్రీనివాసచౌదరికి 52 ఓట్లు పోలయ్యాయి. దీంతో 31 ఓట్ల మెజార్టీతో అలీజహీర్ గెలుపొందారు. నాగేంద్రరాజు 4 ఓట్ల తేడాతో అనిల్‌కుమార్‌పై గెలుపొంది ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శిగా జవ్వాజి మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా డీజే స్టాలిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా బత్తుల వేణుగోపాల్, పైడిమర్రి రామచంద్రలు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సహచర న్యాయవాదులు అభినందించారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం పిచ్చయ్య

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వీవోఏలు పనిచేయాలని ఏపీఎం పిచ్చయ్య కోరారు. ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో సోమవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించాలని కోరారు. స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య కమిటీ సభ్యులు ఝాన్సీ, బేబి, ఎల్‌సీ నాగభూషణం, సీసీలు నాగయ్య, మనోకుమారి, అకౌంటెంట్ నాగమణి, గ్రామ సమాఖ్య కమిటీ సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి







గిద్దలూరులో మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశ్వర్లు, మార్కాపురంలో ప్రారంభిస్తున్న వీరారెడ్డి, పెద్దారవీడులో మాట్లాడుతున్న గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి

గిద్దలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా గ్రంథాలయాలయాకు వెళ్లి విజ్ఞానాన్ని పెంచుకుని ఆటపాటల్లో, స్పోకెన్ ఇంగ్లీష్‌లో తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. తొలి రోజు 40 మంది శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్న కుమారి, వేంకటేశ్వర స్వామి దేవస్థాన అధ్యక్షుడు గంజి వీరయ్య, పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు, రిటైర్డ్ డిప్యూటి డిఇఒ కాశీశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : బేస్తవారపేట గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొదటి రోజు 17 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, డ్రాయింగ్, కథలను వినిపించారు. కార్యక్రమానికి సీసీ గంగాధర్, ఉపాధ్యాయులు సుజాత, గురుస్వామి పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : విద్యార్థులు గ్రంథ పఠనం అలవర్చుకోవాలని ఎంఈవో మస్తాన్‌నాయక్ అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను ఎంఈవో మస్తాన్ నాయక్ పంచాయతీ ఈవో శివ కోటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. గ్రంథాలయంలో ప్రపంచ విజ్ఞానం లభిస్తుందని విద్యా ర్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : వేసవి సెలవులను వినియోగించుకోవాలని విశ్రాంత విద్యాశాఖ అధికారి డాక్టర్ ఏ.వీరారెడ్డి అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను తొలుత సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూదన్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం డాక్టర్ మధుసూదన శాస్త్రి మహాభారత విజ్ఞాన సర్వస్వం నాలుగు భాగా లు, మరికొన్ని విలువైన గ్రంథాలను అం దించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు శివారెడ్డి పాల్గొన్నారు.

పెద్దారవీడు : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామదండు ర్యాలీ

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామంలో సోమవారం రామభక్తులు రామదండు ర్యాలీని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ట్రాక్టర్‌పై సీతారామ సమేత శ్రీరాముని చిత్రపటాలను ఉంచి గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. జై.శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.




ఊరేగింపులో పాల్గొన్న రామ భక్తులు

తహసీల్దార్‌గా కిశోర్‌కుమార్



తర్లుపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు తహసీల్దార్‌గా కేకే కిశోర్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ని ప్రజా ప్రతినిధులు, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను వెంటనే ఇస్తామని చెప్పారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



పుల్లలచెరువు, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి): తహసీల్దార్‌గా కే వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, వీర్వోలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమకు అవసరమైన సేవల కోసం నేరుగా కార్యాలయానికి వచ్చి పనులు చేయించుకోవాల న్నారు. సిబ్బంది, వీఆర్వోలు నిత్యం ప్రజలకు ప్రభుత్వం కేటాయించిన సమయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు.



మరమ్మతుల అనంతరం నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

నీటి కష్టాలు తీర్చిన టీడీపీ నాయకుడు

ఎమ్మెల్యే కందుల చొరవతో బోరుకు మరమ్మతులు

పొదిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నగర^ంచాయతీ పరిధిలోని శ్రీపతి నగర్ కాలనీలో నీటి సమస్యను టీడీపీ నాయకులు తీర్చారు. కొంతకాలంగా నీటి కాలనీవాసుల నీటి ఇబ్బందులను తెలుసుకున్న టీడీపీ నాయకుడు ముని శ్రీనివాసులు ఆ విషయాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. వెంటనే అధికారులు చెడిపోయిన బోరుకు మరమ్మతులు చేయించి, కొళాయిని ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయించారు. అయితే వాడుకనీరు మాత్రమే వస్తున్నాయని తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని కాలనీవాసులు అధికారుల దృష్టికి తెచ్చారు. త్వరలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థికి సన్మానం



తేజారెడ్డి దంపతులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

గిద్దలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి): వాస్క్యులర్ అండ్ ఎండో వాస్క్యులర్ సర్జరీ (పీహెచ్‌డీ) పూర్తి చేసిన పూర్వ విద్యార్థి కందుల వెంకట తేజారెడ్డిని అరుణోదయ పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. శాలువా కప్పి పూలమాల వేసి జ్ఞాపికను అందచేశారు. విశ్రాంత బ్యాంక్ మేనేజర్ కేవీ రమణారెడ్డి దంపతుల కుమారుడు తేజారెడ్డి చైనాలో ఎంబీబీఎస్, అమలాపురంలోని ఎన్టీఆర్ యూనివర్సిటీలో పీజీ కోర్సు ఎంఎస్ జనరల్ సర్జన్ కోర్సు, గుర్గావ్‌లోని వేదాంత మెడిసిటీ వర్సిటీలో డాక్టరేట్ ఆఫ్ నేషనల్ బోర్డులో వాస్క్యులర్ అండ్ ఎండో వాస్క్యులర్ సర్జరీ (పీహెచ్‌డీ) పూర్తి చేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి అయిన తేజారెడ్డిని పాఠశాల కరస్పాండెంట్ జింకా చంద్రశేఖర్ అభినందించారు. మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పన, వివేకానంద విద్యాసంస్థల కార్యదర్శి పిడతల అభిషేక్‌రెడ్డి ఫోన్‌లో తేజారెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తేజారెడ్డి సతీమణి చిన్నపిల్లల వైద్యాధికారి ప్రణయ, అతని తల్లిదండ్రులు కేవీ రమణారెడ్డి, సుజాత, అరుణోదయ పాఠశాల ప్రతినిధులు నాగేశ్వర్‌రెడ్డి, శ్రీను, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ముఖాముఖి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ మద్దిరాల ఆవులరెడ్డి, పశువైద్యాధికారి, పీసీపల్లి



ప్రశ్న: వేసవిలో పశువులకు సంక్రమించే వ్యాధులు ఏమిటి?

జవాబు: వేసవిలో గాలికుంటు వ్యాధి అధికంగా వ్యాపిస్తుంటుంది. ఈఏడాది ప్రభుత్వ ఆదేశాలతో ముందుగానే వ్యాధి సోకకుండా టీకాలు వేయించాం.

ప్ర: మండలంలో పశువులు ఎన్ని ఉన్నాయి?

జ: మండలంలో గేదెలు 20,708, ఆవులు 245, గొర్రెలు 51,308, మేకలు 19,015, కోళ్లు 98286 ఉన్నాయి.

ప్ర: పశువైద్యశాలలు ఎన్ని ఉన్నాయి?సరిపడా సిబ్బంది ఉన్నారా?

జ: పీసీపల్లి, పెదఅలవలపాడులో రెండు ప్రభుత్వ పశువైద్యశాలలు ఉన్నాయి. సరిపడ సిబ్బంది ఉన్నారు.

ప్ర: పశువులకు నీటితొట్లు ఎన్ని మంజూరయ్యాయి? ఎన్ని పూర్తయ్యాయి?

జ: మండలంలోని 18పంచాయతీల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు 91 నీటితొట్లు మంజూరయ్యాయి. వాటిలో 19తొట్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

ప్ర: పశుపోషకులకు రాయితీపై ఏమైనా అందిస్తుందా?

జ: పశుపోషకులను ఆదుకునేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై గడ్డిజొన్నలు, దాణా అందజేస్తుంది.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

దర్శి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ శాఖ నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో విద్యార్థులు పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో కె.రఘురామయ్య సూచించారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రమాదేవి, గ్రంథాలయశాఖ అధికారి విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం

పామూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో కాలును కోల్పోయిన బాధితురాలు ముప్పారపు షైనీకి పామూరు మండలం మోపాడు బంగ్లా వద్ద ఉన్న చర్చిలో సంఘ పెద్దలు రూ.లక్ష ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. గత మార్చి 9న కావలిలో రైలు దిగుతూ కాలు జారి రైలు కింద పడి కాలును పోగొట్టుకున్న విషయం తెలిసిందే. బాధితురాలు షైనీకి మోపాడు గ్రామంలోని ప్రార్థనా మందిరంలో జరిగిన కార్యక్రమంలో లౌరీ మెమోరియల్ సెవెంత్‌డే అడ్వెంటిస్ట్ తెలుగు చర్చి బెంగుళూరు తరుపున సేకరించిన లక్ష రూపాయల నగదును అందజేశారు.

కార్యక్రమంలో పాస్టర్ రాజేష్, సంఘ పెద్దలు కె.సామెల్, ఎం.అబ్రహం, జి.యాకోబు, సీడీపీవో కె.దేవకృపావరం, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా గ్రామ కమిటీలు పనిచేయాలి

పామూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ కమిటీలు సమర్థవంతంగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురంలో సోమవారం జరిగిన సమావేశంలో టీడీపీ గ్రామ కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా బత్తుల మస్తాన్‌రావు, ఉపాధ్యక్షుడిగా గాజులపల్లి జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గద్దగూటి వేమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సమావేశంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకర్, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి ఈవోపీఆర్డీగా రాంప్రసాద్ బాధ్యతల స్వీకరణ

పీసీపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండల ఈవోపీఆర్డీగా సింగంపల్లి రాంప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పామూరు మండలం కంభాలదిన్నె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకరశర్మను కలిశారు. పీసీపల్లి పంచాయతీ కార్యదర్శిగానూ ఆయన విధులు నిర్వహించనున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బదిలీపై యర్రగొండపాలెంకు వెళుతున్న సీఎస్‌పురం తహసీల్దార్ మంజునాథరెడ్డిని సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయిళ్ల నారాయణరెడ్డి సోమవారం కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన అధికారిగా మండల ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరికూటి హనుమంతరావు, గోను చంద్రశేఖర్, అక్బర్, సంగిశెట్టి పీరయ్య నాయుడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో నీటితొట్ల నిర్మాణాలు

» దాహం తీర్చుకుంటున్న మూగజీవాలు

దొనకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో గ్రామాల్లో చెరువులు, వాగులు, వంకల్లో చుక్కనీరు లేక ఎండిపోయాయి. పశువులకు తాగునీరులేక దాహార్తితో అలమటిస్తున్నాయి. వీటి దాహార్తి తీర్చేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి హమీ పథకం నిధులతో నిర్మాణాలు చేపట్టారు. గ్రామాల్లో పశువుల సంఖ్య ఆధారంగా నీటితొట్ల నిర్మాణాలు జరిగేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మండలంలో 38 నీటితొట్లు మంజూరుకాగా ఇప్పటికే 31 పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో నీటితొట్టి దాదాపు 5వేల లీటర్ల సామర్థ్యంతో, రూ.44 వేల ఖర్చుతో నిర్మిస్తున్నారు. పలు గ్రామాల్లో బోర్లు ఉన్న ప్రాంతాల్లో వాటిపక్కనే గొర్రెలు, మేకలకు నీరందే విధంగా, ఆవులు, గేదెలకు నీరందేలా పెద్దది, చిన్నది రెండు నీటితొట్లు నిర్మాణాలు జరిపారు. బోరులేని గ్రామాల్లోని నీటితొట్లకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్లతో నీటిని నింపే బాధ్యతను అప్పగించారు.



ఇండ్లచెరువులో నీటితొట్టి వద్ద దాహార్తి తీర్చుకుంటున్న మూగజీవాలు

మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో ఎద్దులు, ఆవులు 1648, గేదెలు 16524, గొర్రెలు 29879, మేకలు 3762 ఉన్నట్లు అధికారుల సమాచారం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూగజీవాల దాహార్తి సమస్యను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పశువుల దప్పిక తీర్చటానికి అప్పట్లో నీటితొట్లను నిర్మించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిగురించి ఏమాత్రం పట్టించు కోకపోవటంతో అవి శిథిలావస్థకు చేరాయని పలువురు పశుపోషకులు పేర్కొన్నారు.

ప్రస్తుత ప్రభుత్వంలో వీటి నిర్మాణాలు చేపట్టడంతో పశుపోషకులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

ప్రధాని మోదీ సభకు తరలిరావాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పిలుపు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి, పాల్గొన్న పాపారావు తదితరులు

దర్శి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి దర్శిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వస్తున్న ప్రధానికి ఘనంగా స్వాగతం పలకాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ మండలాల పార్టీ అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసరావు, నెమలయ్య, ఎం.శివకోటేశ్వరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు పి.పాపారావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన మంచినీరు అందించటమే లక్ష్యం

దర్శి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిచటమే లక్ష్యంగా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి పథకం నిర్మాణం చేపడుతున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని తానంచింతల, చలివేంద్ర, ఎర్రోబనపల్లి పంచాయతీల్లో సోమవారం సాయంత్రం ఇంటింటి కొళాయి పథకం నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం గురించి పట్టించుకోలేదన్నారు. కొన్నిచోట్ల పనుల నిర్వహణలో అక్రమాలు జరిగాయన్నారు. అస్తవ్యస్తంగా మారిన ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతుందన్నారు. ఈపథకం పూర్తయితే నియోజకవర్గంలోని ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన మంచినీరు అందించే వీలుకల్గుతుందన్నారు. నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, సానె సుబ్బయ్య, పుమిడిశెట్టి కోటయ్య, సందు రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి: సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రధాని సభను విజయవంతం చేయాలి

కనిగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులు గంగోడు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం టీడీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే2 అమరావతిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా మోదీ పాల్గొంటున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా భారీ బహిరంగ సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కనిగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. శ్రేణులను, కార్యకర్తలను సమీకరించి తరలించే ఏర్పాట్లను నాయకులు చేయాలని సూచించారు. ప్రజల్ని చైతన్యపరచి ప్రతి గ్రామంలో టీడీపీ కార్యకర్తలు వారిని వెంట పెట్టుకుని సభకు తరలించే ఏర్పాట్లును వ్యక్తిగతంగా చేపట్టి విజయవంతానికి కృషి చేయాలన్నారు.

సమావేశంలో ఆరు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, కనిగిరి మండల అధ్యక్షుడు నంబులు వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), తదితరులు పాల్గొన్నారు.

'కష్టపడే కార్యకర్తలకు అన్యాయం జరగదు'

ముండ్లమూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ అభివృద్ధికి కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని టీడీపీ నియోజకవర్గ నాయకుడు కడియాల రమేష్ అన్నారు. ఏ కార్యకర్తకు అన్యాయం జరగదన్నారు. సోమవారం ముండ్లమూరులో జరిగిన టీడీపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. పార్టీలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన సమయంలో గుర్తింపు ఇవ్వటం జరుగుతుందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం టీడీపీ గ్రామ అధ్యక్షులను ఎన్నుకున్నారు. పసుపుగల్లు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గూడాల శివశంకర్‌రెడ్డి, ముండ్లమూరు అధ్యక్షుడిగా మేదరమెట్ల పిచ్చారావు, సింగన్నపల్లి అధ్యక్షుడిగా కందిమళ్ల వెంకటసుబ్బయ్య, నాయుడుపాలెం అధ్యక్షుడిగా చొప్పరపు వెంకటేశ్వర్లు, కెల్లంపల్లి అధ్యక్షుడిగా కుంటా శ్రీను, బొప్పూడివారిపాలెం అధ్యక్షుడిగా బొప్పూడి పెద్దగురవయ్య, ఈదర అధ్యక్షుడిగా ఆలకుంట అంకారావు, నూజెండ్లపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బోగ్యం ఏడుకొండలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి కడియాల రమేష్ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మండలపు వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, సుంకర రాఘవరెడ్డి కోడిగ మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తే కఠినచర్యలు

» ఎస్‌ఐ కమలాకర్



ఈదర గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కమలాకర్

ముండ్లమూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.కమలాకర్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఈదర, బొప్పూడివారిపాలెం భీమవరం, పూరిమిట్ల, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే తమకు తెలపాలన్నారు. వేసవికాలం ప్రారంభమైనందున ఆరుబయట నిద్రించేవారు ఇంటికి తాళాలు వేయాలన్నారు. ఒకటికి రెండుసార్లు ఇంటిని చూసుకోవాలన్నారు. ఏదైనా గ్రామం వెళుతుంటే ఇంటిపక్కల వారికి చెప్పటంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో తెలపాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తుల వివరాలను కూడా తెలపాలన్నారు.

రౌడీషీటర్ల కదలిక లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఎస్‌ఐ కమలాకర్ చెప్పారు. దొంగతనాలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను షాపుల నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాఠశాలలకు సెలవులు ఇచ్చినందున పిల్లలను చెరువులు, వాగుల వద్దకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన గృహనిర్మాణ లక్ష్యాలను పూర్తిచేయాలి

» ఎంపీడీవో బ్రహ్మయ్య



మాట్లాడుతున్న ఎంపీడీవో బ్రహ్మయ్య

పామూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న 123 గృహాలను జూన్ పదో తేదీనాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో పలు ప్రభుత్వ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ గృహ నిర్మాణాల లక్ష్యల అమలులో నిర్లక్ష్యం తగదని సూచించారు. పూర్తయిన గృహానికి విద్యుత్ మీటరు ను ప్రభుత్వం ఉచితంగానే అందజేస్తుందన్నారు. అలాగే, ఎస్‌పీసీఐ, వర్క్ ఫ్రం హోం సర్వేలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ జీవీ అరవింద, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై.రమేష్, హౌసింగ్ ఏఈ రాజమోన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

కనిగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వంగపాడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరావు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు కాంట్రాక్టు సంస్థలో ట్రిప్పర్ డ్రైవర్‌గా హరిదయరతన్‌దాస్ (45) పనిచేస్తున్నాడు. మృతుడు తరచూ తన భార్యతో ఫోన్‌లో గొడవ పడుతున్నాడు. గత రెండు రోజులుగా ఆహారం కూడా తినకుండా ఉంటూ మానసికంగా, కుటుంబకలహాలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన దాస్ బేస్ క్యాంప్‌పైన ఉన్న ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని మృతి చెందాడు. క్యాంప్ పీఆర్వో వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరావు తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు

'కిశోర వికాసం'పై అవగాహన కల్పించాలి

కనిగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుచేస్తున్న కిశోర వికాసం కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని గురవాజీపేటలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు బాలల వికాసం కార్యక్రమంలోని ముఖ్య అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని 15 నుంచి 18 ఏళ్ళ కిశోర బాలికల వివరాలతో కూడిన సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. కిశోర వికాసంలో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా సమతుల ఆహారం, పౌష్టిక విలువలు కల్గిన ఆహారం అందిస్తారని చెప్పారు. గ్రామంలోని ప్రతి కిశోర బాలికలు కేంద్రానికి వచ్చి వాటిని వినియోగించు కునేలా ప్రతికార్యకర్త కార్యోన్ముఖులు కావాలని సూచించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

సమావేశాలకు హాజరుకాని వీవోఏల వేతనాలు నిలుపుదల

పామూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 28న జరిగే వీవోఏల సమావేశాలకు సక్రమంగా రానివారి గౌరవ వేతనాన్ని నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఎం జి.విద్యాసాగర్ అన్నారు. స్థానికి వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ అధ్యక్షతన మండల సమాఖ్యా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. అయితే, 46 మంది వీవోఏలకు గాను కేవలం 23 మంది హాజరుకావడంతో సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశారు. సమావేశంలో డీఎంజీ జిలాని, పచ్చవ లక్ష్మీకాంతమ్మ, ఉమ్మడి పద్మ, పాడే విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రిలేదీక్షలో పాల్గొన్న కార్మికులు

కనిగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి జె.మాల్యాద్రి అన్నారు. ఆసంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కనిగిరి డిపో ఎదుట సోమవారం నిరసన రిలే దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్యలు పరిష్కారం కావటం లేదన్నారు. ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కావస్తున్నా కార్మికుల సమస్య ప్రస్తావనే చేయకపోవటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో డిపో చైర్మన్ వీసీహెచ్ ఓకేరెడ్డి, ప్రెసిడెంట్ వి.మనోహర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్బారావు, ఎస్‌కే సమీర్ పాల్గొన్నారు. రిలే దీక్షలో ఎస్‌ఎల్ రెడ్డి, షుకూర్, రమణయ్య, సీహెచ్ నరసింహ, రసూల్, స్వామి, సుభాని, బాషా కూర్చున్నారు.

సమయపాలన పాటిస్తూ పనులు చేయాలి

పీసీపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు సమయపాలన పాటిస్తూ పనులు చేయాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. మండలంలోని పెదఅలవలపాడులో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడుతూ నిబంధనల మేరకు పనులు చేస్తే గరిష్ఠ వేతనం పొందవచ్చునన్నారు. వేసవికాలం దృష్ట్యా ఉదయాన్నే పని ప్రదేశానికి వచ్చి పనులు చేయాలన్నారు. టీఏలు ఇచ్చే కొలతల మేరకు పనులు చేయకపోతే గరిష్ఠ వేతనం పొందలేరన్నారు. జాబ్‌కార్డు కలిగిన వారు మాత్రమే పనులకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌కు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎంపిక



స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన విద్యార్థులు

సీఎస్‌పురం (పామూరు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆయోధ్యలో మే 5, 6 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా వ్యవసాయ కళాశాలల స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనేందుకు సీఎస్‌పురం మండలంలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మునయ్య, సుదేపు యమున ఎంపికయ్యారు. ఈసందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం అభినందించారు.

కంభాలదిన్నె కార్యదర్శి బదిలీ

పామూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభాలదిన్నె గ్రామ పంచాయతి కార్యదర్శి రాంప్రసాద్ డిప్యుటేషన్‌పై పీసీపల్లికి ఈవోపీఆర్డీగా బదిలీఅయ్యారు. ఈమేరకు ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య రిలీవ్ ఆర్డర్‌ను సోమవారం అందజేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతి కార్యదర్శులు రాంప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.

ముఖ్యమంత్రిని కలిసిన 'కోటపాటి'



చంద్రబాబును కలిసి శుభలేఖను అందజేస్తున్న కోటపాటి జనార్దనరావు

పామూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు కుటుంబ సభ్యులతో సోమవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మే 10న మంగళగిరిలో జరిగే తన చిన్నకుమార్తె డాక్టర్ లక్ష్మీశ్రీ వివాహానికి హాజరై ఆశీర్వదించాలని శుభలేఖ అందజేశారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 17వేలు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.లక్షా 17వేల 548 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.48,570, లడ్డు ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.29,730, అన్నదానం విరాళాల ద్వారా రూ.36,248, ఇతర విరాళాల ద్వారా రూ.3వేలు వచ్చినట్లు తెలిపారు.



ఉష్ణోగ్రత (అంచనా)

29-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	25
తెనాలి	38	26
నరసరావుపేట	40	25
బాపట్ల	36	27
రెంటచింతల	41	26



మహాత్మా గాంధీ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

- యువత చేతిలో.. దేశ భవిష్యత్తు!
- సంస్థలను స్థాపించేలా ఎదగండి
- 2న ప్రధాని చేతుల మీదుగా రాజధాని పనుల ప్రారంభం
- అప్పటి నుంచి అమరావతి అన్‌స్టాపబుల్
- విట్ వర్సిటీలో 'వీ లాంచ్ ప్యాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్‌పో'లో సీఎం
- క్యాంపస్‌లో పలు భవనాల ప్రారంభం

క్వాంటం వ్యాలీగా.. అమరావతి

గుంటూరు,తుళ్లూరు ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని, సిలికాన్ వ్యాలీకి దీటుగా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని రూపొందిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.రాజధానిలోని విట్ అమరావతిలో సోమవారం నిర్వహించిన 'వీ లాంచ్‌ప్యాడ్ 2025-స్టార్టప్ ఎక్స్‌పో'లో ఆయన పాల్గొన్నారు. క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన మహాత్మాగాంధీ బ్లాక్, వీవీ గిరి బ్లాక్, ఆచార్య ఎన్‌జీ రంగా, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లాక్‌లను విట్ అధినేత విశ్వనాథన్, మంత్రి దుర్గేష్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్టప్ ఎక్స్‌పోను ప్రారంభించి ఎక్స్ పో పాల్గొన్న విద్యార్థులతో సీఎం ఇంటరాక్ట్ అయ్యారు. దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, యువతరం ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలని, అప్పుడే 2047నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్ వన్ అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఆవిష్కరణల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పునఃప్రారంభం కాబోతున్నాయని చెప్పారు.

విట్ అధినేత విశ్వనాథన్ సాధారణమైన వ్యక్తిగా తన జీవితం ప్రారంభించి అసాధారణమైన వ్యక్తిగా ఎదిగిన తీరు అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన అన్నాదురై, కరుణానిధి, ఎంజీఆర్, జయలలితతో పనిచేశారని గుర్తుచేశారు. విశ్వనాథన్ 2014లో ఎన్నికల ఫలితాలు రాకముందే తనను కలిసి, గెలిచిన వెంటనే అమరావతిలో విట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారన్నారు. ఆయన ఆరోజున 200 ఎకరాలు అడిగితే, 100 ఎకరాలే ఇచ్చామని, మిగిలిన భూమి కూడా ఇచ్చే బాధ్యత తమదేనని, అయితే ప్రస్తుతం ఉన్న 17వేల మంది విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడేళ్లలో 50వేలకు పెరగాలని ఆయన షరతు విధించారు. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్స్ జరుగుతుండటం అభినందనీయమని, ప్రపంచంలోని టాప్ 100 యూనివర్సిటీలో విట్ ఉండటం మనకు గర్వకారణమని, అయితే విట్ విద్యా సంస్థల్లో మనఅమరావతి విట్ నెంబర్‌వన్‌గా ఉండాలని కోరుకుంటున్నాని ముఖ్యమంత్రి చెప్పారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, తాడికొండఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, విట్ యూనివర్సిటీ ఫౌండర్, చాన్స్‌లర్ డా.జీ విశ్వనాథన్, టీఐఈ గ్లోబల్ చైర్మన్ మురళి బుక్కపట్నం, ఐబీఎల్ గ్లోబల్ సీఈఓ ఎడియటా వోల్సిక్, టాటా కన్సల్టెన్సీ సర్వీస్ హెడ్ చల్లా నాగ్, విట్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరీ ఎస్ విశ్వనాథన్, వైస్ చాన్స్‌లర్ డా. ఎస్‌వీ కోటా రెడ్డి, జిల్లా అధికారులు, విట్ యూనివర్సిటీ ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతికి తిరుగులేదు

సీఎం చంద్రబాబు

ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు మే 2న పునఃప్రారంభమ వుతాయని, తాను అంద రిలా మాటలు చెప్పనని, ప్రజలకు మంచి చేసి చూపిస్తానని చెప్పారు. తనపై నమ్మకం పెట్టుకుని 29 వేల మంది రైతులు, 34 వేల ఎకరాల భూమి రాజధానికి ఇచ్చారని, అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని రైతులు ముందుకురావడం అభినందనీయమని అన్నారు. ఆ 29 గ్రామాల బిడ్డలకు అమరావతిలో అత్యుత్తమ విద్య పొందే అవకాశం కల్పించాలని, వారిలోంచి ఎంటర్‌ప్రెన్యూర్లను వెలికి తీయాలని భావిస్తున్నట్లు సీఎం చెప్పారు. 1991లో ఆర్థిక సంస్కరణలకు మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు శ్రీకారం చుట్టారు. వాటిని తాను అందిపుచ్చుకున్నానని, భవిష్యత్ ఐటీదేనని గ్రహించి దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చానని, 14 నెలల్లో హైటెక్ సిటీ నిర్మించామన్నారు. ఇప్పుడు రాజధాని అమరావతిపై దృష్టి కేంద్రీకరించామని, త్వరలో అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి ఫౌండేషన్ వేస్తున్నామన్నారు. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని ప్రతి ఇంట్లో ఎంట్రప్రెన్యూర్ తయారుకావాలన్నారు.. అ మరావతిలో విట్, ఎస్ఆర్ఎం వంటి విద్యా సంస్థలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. భవిష్యత్‌లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీలు అమరావతికి రాబోతున్నాయన్నారు. 29 వేల మంది రైతులు, రైతు కూలీలు అమరావతికి సహకరించారని, వారందరినీ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం వివరించారు. వారిలో కొందరిని దత్తత తీసుకోవాలని విట్ చాన్సలర్ విశ్వనాథన్‌ను కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్త విద్యాసంస్థల ఏర్పాటు, ఐటీ, ఏఐ వినియోగంపై విట్ విద్యార్థులు పలు ప్రశ్నలు అడగ్గా ముఖ్యమంత్రి వాటికి సమాధానం చెప్పారు.



వీఐటీలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

విధేయతకే పట్టం

- గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కోవెలమూడి ఎన్నిక
- 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి
- ప్రమాణ స్వీకారం.. వెనువెంటనే బాధ్యతల స్వీకరణ
- గంటలోనే ముగిసిన మేయర్ ఎన్నిక ప్రక్రియ
- అన్ని తానై నడిపించిన కేంద్ర మంత్రి పెమ్మసాని
- వెల్లువెత్తిన అభినందనలు.. ఆనందోత్సాహాలు.
- నగరంలో భారీ ర్యాలీ.. ఊరేగింపు



మేయర్‌గా ఎన్నికైన రవీంద్రకు మేయర్ టోపీ పెడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గుం టూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర(నాని) ఎన్నికయ్యారు. నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ఎన్నిక ప్రక్రియలో గుంటూరు నగరపాలక సంస్థ 7వ మేయర్‌గా గెలుపొంది, పదవీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం గుంటూరు నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికలో కూటమి ప్రభుత్వం తరఫున టీడీపీ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర, వైసీపీ అభ్యర్థిగా అచ్చాల వెంకటరెడ్డి బరిలో నిలిచారు. అచ్చాల వెంకటరెడ్డిపై కోవెలమూడి రవీంద్ర 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గుంటూరు నగర మేయర్‌గా కోవెల మూడి రవీంద్ర గెలుపొందినట్లుగా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ ప్రకటించారు. ఈ మేరకు డిక్లరేషన్ ఫామ్‌ను అందజేశారు. నగరపాలక సంస్థలో 57 మంది కార్పొరేటర్లు, ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. వారిలో 48వ డివిజన్ కార్పొరేటర్ తను బుద్ధి కృష్ణారెడ్డి మరణించారు. దీంతో కార్పొరేటర్ల సంఖ్య 56 కాగా, మొత్తం 63 మందికి కాను 61 మంది మాత్రమే మేయర్ ఎన్నికల్లో పాల్గొన్నారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్లు మర్రి అంజలి, యాట్ల రవికుమార్ ఎన్నికల్లో పాల్గొనలేదు.



మేయర్‌గా నానిచే ప్రమాణం చేయిస్తున్న జేసీ భార్గవ తేజ, ప్రక్కన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి, నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, సజిలా

7 ఓట్ల మెజార్టీతో విజయం..

నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్రను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ప్రతిపాదించారు, జనసేనకు చెందిన కార్పొరేటర్ సంకురి శ్రీనివాసరావు బలపరిచారు. వైసీపీ అభ్యర్థి అచ్చాల వెంకటరెడ్డిని మేయర్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ చం ద్రగిరి ఏసురత్నం ప్రతిపాదించారు. 45 డివిజన్ కార్పొరేటర్ ఎక్క లూరి మారుతీరాణి బలపరిచారు. మొత్తం 61 మంది ఓటింగ్‌లో పాల్గొనగా టీడీపీ అభ్యర్థి నానికి 34 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి వెంకట్‌రెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. దీంతో మెజార్టీ సభ్యులు చేతులెత్తి నానిని ఎన్నుకున్నారు. వైకాపా సభ్యులు ఇద్దరూ హాజరైనప్పటికీ మేయర్‌గా నాని గెలుపు ఆగేది కాదు. నాని గెలుపొందడంతో వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఆ పార్టీకి చెందిన మిగతా 25 మంది కార్పొరేటర్లు సమావేశం నుంచి వెళ్లిపోయారు.





కార్పొరేషన్‌కు వస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని , ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు ఎమ్మెల్సీ ఆలపాటి. టీడీపీ కార్పొరేటర్లు

ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ

గుంటూరు నగర మేయర్‌గా గెలుపొందిన నాని కౌన్సిల్ హాల్‌లోనే మేయర్ పీఠాన్ని అధిష్ఠించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రామాం జనేయులు తదితరుల సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి భార్గవ్‌తేజ నానితో మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొద్దీసేపటికి మేయర్ చాంబర్‌లోకి వచ్చి గుంటూరు మేయర్‌గా బాధ్యత లు చేపట్టారు. హిందూ, క్రైస్తవ, ముస్లిం మత పెద్దల ఆశీర్వ చనాలు పొందారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించి, మేయర్ (మిగతా 6వ పేజీలో)

డీసీసీబీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే మక్కెన

- 'వడ్రాణం'కు డీసీఎంఎస్
- కుర్రా అప్పారావుకు మరో పోస్టు హామీ



మక్కెన మల్లికార్జునరావు డీసీసీబీ చైర్మన్



వడ్రాణం హరిబాబు డీసీఎంఎస్ చైర్మన్

నరసరావుపేట, వినుకొండ, గుంటూరు సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాను నామినేటెడ్ పదవు లు వరించాయి. 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పిన ట్లుగా ఆ ఇద్దరు నేతల్లో ఒక్కరికి డీసీసీబీ పదవి దక్కింది. అత్యంత కీలకమైన పదవిగా భావించే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ గా పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికా ర్జునరావు, జిల్లా మార్కెటింగ్ సొసైటీ(డీసీఎం ఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెం దిన టీడీపీ నాయకుడు వడ్రాణం హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సా యంత్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూ టమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డీసీసీబీ చైర్మన్ పదవి కోసం పలువురు పోటీపడ్డారు. మక్కెనతో పాటు టీడీపీ ముఖ్య నేత కుర్రా అప్పారావు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కుర్రా అప్పా రావుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు మద్దతు కూడా ప్రకటించారు. అయితే 2024 ఎన్నికల సందర్భంగా మక్కెనకు డీసీసీబీ పదవి ఇస్తానని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఆ హామీని నిల బెట్టుకునే నేపథ్యంలో డీసీసీబీకి మక్కెన పేరును ఖరారు చేసినట్లు తెలు స్తోంది. ఎన్నికల్లో అత్యంత కీలకంగా వ్యవహరించిన కుర్రా అప్పారావుకు మరో కీలక పదవి ఇచ్చేందుకు టీడీపీ అధిష్ఠానం హామీ ఇచ్చి నట్లు తెలుస్తోంది. త్వరలోనే ముఖ్యమైన పోస్టులకు నియామకాలు జరగనున్నం దున కుర్రాకు అవకాశం వస్తుందని చెబుతున్నారు.

అవిశ్వాసం.. సడలిందా

- చైర్మన్‌పై అవిశ్వాసం విషయంలో టీడీపీలో భిన్న స్వరాలు
- కౌన్సిలర్లు కావాలంటారు.. పట్టణ పార్టీ అధ్యక్షులు వద్దంటారు
- రసకందాయంలో చీరాల మున్సిపాలిటీ రాజకీయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

చీరాల మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం రసకందాయంలో పడింది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 33 వార్డులు ఉండగా 2021లో జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాలను వైసీపీ దక్కించుకుంది. కానీ గతేడాది జరిగిన ఎన్నికల్లో చీరాల నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరడంతో పాటు ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా రాజ కీయ సమీకరణాలు మారిపోయాయి. వైసీపీ నుంచి 15 మంది కౌన్సిలర్లు గతంలోనే టీడీపీ బాట పట్టడంతో అవిశ్వాసం పెట్టి చైర్మన్‌ను గద్దె దించాలనే స్వరాలు పెరగ సాగాయి. దీనికనుగుణంగానే టీడీపీ కండువా కప్పుకున్న కౌన్సిలర్లు ఈ నెల 23న కలెక్టర్ వెంకటమురళిని కలిసి చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాసానికి నోటీసులు ఇచ్చారు. మే 14న అవిశ్వాసంపై ఓటింగ్ జరిపే విధంగా నిర్ణయం తీసుకోవడం కూడా జరిగింది. కానీ అనూహ్యంగా టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు సోమవా రం కలెక్టర్ వెంకటమురళిని కలిసి అవిశ్వాసం విషయాన్ని తిరిగి పరిశీలించాలని వినతిపత్రం అందజేయడంతో టీడీపీలోనే భిన్న స్వరాలు వినిపించడం చర్చకు దారి తీసింది



కలెక్టర్ వెంకటమురళికి వినతి పత్రం అందిస్తున్న పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు

ఆశావహులు ఎక్కువగా ఉండడమే కారణమా...

వైసీపీ మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాసం నెగ్గితే ఆ పదవిపై పలువురు కన్నేసినట్లు తెలుస్తోంది. చీరాల మున్సిపాలిటీలో మొత్తం 33 వార్డులు ఉండగా 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ఒక్క స్థానమే దక్కించుకుంది. ప్రస్తుతం టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న కౌన్సిలర్లలో ముగ్గురు చైర్మన్ పీఠంపై కన్నేసినట్లు తెలుస్తోంది. దీంతో కుర్చీలాటలో భాగంగానే తెరవెనక కొంతమంది నేతలు పావు లు కదిపి అవిశ్వాస రాజకీయాన్ని రక్తికట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

ఖండన మండనలు షురూ

అవిశ్వాసంపై పట్టణ పార్టీ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావుది అతని వ్యక్తిగత అభిప్రాయమని, ఆ దుందుడుకు చర్యను ఖండిస్తున్నట్లు చీరాల పార్టీ కార్యాలయం పేరుతో సోమవారం ఓ ప్రకటన వెలువడింది. మరో వైపు తన చర్యలను సమర్థించుకుంటూ పట్టణ పార్టీ నేత కూడా వీడియో సందేశం విడుదల చేయడంతో చీరాల మున్సిపల్ రాజకీయం మరింతగా వేడెక్కింది. ఆయా వ్యవహారాలపై కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో అధికార మార్పిడి జరగాలన్నదే అధిష్ఠానం నిర్ణయమయితే శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చి చైర్మన్ అభ్యర్థి విషయంలో అందరి అంగీకారంతో అడుగులు వేస్తే ఇలాంటి చర్చకు తావుండదనేది పలువురి అభిప్రాయంగా ఉంది.

ప్రధాని సభకు..
మంత్రులకు బాధ్యతలు

- నేడు సమీక్షించనున్న ఆర్‌అండ్‌బీ మంత్రి
- మంగళగిరి వైపు నుంచి వచ్చే ప్రజల బాధ్యత మంత్రి గొట్టిపాటికి
- రాజధానిలో మనోహర్ రచ్చబండ కార్యక్రమాలు



మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

గుంటూరు, తుళ్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరా వతి రాజధాని పనుల పునరుద్ధరణకు శంకుస్థాపన చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రానుండటంతో నియోజకవర్గాల వారీగా జనసమీకరణ చేసే బాధ్యత సీఎం చంద్రబాబు మంత్రులకు కేటాయించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో జనసమీకరణ చేయాల్సింది గా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి కేటాయించారు. దీంతో ఆయన మంగళవారం ఉదయం 9.30 గంటలకు గుంటూరు నగరపాలకసంస్థ కార్యాలయానికి వచ్చి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు, పోలీసు, రెవెన్యూ, మునిసిపల్, రోడ్లు, భవనాలు, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా సమాచారం అందించారు. సమావేశానికి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను కూడా హాజరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మంగళగిరి మీదగా వచ్చే ప్రజలు బహిరంగ సభ జరిగే ప్రదేశానికి చేరుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా చూడాల్సిందిగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బాధ్యతలు కేటాయించారు. దాంతో ఆయన సోమవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. మరోవైపు మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం రాజధానిలోని ఎర్రబాలెం, బేతపూడి, ఐనవోలులో పర్యటించి రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ప్రధాని సభను పండగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ సభని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సోమవారం సాయంత్రం వెలగపూడిలో పర్యటించి ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి ముందస్తు ఏర్పాట్లు

- పాఠశాలలు ప్రారంభం కాగానే పంపిణీ
- ఉమ్మడి జిల్లాకు అవసరం 13.24 లక్షలు.. ఇప్పటికే వచ్చినవి 7.50 లక్షలు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పునప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా గుంటూరులోని పుస్తకాల గోదాము నుంచి ఉమ్మడి జిల్లాలోని స్టాక్ పాయింట్లకు పాఠ్యపుస్తకాలు పంపిణీ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ ,మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, మండల పరిషత్ మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు 6 వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి .ఆయా పాఠశాలల్లో దాదాపు 6.75 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా విద్యార్థులకు తరగతుల వారీగా మారిన సిలబస్ ప్రకారం నూతన పాఠ్యపుస్తకాల పంపిణీకి విద్యాశాఖ ఇప్పటికే ఏర్పాటు చేసింది. జిల్లాకు వచ్చిన పాఠ్యపుస్తకాలను ఎప్పటికప్పుడు ఆర్టీసీ బస్సుల ద్వారా రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కోసం ప్రత్యేకంగా గోదాములు ఏర్పాటు చేశారు. గోరంట్లలో ఒకటి మంగళగిరి రోడ్డులో మరొక గోదాము ఉన్నాయి. ఆయా గోదాములకు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా పంపించేందుకు డీఈఓ సివి రేణుక ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తెలియని బాలుడి తల్లిదండ్రుల ఆచూకీ..?


బాలుడు

యద్దనపూడి/మార్టూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : పైన ఫొటోలో కనిపిస్తున్న మూడేళ్ల వయస్సు ఉన్న బాలుడి తల్లిదండ్రుల ఆచూకీ కోసం నాలుగునెలలు నుంచి యద్దనపూడి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఎంతగా ప్రయత్నిస్తున్నా బాలుడి తల్లిదండ్రుల వివరాలను మాత్రం తెలుసుకోలేకపోయారు. ఇంతకు ఈ బాలుని కథ ఏమిటంటే... గత ఏడాది డిసెంబరు 13న యద్దనపూడి మండల పరిధిలో పూనూరు నుంచి గన్నవరం వైపు వచ్చే రోడ్డులో గుర్తుతెలియని బాబు ఒంటరిగా ఏడుస్తూ ఉన్నాడు. అదేసమయంలో ఈ రోడ్డుపై వెళుతున్న వ్యక్తి ఈ బాలుడిని గమనించి, బాలుడి పేరును అడిగినప్పటికీ చెప్పలేకపోయాడు. దీంతో అతను యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అప్పట్నుంచి బాలుడి తల్లిదండ్రులు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నేటికీ వారి ఆచూకీ తెలియకపోవడంతో బాలుడిని తాత్కాలిక ఆశ్రయం కోసం సీడబ్ల్యూసీ ప్రకాశం జిల్లా వారికి అప్పగించారు. ఇప్పటివరకు పోలీసులు బాలుడి తల్లిదండ్రుల వివరాలను తెలుసుకోలేకపోయారు. ఈ విషయమై సోమవారం ఎస్‌ఐ రత్నకుమారి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజానీకం బాలుడిని గుర్తించినాగాని, తల్లిదండ్రుల వివరాలు తెలిసినా గానీ, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

జీతం ఇవ్వలేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

బాపట్లరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గురుకుల పాఠశాలలో వంట చేసిన తమకు జీతం ఇవ్వలేదంటూ అదేగ్రామానికి చెందిన కె.చిరంజీవి, కారంపూడి రమేష్, ఎం.కుమారి అనే ముగ్గురు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో విలేకర్లతో వారు మాట్లాడుతూ యద్దనపూడి గురుకుల పాఠశాలలో సుమారు సంవత్సరకుపైగా మేము ముగ్గురం వంట చేస్తున్నాం. ఇంత వరకు ఒక్క రూపాయి కూడా జీతం ఇవ్వలేదు. మా ముగ్గురికి కలిపి సుమారు రూ.3లక్షలకు పైగా జీతం రావాల్సి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి జీతం వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

సమావేశాలకు హాజరుకాని వీవోఏల వేతనాలు నిలుపుదల

పామూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 28న జరిగే వీవోఏల సమావేశాలకు సక్రమంగా రానివారి గౌరవ వేతనాన్ని నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఎం జి.విద్యాసాగర్ అన్నారు. స్థానకి వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ అధ్యక్షతన మండల సమాఖ్యా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. అయితే, 46 మంది వీవోఏలకు గాను కేవలం 23 మంది హాజరుకావడంతో సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశారు. సమావేశంలో డీఎంజీ జిలాని, పచ్చవ లక్ష్మీకాంతమ్మ, ఉమ్మడి పద్మ, పాడే విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

కనిగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వంగపాడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరావు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు కాంట్రాక్టు సంస్థలో టిప్పర్ డ్రైవర్‌గా హరిదయరతన్‌దాస్ (45) పనిచేస్తున్నాడు. మృతుడు తరచూ తన భార్యతో ఫోన్‌లో గొడవ పడుతున్నాడు. గత రెండు రోజులుగా ఆహారం కూడా తినకుండా ఉంటూ మానసికంగా, కుటుంబకలహాలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన దాస్ బేస్ క్యాంప్‌పైన ఉన్న ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని మృతి చెందాడు. క్యాంప్ పీఆర్వో వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరావు తెలిపారు.

లారీని ఢీకొన్న వాహనం

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం దూపాడు వద్ద నాగార్జునసాగర్ బ్రిడ్జిపై సోమ వారం ఎ దురెదురుగా వస్తున్న లారీని లగేజీ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో డ్రైవర్ సాయిరామ్ కు తీవ్రరక్తగాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.


లారీని ఢీకొన్న వాహనం

విధ్వంస పాలన నుంచి వికాసం వైపు అడుగులు

అమరావతిలో వచ్చే నెల 2న మోదీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు

చీరాల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో గూడూరు ఎమ్మెల్యే


మాట్లాడుతున్న గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్

చీరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రాష్ట్రం విధ్వంసం పాలన నుంచి వికాసం వైపు అడుగులు వేస్తోందని గూడూరు ఎమ్మెల్యే పాసం సునీల్ కుమార్ చెప్పారు. సోమవారం ఆయన పేరాలలోని గోలి సదాశివరావు కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 2న రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణం జరగనుందన్నారు. అందుకు సంబంధించి ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు గత ప్రభుత్వ హయాంలో రాజధానిలో ఇటుకైన పేర్చలేదని విమర్శించారు. ఆ సమయంలో అమరావతి రైతులు పోరాటాలు చేస్తుంటే కనీసం వారిని అమ్మ వారి దర్శనానికి కూడా అనుమతించకుండా కఠినంగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో విసుగు చెందిన ప్రజలు కూటమికు 'జై' కొట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం కేంద్రం నుంచి వివిధ రూపాల్లో రాజధానికి రూ.లక్ష కోట్లు నిధులు వస్తున్నట్లు వివరించారు. అందుకు సంబంధించి కార్యక్రమం విజయవంతమయ్యేలా ప్రజలు అధికం సంఖ్యలో పాల్గొనాలన్నారు.

అనంతరం జనసమీకరణపై ప్రత్యేక దిశానిర్దేశం చేశారు. అధిక సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మార్కు చాటాలన్నారు. కార్యక్రమంలో సత్యవేడు ఇన్‌చార్జ్ శ్రీపతి సత్యబాబు, ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దన రావు, నాసిక వీరభద్రయ్య, గూడూరు శివరామకృష్ణ, మువ్వల వెంకటరమణ, గజవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సును ఢీకొన్న టిప్పర్

నలుగురికి గాయాలు

ముగ్గురిని ఒంగోలు వైద్యశాలకు తరలింపు

ఆందోళనకు గురైన ప్రయాణికులు

నామ్ రహదారిపై నిలిచిన ట్రాఫిక్

అద్దంకి, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి) : ట్రావెల్స్ బస్, గ్రావెల్ టిప్పర్‌లు ఢీకొనడంతో ముగ్గురు ప్రయాణికులతోపాటు బస్‌డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవేకు వెంపరాల కొండ నుంచి టిప్పర్ గ్రావెల్‌ను తరలిస్తోంది. టిప్పర్ నామ్ రోడ్డులో సోమవారం వేకువజామున చినకొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకునే సమయంలో హైదరాబాద్ నుంచి కందుకూరు, కామేపల్లి వెళ్తున్న ట్రావెల్స్ బస్ ఢీకొన్నాయి. దీంతో టిప్పర్ నామ్ రోడ్డుపై బోల్తా పడింది. ట్రావెల్స్ బస్ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో బస్‌లో ప్రయాణిస్తున్న మద్దిపాడుకు చెందిన ఏ.సామ్యూల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చీమకుర్తికి చెందిన జి.అనూష, కొండపికి చెందిన శైలజ, ట్రావెల్స్ బస్‌డ్రైవర్ కూడా గాయపడ్డారు. సామ్యూల్, అనూష, శైలజలను 108 వాహనంలో ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ట్రావెల్స్ బస్‌డ్రైవర్‌కు 108 సిబ్బంది స్థానికంగానే ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి ఆందోళన చెందారు. ఘటనాస్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు. టిప్పర్ నామ్ రోడ్డుపై అడ్డంగా పడిపోవటంతో, ట్రావెల్స్ బస్ రోడ్డు పైనే నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రోడ్డుపై ఉన్న వాహనాలను తొలగింపచేసి ట్రాఫిక్ పునరుద్ధరించారు.



నుజ్జునుజ్జు అయిన ట్రావెల్స్ బస్సు ముందుభాగం, బోల్తాపడిన టిప్పర్


గాయపడ్డ మహిళలు అనూష,శైలజ

మహాకుంభాభిషేకం పోస్టర్ ఆవిష్కరణ

ప్రథమ ఆహ్వాన పత్రికను లక్ష్మీ నరసింహస్వామికి అందజేత


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం మే నెల 19వ తేదీన నిర్వహించనున్నారు. ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్‌లను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఉదయం చిలకలూరిపేటలోని మంత్రి స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మహాకుంభాభిషేకం విజయవంతం అయ్యేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. శింగరకొండ అభివృద్ధికి మరింత ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, ఇతర పూజారులు, సిబ్బంది మంగళవాయిద్యాలతో వెళ్లి తొలి ఆహ్వాన పత్రికను క్షేత్రాధిపతి లక్ష్మీనరసింహస్వామికి అందజేశారు. అనంతరం గ్రామదేవత పోలేరమ్మకు అందజేసి పసుపు, కుంకుమ, పుష్పాలు, నూతన వస్త్రాలు సమర్పించారు. మహాకుంభాభిషేకం ఉత్సవాలు మే నెల 14 నుంచి ప్రారంభమై 19వ తేదీ వరకు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 19న ఉదయం 9-03 గంటలకు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి నూతన దేవాలయం విమాన శిఖర జీవధ్వజ ప్రతిష్ఠాపూర్వక మహాకుంభాభిషేకం కార్యక్రమాలు శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

పొగాకు కొనుగోలుపై ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య


మాట్లాడుతున్న రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

ఇంకొల్లు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలలుగా రైతుసంఘం ఆధ్వర్యంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని పలుమార్లు కలెక్టర్లకు విన్నవించినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడడం లేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య విమర్శించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో సోమవారం జరిగిన పొగాకు రైతులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు ఘటితమై పోరాటంతోనే ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతుసంఘం నాయకులు, పొగాకు కంపెనీల వారితో సమావేశం నిర్వహించి వెంటనే పొగాకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. గత ఏడాది రూ.15వేలకు కొనుగోలు చేసిన క్వింటా పొగాకు ప్రస్తుతం రూ.3వేల నుంచి రూ.4వేలకు మాత్రమే దళారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. వెంటనే పొగాకు కొనుగోలు చర్యలు తీసుకోకుంటే నల్లబర్లీ పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం కార్యదర్శి ఎం.హరిబాబు, రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమరెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు తల్లపనేని రామారావు, గంగయ్య, రామకోటేశ్వరరావు, వినోద్,200 మంది పొగాకు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

పర్చూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ రైతుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండప ప్రాంగణంలో పొగాకు రైతు సదస్సు నిర్వహించారు. నల్లమడ రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ పర్చూరు ప్రాంతంలో పండిన పొగాకుకు అంతర్జాతీయ స్థాయిలోనే మంచి గుర్తింపు ఉందన్నారు. అలాంటి పొగాకును సైతం కొనుగోలు చేయకుండా ఆయా కంపెనీలు దోబూచులాడుతున్నాయని విమర్శించారు.

అవీఇవీ

విధేయతకు పట్టం

(5వ పేజీ తరువాయి)

ఎన్నిక ప్రక్రియ, ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ అంతా గంటలోనే పూర్తయింది.

తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా..

తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా, పార్టీ కార్యక్రమాలను నడిపిస్తూ.. పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తున్న కోవెలమూడి రవీంద్ర(నాని) గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని అధిష్టించారు. ఆయనను మేయర్‌గా ఎంపిక చేసి గెలిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దీంతో రంగంలో దిగిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారు. తెలుగుదేశం పార్టీలో నాని క్రియాశీలక పాత్ర పోషిస్తూ..నాని 20 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తూ వచ్చారు. కార్యకర్తగా, నాయకుడిగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను ఆయన సమర్థంగా నిర్వహించారు. పార్టీ కష్ట కాలంలో కూడా ఆయన వెన్నంటి ఉండి, పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆయన టికెట్ ఆశించారు. అయితే సామాజిక సమీకరణాల మూలంగా సీటు చేజారింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మాధవికి సీటు కేటాయించినా.. ఆమె గెలుపునకు నాని కృషి చేశారు.

గతంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బాగా దెబ్బతింది. పార్టీ తరఫున 57 మంది కార్పొరేటర్లు పోటీ చేయగా కేవలం 8 మంది మాత్రమే గెలుపొందారు. ఈ సమయంలో గుంటూరు నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్‌గా కౌన్సిల్లో నాని పార్టీ గళాన్ని వినిపించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపొందడంతో వైసీపీ కార్పొరేటర్లు కొంతమంది తెలుగుదేశంలో, మరికొందరు జనసేన పార్టీలో చేరారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరుగురు సభ్యులను కూటమి గెలుపొందింది.

అన్నీ తానై నడిపించిన.. పెమ్మసాని

నగర మేయర్ ఎన్నిక ప్రక్రియ మొదలు నుండి... నాని నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టే వరకు అన్నీ తానై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముందుండి నడిపించారు. కార్పొరేటర్‌లను, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కలుపుకొని ముందుకు సాగారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నానీని మేయర్‌గా గెలిపించి ఆయనను ఆ స్థానంలో కూర్చోబెట్టారు.

వెల్లువెత్తిన అభినందనలు, నగరంలో భారీ ర్యాలీ

నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన కోవెలమూడి రవీంద్రను ప్రముఖులు కలిసి అభినందించారు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి, నసీర్ అహ్మద్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టీడీపీ రాష్ట్ర నాయకులు మన్నవ మోహన్ కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. అభినందన కార్యక్రమం అంతా కోలాహలంగా సాగింది. అనంతరం జీఎంసీ నుంచి ప్రత్యేక వాహనంపై మేయర్ భారీ ర్యాలీ నిర్వహించారు. అభిమానులు, పార్టీ నాయకుల సంబరాల మధ్య.. భారీగా బాణ సంచా కాలుస్తూ ఊరేగింపుగా సాగింది.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు


విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి పట్టణంలోని 6వ వార్డు రామ్‌నగర్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈఈ మస్తాన్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా వినియోగదారులతో మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది పనితీరు, జవాబుదారితనం గురించి ఆరా తీశారు. విద్యుత్ సరఫరాతో పాటు ఎలాంటి అసౌకర్యం కలిగినా సిబ్బందికి సమాచారం అందించాలని, సిబ్బంది సరిగ్గా స్పందించకపోతే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం ఎస్ఎస్‌పీ కాలనీలో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం సిద్ధం చేసిన స్థలాన్ని పరిశీలించారు. బుధవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎస్ఎస్‌పీ కాలనీలో ఇండోర్ సబ్‌స్టేషన్, శింగరకొండ రోడ్డులోని ద్వారకానగర్ వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించారు. డీఈఈ దామోదరం, టౌన్ ఏఈ ఎన్. శ్రీనివాసరావు, కన్‌స్ట్రక్షన్ ఏఈ షైలా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కొమ్మాలపాటి సుధీర్, కంపా రజనీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌కు వ్యవసాయ కళాశాల విద్యార్థులు


ఆల్ ఇండియా స్పోర్ట్స్‌కు ఎంపికైన విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆయోధ్యలో మే 5, 6 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా వ్యవసాయ కళాశాలల స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనేందుకు సీఎస్‌పురం మండలంలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మునయ్య, సుదేష యమున ఎంపికయ్యారు. ఈసందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం అభినందించారు.

నీటి కష్టాలు తీర్చిన టీడీపీ నాయకుడు

పొదిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నగరపంచాయతీ పరిధిలోని శ్రీపతినగర్ కాలనీలో నీటి సమస్యను టీడీపీ నాయకులు తీర్చారు. కొంతకాలంగా నీటి కాలనీవాసుల నీటి ఇబ్బందులను తెలుసుకున్న టీడీపీ నాయకుడు ముని శ్రీనివాసులు ఆ విషయాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి,అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అధికారులు ఆ బోరుకు మరమ్మతులు చేయించి, కొళాయిని ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మంత్రి స్వామి

పాకలలో కలెక్టర్ అన్సారియాతో కలిసి మత్స్యకారులకు చెక్కుల పంపిణీ

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

సింగరాయకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మండలంలోని పాకల పల్లెపాలెంలో మత్స్యకార సేవలో కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి పాల్గొన్నారు. సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లోని 1,556 మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతిని కింద రూ.3కోట్ల 11లక్షల 20వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో భృతికింద రూ.20 వేలు మత్స్యకారులకు అందజేశామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో చంద్రన్న బీమాను, సబ్సిడీలను రద్దుచేసి మత్స్యకారులకు ద్రోహం చేశారని మండిపడ్డారు. పాకల తీరంలో టూరిస్ట్‌ల రక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రూ.15 లక్షలతో వాచ్‌టవర్ నిర్మాణం శరవేగంగా జరుగుతున్నదన్నారు. టంగుటూరు నుంచి పాకలకు రూ.5.5 కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వచ్చే నెలలో తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు స్కూల్‌కి వెళ్తుంటే అందరికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు అందజేస్తామన్నారు.

టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు : కలెక్టర్

పాకలలో టూరిజం, మత్స్యకారుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. తమిళనాడు నుంచి వస్తోన్న సోనాబోట్ల సమస్యను కూడా అక్కడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఏటా మత్స్యరంగంలో 15 శాతం వృద్ధిని సాధించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అనంతరం పాకల, ఊళ్లపాలెంలో రూ.1.70 కోట్ల నిర్మించిన సీసీరోడ్డును కలెక్టర్, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మంత్రి స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, తహసీల్దార్లు రవి, ఆంజనేయులు, ఏఈ వర్షిణి, నియోజకవర్గపరిశీలకులు అడకా స్వాములు, సర్పంచ్ సైకం చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు సన్నెబోయిన శ్రీనివాసులు, షేక్ సందానీబాషా, చీమకుర్తి కృష్ణ, గాలి హరిబాబు, పోతురాజు, కన్నా ప్రసాద్, గ్రామకాపులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లా వైద్యాధికారి, నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలో స్త్రీ, పురుషుల వార్డులలో చేపట్టాల్సిన మార్పులపై చర్చించారు. ఒంగోలు రిమ్స్‌లో జరుగుతున్న పెయింటింగ్ పనులపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని అందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులకు అధికం నిధులు కేటాయిస్తున్నామని మంత్రి తెలిపారు. వైద్యులు బాధ్యతయుతంగా పనిచేసి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు.


సీసీరోడ్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

అవీ..ఇవీ..

కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో కుసుమకుమారి


కుట్టుమిషన్ కుట్టి శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహిళల స్వయం ఉపాధి పెంచేందుకు ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణను మహిళలు సద్వినియెగం చేసుకోవాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి కోరారు. సోమవారం బల్లికురవలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్న కుట్టుమిషన్ శిక్షణను ఎంపీడీవో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి 144 మంది మహిళలు కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకొన్నారన్నారు. వారిని రెండు బ్యాచ్‌లుగా విభజించి, ఉదయం సాయంత్రం మూడు మాసాల పాటు శిక్షణ అందించి ఆనంతరం వారికి ఉచితంగా కుట్టు మిషన్‌తో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. మహిళలు కూడా ఎంతో జాగ్రత్తగా ఉండి శిక్షణ పొందాలన్నారు. ఈ శిక్షణకు ఇరువురిని నియమించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మానందం పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనాలు


మట్టినమూనాలు సేకరిస్తున్న ఏవో

పంగులూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో పంటసాగులో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏవో డి. సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండమూరు, ముప్పవరం గ్రామాలలో సోమవారం రైతులతో కలసి పలువురి రైతుల పొలాలలో మట్టినమూనాలు సేకరించారు. మట్టి నమూనాల కోసం మట్టిని సేకరించే విధానాన్ని రైతులకు తెలియజేశారు. భూసార పరీక్షల ద్వారా రానున్న వ్యవసాయ సీజనులో ఆయా భూములలో సాగు చేసే పంటలు, ఆ పంటకు కావాల్సిన ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు భూసార పరీక్షల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు

వడదెబ్బ నివారణకు సూచనలు

పంగులూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండతీవ్రతలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అలవలపాడు గ్రామంలో పర్యటించారు. వేసవి నేపథ్యంలో తగు అవసరాల నిమిత్తం ఇంటి నుండి బయటకు వెళ్లే వారు విధిగా గొడుగును వినియోగించాలన్నారు. పనికి వెళ్లే వారు తలకు టవల్ చుట్టుకోవడం, బండిపై వెళ్లే వారు హెల్మెట్ పెట్టుకోవడం, మహిళలు తలకు మందపాటి చున్నీ, టోపీలు వినియోగించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాటర్‌బాటిల్‌ను వెంట తీసుకువెళ్లాలన్నారు. నీరసంగా అనిపిస్తే ఏఎన్ఎంల ద్వారా ఓఆర్ఎస్. ప్యాకెట్ తీసుకుని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌హరిబాబు, సీహెచ్‌వో మార్త, ఏఎన్ఎం రేణుక, 104 సిబ్బంది జాషువ, ప్రతాప్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలోని వివిధ కేటగిరిలలో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించి పరిష్కారించాలని ఎన్ఎంయూఏ జిల్లా కార్యదర్శి తులసి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం అద్దంకి ఆర్టిసి బస్టాండ్ ఆవరణంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్‌లు, అక్రమ రి మూవల్స్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్ళగా నిలిచి పోయిన ప్రమోషన్‌లను వెంటనే ఇ వ్వలని కోరారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ అనపర్తి వందనంబాబు, ట్రెజరర్ మందా అంజనేయులు, శీలం ప్రకాశ్‌రావు తదితర కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారంచేడు వాసి దుర్మరణం

● తిరునాళ్లకు హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చిన యువకుడు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గోపీ (ఫైల్)

చీరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చీరాల - కారంచేడు రోడ్డులో సోమవారం వేకువ జామున చోటుచేసుకొంది. కారంచేడు పరిధిలోని యజ్ఞశాలపేటకు చెందిన స్వర్ణ గోపీ(23) ఆయన తమ్ముడు కోటేశ్వరరావు హైదరాబాదులో వేర్వేరుగా ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నరు. ఈక్రమంలో స్వగ్రామమైన కారంచేడులో తిరునాళ్ల ఉండడంతో అన్నదమ్ములిద్దరు గత శనివారం ఇంటికి వచ్చారు. అయితే స్నేహితులను కలిసేందుకు చీరాలకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గం మధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు రాంబాబు, రాధ, తమ్ముడు కోటేశ్వరరావు విగతజీవిగా పడివున్న గోపీను చూసి బోరున విలపించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలాగే ఘటనపై విచారిస్తున్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు

● 400 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం

చీరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామనగర్‌లో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, బాపట్ల ఈఎస్‌టీఎఫ్, మంగళగిరి ఎస్‌టీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 400 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే ఒకరి వద్ద 2 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. అంతేకాకుండా బెల్లం దుకాణదారులను తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద హాజరుపరచి, కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ గురైన హుండీ లభ్యం

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లమ్మతల్లి ఆలయంలో ఆదివారం చోరీ జరిగిన సంగతి పాఠకులకు విదితమే. ఆదివారం వరకు ఎంత వెదికినా ఆచూకీ లేని ఆలయం హుండీ సోమవారం ఉదయం రైలుపట్టాల సమీపంలోని జీడిచుట్టు వద్ద లభ్యమైంది. దీంతో స్థానికులు వేటపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు హుండీను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో చూస్తుంటే చోరీకు పాల్పడింది. పరిసర ప్రాంతానికి చెందిన వారై ఉంటారని ఆరా తీస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో


నుజ్జు నుజ్జు అయిన ఆటో

బల్లికురవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటన మండల పరిధిలోని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై కొప్పెరపాడు వద్ద చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో నాలుగు చక్రాల ఆటో ముందు భాగం దెబ్బతింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.

ధరలు లేక బర్లీ రైతుల గగ్గోలు

● నిలిచిన కొనుగోళ్లు ● ఆందోళన చెందుతున్న కర్షకులు ● ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

అద్దంకి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ధరాఘాతంతో బర్లీ పొగాకు రైతులు ఆందోళన చెందతున్నారు. రెండు, మూడు సంవత్సరాల నుంచి దిగుబడులు, ధరలు ఆశాజనకంగా ఉండడం, ధరలు బాగా ఉండడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ పంటను సుమారు 60 వేల ఎకరాలలో సాగు చేశారు. ప్రధానంగా పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోనే సాగు అధికంగా ఉంది. అందులో కూడా బ్లాక్ బర్లీ పొగాకు ను ఎక్కువ భాగం సాగు చేశారు. ఈ ఏడాది పొగ నాట్లు సమయంలో వర్షాలు పడడంతో రెండు, మూడు సార్లు నాట్లు వేయాల్సి వచ్చింది. దీంతో సాగు వ్యయం కూడా బాగా పెరిగింది. దీనికి తోడు గతంలో ఎన్నడూ లేని విధంగా బర్లీ దిగుబడులు బాగా తగ్గాయి. కనీసం ధరలైనా ఆశాజనకంగా ఉంటాయనుకుంటే అదీలేకుండా పోయింది. వైట్‌బర్లీ పొగాకును ప్రైవేట్ కంపెనీలు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయి. దీంతో ముందస్తు అగ్రిమెంట్ తీసుకున్న రైతుల వద్ద నుంచి మాత్రం ఆయా ప్రైవేట్ కంపెనీలు మొక్కుబడిగా కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ బర్లీ పొగాకును కూడా గత ఏడాది పరుగులు తీసి కొనుగోలు చేసిన ప్రైవేట్ కంపెనీలు ఈ ఏడాది మాత్రం కనీసం అటువైపు కూడా కన్నెత్తి చూడటం లేదు. వైట్ బర్లీ క్వింటాళ్లు గత ఏడాది అత్యధికంగా రూ.18 వేలకు కొనుగోలు చేశారు. బ్లాక్ బర్లీ కూడా రూ.15 వేలకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది వైట్ బర్లీ మాత్రమే అక్కడక్కడ కొను గోలు చేశారు. అత్యధికంగా సాగు చేసిన బ్లాక్ బర్లీ పొగాకు ను మాత్రం అసలు కొనుగోలు చేయకపోవడంతో ఎక్కడ నిల్వలు అక్కడే ఉండిపోయాయి. బ్లాక్‌బర్లీ పొగాకు ఈ ఏడాది నాలుగైదు వేల రూపాయలకు మించి కొనుగోలు చేయడం లేదు. దీంతో కొంత మంది రైతులు ఇళ్లలో నిల్వపెట్టగా, మరికొంత మంది రైతులు కనీసం కూలీ ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేక పొలాలలోనే వదిలేశారు. దీనికితోడు సాగు విస్తీర్ణం బాగా పెరిగి కూలీలకు డిమాండ్ వచ్చింది. దీంతో సాగువ్యయం బాగా పెరిగింది. దిగుబడులు గత ఏడాది 15 నుండి 20 క్వింటాళ్లు ఉండగా ఈ ఏడాది 10 నుండి 15 క్వింటాళ్లకు కు మించి రాలేదు. బర్లీ సాగు చేపట్టిన రైతులలో అత్యధిక శాతం కౌలు రైతులే ఉన్నారు. దీంతో పూర్తిగా అప్పుల పాలయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. బర్లీ పొగాకు సాగు చేసిన రైతులతో కలిసి రైతు సంఘాల ప్రతినిధులు ఆందోళన కార్యక్రమాలకు పిలుపు నిచ్చారు. ఇప్పటికే పర్చూరు నియోజకవర్గ రైతులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ను కలిసి సమస్యను వివరించారు. ఆయా మండలా లలో అధికారులను కలిసి వినతి పత్రాలు కూడా అందజేస్తున్నారు.


తోటల్లోనే వదిలేసిన పొగాకు


జమ్మలమడక వద్ద పందిరి లో ఉన్న బర్లీ పొగాకు

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు



ఎకరాకు రూ.1.50 లక్షల రూపాయలు పెట్టుబడి అయ్యింది. గత ఏడాది బ్లాక్ బర్లీ పొగాకు కు ధర ఆశాజనకంగా ఉండటంతో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశారు. ఈ ఏడాది అసలు కొనే వాళ్ళు లేరు.ఏమి చేయాలో పాలు పోవటం లేదు. అప్పుల పాలయ్యాను.

శివనాగేశ్వరరావు, కౌలురైతు, పర్చూరు

వీర్లచెరువు భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు రైతుల వినతి

బల్లికురవ. ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వీర్లచెరువు భూమిని కొందరు గ్రానైట్ క్వారీల నిర్వహణకు అవసరమైన రోడ్డుతో ఆక్రమించుకుంటున్నారని తక్షణమే చర్యలు చేపట్టాలని నక్కబొక్కలపాడు నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, రైతులు తహసీల్దార్ రవి నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల నుంచి వీర్లచెరువు భూమిలో ఒక వ్యక్తి రోడ్డు వేస్తుండడంతో ఆదివారం రైతులు వెళ్లి పనులను అడ్డుకొన్నారు. సోమవారం నక్కబొక్కలపాడుకు చెందిన రైతులు తహసీల్దార్‌ను కలిసి చెరువు భూమిలో వేసిన రోడ్డును వెంటనే తీసివేయాలని కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ చెరువు భూమిలో అనుమతులు లేకుండా ఎవరైన రోడ్లు వేసినా, డంపింగ్ వ్యర్థాలు పడవేసిన కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు వెంటనే గ్రామరెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేయించి చర్యలు చేపడతామన్నారు. ఇరిగేషన్ జేఈ నారాయణస్వామి వీర్లచెరువును పరిశీలించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మంత్రి అచ్చెన్నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి భేటి

● పొగాకు రైతుల సమస్యను పరిష్కరించాలని వినతి
● నేడు పొగాకు వ్యాపారులతో సమావేశం

పర్చూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు రైతుల సమస్యపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. సోమవారం వ్యవసాయశాఖ మంత్రి కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి కలసి పొగాకు రైతుల సమస్యను వివరించారు. వైట్‌బర్లీ రైతులు ధరలేక కొనుగోలు లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతాంగానికి న్యాయం చేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి ముందడుగు వేశారు. మంగళవారం ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆధ్వర్యతన పొగాకు కంపెనీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడ అడవులతో పర్యావరణ ప్రయోజనాలు

చినగంజాం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : మడ అడవులు భూమి యొక్క అత్యంత ముఖ్యమైన ఉత్పాదక జీవావరణవ్యవస్థలలో ఒకటని, ఇవి శక్తిమంతమైన రక్షణను, భర్తీ చేయలేని పర్యావరణ ప్రయోజనాలు ఎన్నో అందిస్తాయని బాపట్ల డివిజనల్ ఫారెస్ట్ అధికారి ఎల్.భీమయ్య అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఏటిమొగ గ్రామ సమీపంలో ట్రీ ఫౌండేషన్, అటవీ శాఖల ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఆధారిత మడ అడవుల జీవావరణ వ్యవస్థ మార్గాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీసీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సూరజ్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఎఫ్‌వో మాట్లాడుతూ స్థానికులు తమ పర్యావరణ సంపదను పరిరక్షించడానికి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మడ అడవుల్లో విస్తరించే మొక్కలను చూడాలనే ఆసక్తి కలిగిన వారు, విద్యార్థులు వస్తే వారిని ట్రీ ఫౌండేషన్ వారు బోటు ద్వారా మడ మొక్కల దగ్గరకు తీసుకొని వెళ్లి వాటి యొక్క ఉపయోగాలు, జీవవైవిధ్యంలో వీటి పాత్ర గురించి వివరిస్తారన్నారు. ట్రీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సుప్రజధరిని 'కమ్యూనిటీ బేస్ట్ మంగ్రోవ్ ఎకో సిస్టమ్ ట్రైల్ ఉద్దేశం గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రీ ఫౌండేషన్ ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల సమన్వయకర్తలు సాయి మహేష్, నరేష్, ఎస్.చంద్రారెడ్డి, పాండురంగారావు, ఏటిమొగ గ్రామ కాపులు, సముద్ర తాబేళ్ల రక్షణ దళసభ్యులు పాల్గొన్నారు.


మడ అడవుల జీవావరణ వ్యవస్థ మార్గాన్ని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో భీమయ్య

విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

జీసీడీవో చారులత

బల్లికురవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బడిమానిన బాలికలకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని సమగ్రశిక్ష జిల్లా జీసీడీవో చారులత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గుంటుపల్లి గ్రామంలో ఉన్న కేజీబీవీ విద్యాలయాన్ని పరిశీలించారు. నూతనంగా రూ. 1.50 కోట్లతో నిర్మిస్తున్న వసతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల కంప్యూటర్ ల్యాబ్ కోసం నిర్మించిన పాల్ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో ఉన్న కేజీబీవీ విద్యాలయాన్ని పరిశీలించారు. ఈ విద్యాలయలంలో ఇటీవల పదో తరగతిలో ఫెయిల్ అయిన చీరాల, చినగంజాం, బల్లికురవ విద్యాలయాలకు చెందిన 50మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏల్చూరు విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు అందరూ ఉత్తీర్ణత సాధించేలా కష్టపడి చదవాలన్నారు. ఆనంతరం విద్యార్థినులతో అమె మాట్లాడారు. ఈ పరిశీలనలో జిల్లా అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాసరావు, జేఈ రాజన్‌బాబు, ప్రిన్సిపాల్స్ సరళకుమారి, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కోరికలతో బతుకు చీకటి మయం

చీరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కోరికలతో జీవితాలు చీకటిమయంగా మారుతాయని నిశినాటిక ద్వారా కళాకారులు ప్రదర్శించారు. సాంస్కృతిక మిత్రమండలి చీరాల కళాంజలి నాటికలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మామిడాల వెంకయ్య, సీతారావమ్మ కళావేదిక ఆధ్వర్యంలో నిశి, అనంతరం బ్రహ్మస్వరూపం నాటికలు ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో ప్రదర్శనలు చూసేందుకు ప్రేక్షకులు ఉత్సాహం చూపారు. బుధవారంతో నాటికలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగుల హక్కులకు రక్షణ కల్పించండి

చీరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల హక్కులకు రక్షణ కల్పించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా అన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌ను ఆయన కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రీతిగా మున్సిపాలిటీ పరిధిలోని షాపింగ్ కాంపెక్సులో దుకాణాలు కోటా ఆధారంగా అందించాలని కోరారు. దివ్యాంగుల చట్టం-2016 ప్రకారం అర్హులైన దివ్యాంగులకు దుకాణాలు కేటాయించాలని కోరారు. అనంతరం కమిషనర్ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మొగల్, సాలెహ, వెంకటేశ్వర్లు, కుమార్ తదితర దివ్యాంగులు పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి రేపు భూమి పూజ

ప్రారంభించనున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో పురాతన కాలంలో అనాటి పెద్దలు నిర్మించిన వేణుగోపాలస్వామి దేవాలయం జీర్ణావస్థకు చేరింది. గ్రామానికి దూరంగా ఉన్న ఈ దేవాలయానికి భక్తులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొంతకాలం నుంచి పూజారులు మాత్రమే వెళ్లి పూజలు చేసి వస్తున్నారు. ఈ దేవాలయం కూలేందుకు సిద్ధంగా ఉండడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. దేవాలయం నిర్మాణం చేయాలంటే కోట్ల నిధులు అవసరం కావడంతో గ్రామపెద్దలు దేవాలయం పునర్నిర్మానం చేయాలని ఇటీవల గ్రామంలో చర్చలు నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా దేవాలయ నిర్మాణానికి నిధులు మంజురు చేయించాలని తీర్మానం చేసుకొన్నారు. దేవాలయం శిథిలావస్థ విషయాన్ని గ్రామ పెద్దలు వెంటనే విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వివరించారు. పురాతనకాలం నాటి దేవాలయాన్ని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి రవికుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని దేవాదాయ శాఖ ద్వారా దేవాలయం నిర్మాణం చేస్తే ఎంత ఖర్చు అవుతుంది అని ప్రతిపాదనలు తయారు చేయించారు. పూర్తి దేవాల యానికి రూ.1.45 కోట్ల నిధులు అవసరం అని అధికారులు తెలియజేశారు. గ్రామస్థులు రూ. రూ.48 లక్షలు చెల్లిస్తే దేవాదాయ శాఖ ద్వారా సీజీఎఫ్ గ్రాంటులో రూ.96. 67 లక్షలను మంజురు చేసేందుకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో గ్రామస్థులు తమ మ్యాచింగ్ నిధులను దేవాదాయశాఖకు జమ చేయటంతో ప్రభుత్వం రూ. 1.45 కోట్లను మంజురు చేస్తూ, కమిషనర్ ఉత్వర్వులు ఇచ్చారు. మంత్రి రవికుమార్ కృషితో గ్రామంలో పురాతన దేవాలయంకు నిధులు మంజురు చేయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పెద్దల పర్యవేక్షణలో నూతన దేవాలయ పనులు ప్రారంభం కానున్నాయి. భూమి పూజ కార్యక్రమం బుధవారం మంత్రి రవికుమార్ చేతుల మీదగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.


శిథిలమైన వేణుగోపాలస్వామి ఆలయం

కాలువ పనుల పరిశీలన

అద్దంకి డివిజన్ పరిధిలో రూ. 1.20 కోట్లతో అభివృద్ధి పనులు


పనులను పరిశీలిస్తున్న అధికారులు

బల్లికురవ. ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల మంత్రి రవికుమార్ ఆదేశాలతో అభివృద్ధి పరిచిన పలు మేజర్, మైనర్ కాలువలను సోమవారం జిల్లాక్వాలిటీ కంట్రోల్, ఎన్ఎస్‌పీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మెత్తం ఆరు వర్కులను రూ.1.20 కోట్లతో అభివృద్ధి పరిచారు. పమిడిపాడు, అద్దంకి, వెంపరాల, గుంటుపల్లి, వైదన మేజర్లతో పాటు పలు మైనర్ కాలువలు చిట్టడవిలా మారడంతో ప్రభుత్వం మంజురు చేసిన నిధులతో కాలువలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. ఈ మేజర్లను క్వాలిటీ కంట్రోల్ ఈఈ రాజగోపాల్, డీఈఈ సత్యభూషణ్, ఏఈఈ చెంగారావు, ఎన్ఎస్పీ ఈఈ సతీష్, డీఈఈ రామకృష్ణ, ఏఈఈ క్రాంతికుమార్‌లు తనిఖీలు చేశారు. పనులలో నాణ్యతలను వారు పరిశీలన చేశారు. రైతులకు ఉపయెగ పడేలా కాలువలను అభివృద్ధి చేపట్టాలని వారు కాంట్రాక్టర్లకు సూచించారు. వీరి వెంట టీడీపీ నేతలు పోగుల కృష్ణ, తిరుమలశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసంపై కలెక్టర్‌ను కలిసిన గజవల్లి

● ఆయన తీరుపై అసహనం వ్యక్తం చేసిన పార్టీ కార్యాలయం


కలెక్టర్‌ను కలిసిన గజవల్లి శ్రీనివాసరావు, ఇతర నాయకులు

చీరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై ఇటీవల ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై టీడీపీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు కొంతమందితో సోమవారం కలెక్టర్ వెంకట మురళీని కలిశారు. సంబంధిత అవిశ్వాసంపై చర్యలు తీసుకోవద్దని కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. గజవల్లి వ్యవహరించిన తీరు వ్యక్తిగత అభిప్రాయని, పార్టీకు సంబంధం లేదని ఆ ప్రకటనలో తెలిపారు. గజవల్లి అనాలోచిత తీరును ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీడు భూములను పచ్చగా మార్చండి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో బీడు భూములు, సేద్యయోగ్యమై సాగుచేయని భూములను గుర్తించి పచ్చని పంటలతో కళకళలాలే విధంగా చూడాలని తహసీల్దార్ పార్వతి, ఎంపిడివో రాజేష్, ఉద్యాన అధికారి అలేఖ్య పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, జాతీయ ఉపాధి అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో సాగుకు నోచుకుని భూములపై సర్వే నిర్వహించాలని సూచించారు. తద్వారా ఉద్యాన పంటలతో సాగుకు ప్రయోజనకరంగా మారేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కాశీ విశ్వనాథ్, ఏపీవో దాసు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసు రిజిస్టర్ బహిర్గతం కావడంపై నిరసన

● ఉపాధ్యాయుల రికార్డులకు భద్రత కరువైందని ఆవేదన


మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్‌లకు భద్రత కరువైందని, ఇది అన్యాయమని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వేటపాలెం మండలశాఖ ప్రతినిధులు అన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షులు శ్రీనివాసరావుకు సంబంధించిన సర్వీసు రిజిస్టర్ సోషల్ మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో ఆగ్రహించిన ఉపాధ్యాయులు సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సుమారు 50 మంది ఉపాధ్యాయులు నిరసనకు దిగారు. దీంతో ఎంఈవో జేవీ సుబ్బయ్య ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

వేసవి దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం


పర్చూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజలు, ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకే ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ అన్నారు. సోమవారం స్థానిక బొమ్మల కూడలిలో రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 45రోజుల పాటు ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని దాతల సహకారంతో రొటేరియన్ గడ్డిపాటి శ్రీనివాసరావు సారధ్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు షేక్.షంషుద్దీన్, కఠారి సురేంద్రబాబు, మంగళగిరి కోటేశ్వరరావు, రోటరీ సభ్యులు కోటా శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రం, నాగభైరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చెప్పులు, గొడుగులు పంపిణీ...

వేసవి దృష్ట్యా పారిశుధ్య కార్మికులకు సోమవారం స్థానిక బొమ్మల సెంటర్‌లో దాతలు సమకూర్చిన చెప్పులు, గొడుగులు ఉచితంగా పంపిణీ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చీరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు ద్వారా దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందని మునిసిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక ఎన్ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో తుమ్మ ప్రేమయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఫుట్‌బాల్ క్రీడలు ప్రారంభించారు. క్రీడాకరులను, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, హరి ప్రసాద్, సలావుద్దీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.2	27.7
కావలి	36	28
ఆత్మకూరు	47	27
ఉదయగిరి	39	26
కందుకూరు	36	28

రేపటినుంచి సాఫ్ట్‌బాల్ టోర్నీ

వీఎస్‌యూలో మే 8వ తేదీ వరకు నిర్వహణ

దేశవ్యాప్తంగా 3వేల మందికిపైగా క్రీడాకారుల హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో (వీఎస్‌యూ) బుధవారం నుంచి మే 8వ తేదీ వరకు జరిగే అంతర యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆ వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత వెల్లడించారు. సోమవారం కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 94 మహిళా, 97 పురుషుల జట్లు పాల్గొంటాయని, ఒక్కో జట్టులో 16 మంది క్రీడాకారుల చొప్పున వారితో వచ్చే మేనేజర్లు, కోచ్‌లు కలిపి 3 వేల మందికిపైగా హాజరు కానున్నట్లు చెప్పారు. 40 మంది జాతీయ స్థాయి అంపైర్లను, రెఫరీలను టోర్నమెంట్ కోసం రప్పించినట్లు తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలో 5 సాఫ్ట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి సాయంత్రం వరకు 35 మ్యాచ్‌లను నిర్వహిస్తామన్నారు. ఇక తరలివచ్చే క్రీడాకారుల కోసం నెల్లూరులోని రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా వర్సిటీ ప్రాంగణానికి క్రీడాకారులను తీసుకురానున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు వసతి, సదుపాయాలను వర్సిటీలోని హాస్టల్ గదులలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సౌత్, నార్త్ ఇండియన్ ఫుడ్ స్టాళ్ల ఏర్పాటుతోపాటు నిరంతరం విద్యుత్, నీటి వసతి కోసం అధికారులతో చర్చించినట్లు చెప్పారు. టోర్నమెంట్ ప్రారంభం, ముగింపు వేడుకలలో పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పలు వర్సిటీల వీసీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతమైతే జాతీయస్థాయిలో వీఎస్‌యూ ర్యాంకింగ్ మెరుగుపడేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పీఆర్‌వో డాక్టర్ కోట నీలమణికంఠ, టోర్నమెంట్ కమిటీ సభ్యులు పీ ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏ ప్రవీణ్‌కుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ వివరాలు వెల్లడిస్తున్న వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, తదితరులు

విధేయతకు 'సహకారం'!





సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన సీనియర్ నాయకులు మెట్టుకూరు ధనంజయరెడ్డి, గంగోడు నాగేశ్వరరావులను కీలక పదవులతో ఆ పార్టీ అధిష్ఠానం సంతృప్తి పరిచింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా మెట్టుకూరు, జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నాగేశ్వరరావులను నియమించింది. ఈ రెండు నియామకాలతో టీడీపీ బలోపేతానికి సుదీర్ఘ కాలం పనిచేసిన ఇద్దరు నాయకులకు సముచిత పదవులు దక్కినట్లు అయ్యింది.



మెట్టుకూరు ధనంజయరెడ్డి రెండవ పర్యాయం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా నియమితులయ్యారు. 2014-19లో టీడీపీ హయాంలో కూడా ఈయన డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. అనంతసాగరం మండలానికి చెందిన మెట్టుకూరు తొలి నుంచి ఆనం కుటుంబానికి సన్నిహితుడిగా ఉన్నారు. అటు ఆత్మకూరు, ఇటు వెంకటగిరి నియోజకవర్గాల్లో బలమైన బంధువర్గం కలిగిన మెట్టుకూరు ఆనం రామనారాయణరెడ్డి ముఖ్య అనుచరుడిగా రాజకీయాల్లో కొనసాగారు. 2019, ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్టు కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అయితే అది దక్కకపోవడంతో మనస్తాపానికి గురై కొంతకాలం వైసీపీలో కొనసాగారు. మొన్నటి ఎన్నికల్లో ఉదయగిరి వైసీపీ టికెట్టు కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పటికే ఆనం టీడీపీలో చేరడంతో ఈయన కూడా తిరిగి మాతృ పార్టీలో చేరిపోయారు. ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేశారు. సుదీర్ఘ కాలంగా ఈయన చేస్తున్న సేవలను గుర్తించి టీడీపీ అధిష్ఠానం రెండవ సారి డీసీసీబీ చైర్మన్‌గా నియమించింది.



ఇక డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన గంగోడు నాగేశ్వరరావు వెంకటగిరికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు. గతంలో ఈయన పెంచలకోన ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పని చేశారు. టీడీపీ ముఖ్య నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎమ్మెల్యే టికెట్టు కోసం సైతం పలుసార్లు తీవ్రంగా ప్రయత్నించి, విఫలమయ్యారు. టీడీపీ బలోపేతానికి ఈయన చేసిన శ్రమను గుర్తించిన ఆ పార్టీ అధిష్ఠానం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నియమించింది. జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ నాయకులకు కీలక పదవులు దక్కడం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

\- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- డీసీసీబీ చైర్మన్‌గా 'మెట్టుకూరు'
- డీసీఎంఎస్ చైర్మన్‌గా 'గంగోటి'
- పార్టీలో కష్టపడినవారికి పట్టం కట్టిన అధినేత

అటు పీఎం.. ఇటు సీఎం.. భద్రత ఎలా!?

అమరావతికి తరలిన 300 మంది పోలీసులు

ఉన్నవారితో ముఖ్యమంత్రి బందోబస్తు సాధ్యమేనా!

పొరుగు జిల్లాల నుంచి రప్పించేందుకు ప్రయత్నాలు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనల నేపథ్యంలో వారి భద్రత జిల్లా పోలీసు అధికారులకు తలనొప్పిగా మారింది. మే 2వ తేదీన అమరావతికి ప్రధాని మోదీ వస్తుండగా జిల్లా నుంచి 10 మంది ఎస్‌ఐలు, 290 మంది సిబ్బందిని బందోబస్తు కోసం కేటాయించారు. ఈ మేరకు వీరంతా సోమవారం నగరంలోని పోలీసు కవాతు మైదానం నుంచి వాహనాల్లో అమరావతికి తరలివెళ్లారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మే 1వ తేదీ గురువారం ఆత్మకూరుకు వస్తుండటంతో బందోబస్తు ఏర్పాట్లలో పోలీసు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

● ఇతర జిల్లాల నుంచి రప్పించాల్సిందే!

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని భద్రత కోసం జిల్లా నుంచి 300 మంది పోలీసులు అమరావతికి వెళ్లారు. ఇప్పుడు సీఎం పర్యటనలో బందోబస్తు కోసం సిబ్బంది కొరత కనిపిస్తోంది. దీనిని అధిగమించేందుకు ఇతర జిల్లాల నుంచి పోలీసులను రప్పించాల్సిన అవసరం ఏర్పడింది. జిల్లాలో ఉన్న అధికారులు, సిబ్బందితోపాటు పొరుగు జిల్లాల నుంచి సిబ్బందిని రప్పించి సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు పోలీసు అధికారులు అడుగులు వేస్తున్నారు.

● కాగా, ఆత్మకూరులో సీఎం పర్యటన సందర్భంగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ ఇతర అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.



ఆత్మకూరులో సీఎం పర్యటన సందర్భంగా ఎస్పీతో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన కలెక్టర్ ఆనంద్

అడ్డుకట్ట వేసి.. చేపలు పట్టేసి!





మండుతున్న ఎండలకు ఇంకిపోతున్న జలవనరుల్లో చేపలు పట్టేందుకు పల్లెవాసులు ఉత్సాహం చూపుతున్నారు. కోవూరు మండలం జమ్మిపాళెంలోని ఓ పంట కాలువలో నీరు ఇంకిపోయింది. ఇంకేముంది.. సమీప గ్రామపిల్లలు కాలువల్లోని బురదతో అడ్డుకట్టు వేసి చేపలు పట్టేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

కార్పొరేషన్‌లో ప్రక్షాళన!

నెల్లూరు నగర పాలక సంస్థలో అధికారుల ప్రక్షాళనకు సర్వం సిద్ధమవుతోంది. అవినీతి మరక అంటించుకున్న అధికారులను గుర్తిస్తున్న ఉన్నతాధికారులు వారిని బదిలీ చేసేందుకు దస్త్రాలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పలు విభాగాల అధిపతులకూ స్థానచలనం కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తుండగా అధికార పార్టీ ప్రతినిధులు, నేతల నుంచి లైన్‌క్లియర్ కోసం వేచిచూస్తున్నట్లు సమాచారం.

\- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



- అవినీతి మరక అధికారుల గుర్తింపు
- రెవెన్యూ విభాగంలోనే అత్యధికులు
- విభాగాధిపతులూ మారే చాన్స్
- రాజకీయ క్లియరెన్స్ కోసం వెయిటింగ్



కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగంపై పలు అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొందరు ఆర్‌ఐల తీరు విమర్శలకు తావిస్తోంది. ఓ ఆర్‌ఐ తన వద్ద కొత్త పన్ను వేసేందుకు రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నాడని బాధిత మహిళ గత కమిషనర్‌కు లేఖ రాసిన అంశం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇదే ఆర్‌ఐపై రూరల్లోని అధికార పార్టీ నేతలు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. మరో జీ+5 అపార్టుమెంట్‌కు రూ.1.80 లక్షలను సచివాలయ సిబ్బంది ద్వారా వసూలు చేయించగా దీనికి సంబంధించిన వాయిస్ రికార్డింగ్ హల్‌చల్ చేస్తోంది. ఇలా చాలామంది ఆర్‌ఐల పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి ఆర్‌ఐలను మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

● ఏమీ చేయలేని సూర్యతేజ

రెవెన్యూలో ఆర్‌ఐలుగా పాతుకుపోయి మాట వినడంలేదన్న కారణంగా రెవెన్యూ విభాగాన్ని సమూలంగా గత కమిషనర్ సూర్యతేజ ప్రక్షాళన చేశారు. ఆపై తెరపైకి వచ్చిన నూతన ఆర్‌ఐలలో ముప్పాతిక శాతం మంది పాతవారికంటే రెండింతల అవినీతికి ఆజ్యం పోశారన్న విమర్శలు వచ్చాయి. కొందరు ఆర్‌ఐలపై ఆధారాలతో సహా ఫిర్యాదులు అందాయి. అయితే, వీరందరిని తానే నియమించాను కాబట్టి చర్యలు తీసుకుంటే తన నిర్ణయం తప్పవుతుందన్న ఉద్దేశంతో గత కమిషనర్ ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. చివరకు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు సైతం ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పలేకపోయారు. రెవెన్యూ వసూళ్లలోనూ లక్ష్యం చేరుకోలేకపోయినా మందలించలేని దుస్థితికి చేరుకున్నారు. ఇదే అదునుగా కొందరు రెవెన్యూ అధికారులు అక్రమ వసూళ్లలో పేట్రేగిపోయారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి.

● నందన్‌కు సవాలే!

ఎఫ్ఏసీ హోదాలో ప్రస్తుత కమిషనర్‌గా ఉన్న వైవో నందన్‌కు రెవెన్యూ విభాగంలోని పాలన సవాల్‌గా మారింది. పది మంది విస్తీర్ణం కలిగిన ఆర్‌ఐల పరిధిని ఆరుగురికే కుదించిన గత కమిషనర్ నిర్ణయం తాజాగా తంటాలు తెచ్చిపెడుతోంది. స్థానిక కార్పొరేటర్లతో వివాదాలు పెంచుకుంటున్న ఆర్‌ఐల వ్యవహారం నియోజకవర్గ పెద్దలకు తలనొప్పిగా మారింది. నిబంధనలు పాటించకుండా వీఎల్టీలు లేకుండానే భవనాలకు పన్నులు వేయడం కొందరు కార్పొరేటర్లకు కోపం తెప్పిస్తుండగా భారీగా ఎస్ఎంసీ ఖజానాకు గండిపడుతోందని వారంతా వారిస్తున్నారు.

● విభాగాధిపతుల్లోనూ మార్పు?

కార్పొరేషన్ కార్యాలయంలోని కొందరు విభాగాధిపతులకు ఆయా సెక్షన్లపై అవగాహన లేదు. ఇటీవల జరిగిన బదిలీల్లో వీరందరిని బలవంతంగా సెక్షన్ల హెడ్‌లుగా నియమించారు. దీంతో వారు సెక్షన్లలో ఫైళ్లను క్లియర్ చేయలేక అవస్థలు పడటంతోపాటు మరి కొందరు సెలవుల పై వెళ్లిపోతున్నారు. దీంతో కార్యాలయంలో పాలన ఇబ్బందికరంగా మారుతోంది. అధికారుల నుంచి వస్తున్న ఫిర్యాదులు, విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుంటున్న ఉన్నతాధికారులు వారికి విభాగాలు మార్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

రేపటి 'పాలిసెట్'కు సర్వం సిద్ధం!

● హాజరుకానున్న 4,073 మంది విద్యార్థులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ఏసుదాసు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నెల్లూర, ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 30వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. గంట ముందుగానే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని, ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. నెల్లూరులో 2,599 మంది, 527, కావలిలో 596, కందుకూరులో 351 మంది మొత్తం 4,073 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇక కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా లైజన్ ఆఫీసర్స్ చర్యలు చేపట్టడంతోపాటు పోలీస్, వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష నిర్వహణ సమయంలో ఫోన్లువాడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పదిమంది చీఫ్ సూపరింటెండెంట్లు, 12 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, 200 మందికిపైగా ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా చీఫ్ అబ్జర్వర్‌తోపాటు నాలుగు డివిజన్‌లకు నలుగురు పరిశీలకులు పరీక్షలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

8లో..
పీజీఆర్ఎస్‌కు 455 వినతులు
● అత్యధికం రెవెన్యూ శాఖవే ● కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు
జగన్ అబద్ధాలు నమ్మొద్దు!
● ఉలవపాడులో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
బాధ్యతతో పని చేయండి
● న్యాయాధికారులకు జిల్లా న్యాయమూర్తి ఆదేశం

'ప్యాకేజీ-1' ఫైళ్లు మాయం!

పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఎన్ని ఆరోపణలు వచ్చినా విచారణకు మాత్రం అధికారులు సాహసించడం లేదు. తాజాగా ప్యాకేజీ-1కు సంబంధించిన కీలక ఫైళ్లు క్వాలిటీ కంట్రోల్ ఈఈ కార్యాలయంలో కనిపించడం లేదు. ఎన్నిసార్లు వెతికినా ఫైళ్ల జాడ లేకపోవడంతో ఈ విషయాన్ని క్యూసీ అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. అదే సమయంలో నెల్లూరు సెంట్రల్ డివిజన్‌లో కూడా కొన్ని రిక్విజిషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లు కనిపించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

- క్యూసీ కార్యాలయంలో జాడలేని రిక్విజిషన్లు
- తర్జనభర్జన పడుతున్న అధికారులు
- సెంట్రల్ డివిజన్‌లోనూ ముందుకు సాగని విచారణ
- ఆరోపణలు నిగ్గు తేల్చకుండానే సర్దుకున్నారా?
- హైకోర్టులోనూ కౌంటర్ వేయకుండా దోబూచులాట
- కాంట్రాక్టర్‌కు బిల్లుల మంజూరుకు ప్రయత్నాలు



నెల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పెన్నా డెల్టా సిస్టమ్‌ను ఆధునికీకరించేందుకు 2008-09లో రూ.308 కోట్ల అంచనాలతో ప్యాకేజీ-1 పేరుతో టెండర్లు పిలిచారు. మోడరనైజేషన్ చేయడమే కాకుండా 124 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నది ఉద్దేశం. ఈ వర్కును అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఓ వైసీపీ కీలక నేత 4.95 శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అయితే ఈ వర్కు అనుకున్న విధంగా పూర్తి కాలేదు. అనేకసార్లు రివైజ్ చేయించుకున్నారు. నిబంధనల ప్రకారం పనులు జరగలేదని, కాలువల లైనింగ్ వెడల్పులను తగ్గించి పనులు చేశారని గతంలోనే అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే నాడు ఎవరూ పట్టించుకోలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటికి 47 బిల్లులు చెల్లించారు. 2020 జూలైలో ప్రీక్లోజ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దాని ప్రకారం అధికారులు ప్రీక్లోజ్ ప్రక్రియను ప్రారంభించారు. ప్రీక్లోజ్‌లో భాగంగా అప్పటి వరకూ కాంట్రాక్టర్ చేసిన పనులన్నింటికీ ఎంబుక్ రికార్డింగ్ చేసి, వాటికి చెక్ మెజర్మెంట్ చేశారు. ఫైనల్ బిల్లు మొత్తం రూ.67 కోట్లు చెల్లించాలని తేల్చారు. ఈ మేరకు చేసిన పనులను పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయాలని నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి 2021 ఫిబ్రవరిలో క్వాలిటీ కంట్రోల్ ఈఈకు లేఖ వెళ్లింది. ఈ రిక్విజిషన్ ప్రకారం మొదట క్యూసీ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇందులో ఒక సర్టిఫికెట్లో రూ.4.12 కోట్లను అదనంగా చేర్చారు. ఇదే పేరుతో మరో రూ.4.40 కోట్లతో మరో సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇక ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక సీఈ అంచనాలు రివైజ్ చేయడం కూడా మరో వివాదంగా ఉంది. ఇక ఇందులో బ్యాంక్ కమిషన్ చార్జీలకు రూ.50 లక్షలకు అనుమతి ఇవ్వగా బిల్లులో మాత్రం దాదాపు రూ.2 కోట్లకు పైగా పెట్టినట్లు ఫిర్యాదులున్నాయి. ఇలా ఒక లెక్కా పక్కా లేకుండా ఇష్టమొచ్చినట్లు ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ ప్రక్రియ జరిగింది.

● ఇక్కడ విచారణ లేదు.. అక్కడ కౌంటర్ లేదు

ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందుతుంటే వాటిపై ఇరిగేషన్ ఉన్నతాధికారులు గానీ జిల్లా ఉన్నతాధికారులు గానీ కనీస విచారణ కూడా జరపలేదు. నెల క్రితమే కలెక్టర్ వివరణ కోరినా అధికారులు పూర్తిస్థాయి వివరణ ఇవ్వలేదు. ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈను విచారణాధికారిగా నియమించినా విచారణ ముందుకు సాగడం లేదు. ఇప్పుడు ఒక్కొక్కటిగా ఫైళ్లు కనిపించకపోతుండడంతో అనేక అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. క్యూసీ అధికారులు దీనిపై తర్జనభర్జన పడుతున్నారు. కాగా ఈ బిల్లు కోసం కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికి పలుమార్లు హైకోర్టు నుంచి నోటీసులు అందినా ఇరిగేషన్ అధికారులు కౌంటర్ ఫైల్ చేయకపోతుండడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

రిక్విజిషన్ ఫైల్స్ కనిపించడం లేదు

పెన్నా ప్యాకేజీ-1కు సంబంధించి సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి వచ్చిన రిక్విజిషన్ ఫైళ్లు కనిపించడం లేదు. పలుమార్లు వెతికినా ఫలితం లేదు. క్యూసీ సర్టిఫికెట్లు జారీ చేసిన బుక్ మాత్రమే ఉంది. దాన్ని భద్రపరిచాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

\- ధనుంజయ నాయుడు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	188
స్కిన్‌లెస్	208

కోడిగుడ్ల ధర (100): 430

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.5 కోట్లు మంజూరు
- వైసీపీ పాలనలో ముందుకు సాగని పనులు
- నిర్మాణాలు పూర్తికాకనే శిథిలావస్థకు కట్టడాలు

పర్యాటకానికి నోచని

ఇస్కపల్లి తీరం!



ఇస్కపల్లి తీరంలో విలాసవంతంగా నిర్మించిన కాటేజీ

అల్లూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపల్లి తీరంలో పర్యాటక కేంద్రం ఏర్పాటు పడకేసింది. తీరప్రాంతాలకు ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకు రావాలన్న ఆశయంతో గత టీడీపీ ప్రభుత్వం ఇస్కపల్లి తీరప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు 2016లో రూ2.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో అప్పటి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజధాని కమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావులు స్థలాన్ని సమకూర్చారు. ఆ స్థలంలో అప్పట్లో నిర్మించిన భవంతులు పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

● వైసీపీ ప్రభుత్వంలో ముందుకు సాగని పనులు

మారుమూల ప్రాంతాల అభివృద్ధికి సహజంగా ప్రభుత్వాలు చొరవ చూపవు. కానీ అటువంటి పరిస్థితుల్లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఇస్కపల్లి తీరప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. కాటేజ్‌లు, క్యాబిన్లు ఏర్పాటు తదితర నిర్మాణాలు జరపగా ప్రారంభానికి ముందే 2019లో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఈ పనులను వైసీపీ నేతలు మరిచారు. పనులను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్మించిన భవంతులు శిథిలమవడం, ధ్వంసమవడమే కాకుండా మందుబాబులకు అడ్డాగా మారాయి. పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని భావించి పర్యాటకుల కోసం అన్ని హంగులతో నిర్మించిన కాటేజ్‌లు నేడు మోడుగా దర్శనమిస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ కాటేజ్ భవనాలు నేడు మందుబాబులకు, చీకటి కార్యాకలాపాలు జరిపే వారికి అడ్డాగా మారిపోయాయి. కనీసం వినియోగించకుండానే నూతన భవనాలను అలానే వదిలి వెళ్లిపోవడంతో చెట్లు మొలిచి శిథిలావస్థకు చేరుకున్నాయి.



ధ్వంసమైన నిర్మాణం

● ఆవిరైన తీరప్రాంత వాసుల ఆశలు

పర్యాటక కేంద్రం ఏర్పాటైతే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, నలువైపుల నుంచి పర్యాటకులు ఇక్కడికి రాకపోకలు సాగిస్తుంటారని, ఈ క్రమంలో చిరు వ్యాపారాలు పెరిగి ఒక ప్రత్యేక గుర్తింపు వస్తుందని భావించిన ఈ ప్రాంత వాసుల ఆశలు ఆవిరైపోయాయి. పర్యాటకులతో సందడిగా మారడంతో పాటు తమలో కొంతమందికైనా ఉపాధి దొరుకుతుందని భావించిన మత్స్యకారులకు నిరాశే ఎదురైంది. ఇప్పటికైనా పర్యాక కేంద్రంగా మారుతుందా అని ఎదురుచూస్తున్నారు.

ఈ ప్రాంతం అభివృద్ధి జరిగేది



పర్యాటక కేంద్రం కోసం నాయకులు కృషి చేసి సాధించినా ఫలితం లేకుండా పోయింది. నిర్మాణాలు పూర్తి చేసి నిర్వహణ చేస్తూ ఉంటే పర్యాటకుల రాకపోకలతో మా ప్రాంతం కొంతమేర అభివృద్ధి చెందేది. మాకు చిరు వ్యాపారాలు జరిగేవి. ప్రభుత్వం నిలుపుదల చేయడంతో నిర్మించిన కట్టడాలు నిరుపయోగంగా మారాయి.

- పొన్నపూడి శ్రీనివాసులు, మత్స్యకారుడు, ఇస్కపల్లిపాలెం

ప్రభుత్వం మారడంతోనే సమస్య



టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పర్యాటక కేంద్రం పనులు ప్రభుత్వం మారడంతో ఆగిపోయాయి. నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉచితంగా స్థలం ఇవ్వడంతోపాటు కొంత నిధులు టీడీపీ నాయకులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడైనా పర్యాటక కేంద్రంగా మారుస్తారని ఆశిస్తున్నాం.

- గంగపట్నం శీనయ్య, మాజీ ఎంపీటీసీ, ఇస్కపల్లి

పొదుపు మహిళల అభ్యున్నతే లక్ష్యం

● కాంతారావు, ఏపీఎం, కొండాపురం

కొండాపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):



ఇంటర్వ్యూ

పొదుపు గ్రూపులోని ప్రతి మహిళ అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రతి గ్రూపులో మహిళకు పెట్టుబడి కింద రుణాలను అందచేసి తద్వారా లాభాలను ఆర్జించి కుటుంబానికి చేదోడుగా ఉండేందుకు సీడ్ క్యాపిటల్ (సూక్ష్మ రుణ పెట్టుబడి ప్రణాళిక) పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా రుణాలు కావాల్సిన మహిళలు స్థానిక వీవోఏలను సంప్రదించాలి.

? మండలంలో ఎన్ని పొదుపు గ్రూపులు, సంఘ బంధాలు ఉన్నాయి.

! మండలంలో 965 పొదుపు గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపుల్లో 9,650 మంది సభ్యులు ఉన్నారు. 32 సంఘ బంధాలు ఉన్నాయి. సంఘ బంధాల అధ్యక్షులు ప్రతి నెల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

? సూక్ష్మ రుణ పెట్టుబడి పథకం ద్వారా ఎంతమందికి రుణాలు మంజూరు చేశారు.

! సూక్ష్మ రుణ పెట్టుబడి పథకం ద్వారా ఒక యూనిట్‌కు రూ.40 వేల చొప్పున 2020-21వ సంవత్సరంలో 34 మంది పొదుపు మహిళలకు రుణాలు అందచేశాం. ఈ పథకం కింద రుణాలు కావాల్సిన సభ్యులు దరఖాస్తు చేసుకుంటే అర్హతను బట్టి రుణాలు మంజూరు చేస్తాం.

? 2024-25 సంవత్సరంలో ఎన్ని రూ.కోట్ల రుణాలు అందచేశారు.

! 2024- 25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ అయిన పొదుపు గ్రూపులకు రూ.25 కోట్లు, స్త్రీ నిధి పథకం కింద రూ.5 కోట్ల రుణాలు మంజూరు చేశాం. ఈ రుణాలు పొందిన వారు దాదాపు 98 శాతం వరకు తిరిగి చెల్లించారు.

న్యూస్ బాక్స్

సీతారాములకు 16 రోజుల పండుగ

బిట్రగుంట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ బృదావనంలోని కోదండ రామాలయంలో సీతారామలక్షణాంజనేయులకు సోమవారం పదహారు రోజుల పండుగ ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాల అనంతరం చందన అలంకరణ భక్తుల కనువిందు చేసింది. సాయంత్రం ప్రత్యేక పూలాంకరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాదవపాలెంలోని కోదండరాముని ఆలయంలో స్వామి, అమ్మవార్ల పదహారు రోజుల పండుగను పురస్కరించుకుని ఉదయం గణపతి పూజ, గెముడు రాళ్ల అభిషేకాలు, హోమం, పూర్ణాహుతి, కుంకుమ పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం గ్రామ పొంగళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వీధిలైట్ల ఏర్పాటు

లింగసముద్రం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల పంచాయతీలోని పెంట్రాల, చీమలపెంట గ్రామాల్లో సోమవారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరిలో పంచాయతీ పరిధిలోని పెంట్రాల, చీమలపెంట, రాళ్లపాడు గ్రామాల్లో వీధిలైట్లను ఏర్పాటు చేశారు. అయితే వాటిలో చాలా లైట్లు పగిలి పోగా, కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు వీధిలైట్లు లేక రాత్రి వేళల్లో బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల వినతి మేరకు వీధిలైట్లు ఏర్పాటు చేశారు.

ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగులు

బిట్రగుంట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో బీఎంఆర్ ట్రస్ట్ సౌజన్యంతో సోమవారం పేద ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగుల కార్యక్రమం జరిగింది. బీఎంఆర్ యువసేన అధ్యక్షుడు సమీఉల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాలసుబ్రహ్మణ్యం పాల్గొని చిన్నారులకు పౌష్టికాహారం కిట్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు గండూరి మంజుల, ప్రైవేటు వైద్యులు రఫీ, శంషుద్దీన్, జామియామసీదు ముత్తావలి, నవీద్, ఖాసీమ్, అలీం, ఖలీల్, అజీమ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల చట్టంపై అవగాహన

బిట్రగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల చట్టంపై అందరికీ అవగాహన ఉండాలని ఏపీఎం నవీన్ అన్నారు. బోగోలు స్త్రీశక్తి భవనంలో సోమవారం అంగన్వాడీ, వెలుగు, పొదుపు సభ్యులతో కిశోరీ వికాశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సౌజన్య, నెల్లూరుకు చెందిన సఖీ వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు సాధన, సూపర్‌వైజర్లు జే.వాణి, డీ.సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో చోరీకి యత్నం

లింగసముద్రం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాలలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో దొంగలు చోరీకి యత్నించారు. సోమవారం సాయంత్రం ఆరోగ్య కేంద్రం తలుపు తాళం పగులగొట్టి ఉండటాన్ని ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్‌గా ఉండే ఎంఎల్‌హెచ్‌పీ శ్రీహరి పొలానికి వెళ్తూ గమనించారు. వెంటనే ఆరోగ్య కేంద్రం లోపలికి వెళ్లి చూడగా మందులు, కుర్చీలు, ఫ్యాన్లు అన్నీ ఉన్నాయని గుర్తించారు. ఆయన వెంటనే లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో జి శ్రీనివాసులు దృష్టికి తెచ్చారు. అయితే ఈ ఆరోగ్య కేంద్రంలో పని చేసే ఎంఎల్‌హెచ్‌పీ గత శుక్రవారం మెటర్నటీ సెలవు పెట్టి, చార్జ్ అప్పగించి వెళ్ళిపోయినట్టు సీహెచ్‌వో శ్రీనివాసులు చెప్పారు. దొంగలు ఆదివారం అర్ధరాత్రి చోరీకి ప్రయత్నించి ఉండవచ్చని భావిస్తున్నారు. మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌కు తెలియజేసి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

నేడు వీవీ పాలెం మండల సమావేశం

వలేటివారిపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో నరేంద్రదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి శ్రీకారం

● పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు

● కిరోసిన్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం ● కందుకూరులో ఉద్రిక్తత



కందుకూరులో తొలగిస్తున్న ఆక్రమణలు

కందుకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా సోమవారం పామూరు రోడ్డు సర్కిల్‌కు నాలుగు వైపులా ఉన్న ఆక్రమణల తొలగింపుల తొలగింపునకు చర్యలు చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో సర్కిల్‌కు చేరుకుని ఫైనల్‌గా సర్వే అధికారులు నిర్ధారించిన మార్కింగ్ వరకు ఆక్రమణలు తొలగింపు చేపట్టారు. పామూరు రోడ్డుకు పడమర వైపున ఉన్న ఆక్రమణలు, ఆక్రమిత స్థలంగా భావిస్తున్న చోట ఉన్న శాశ్వత నిర్మాణాలను కూడా కూల్చివేశారు. అలాగే కొండముడుసుపాలెం రోడ్డుకు తూర్పువైపున, గుర్రంవారిపాలెం వెళ్లేరోడ్డుకు దక్షిణం వైపున ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసి ఉన్న బంకులను పూర్తిగా తొలగించారు. అలాగే పామూరు రోడ్డు సర్కిల్‌లో నిర్మించి ఉన్న బస్ షెల్టర్‌ను కూడా కూల్చివేశారు. ఈ క్రమంలో స్థానికులు ఆక్రమణల తొలగింపును అడ్డుకున్నారు. మాదాల మాల్యాద్రి, ఆయన కుటుంబసభ్యులు సర్వే ప్రమాణాలు పాటించకుండా మార్కింగ్ ఇచ్చారని, మాపై కక్షసాధింపు చర్యలలో భాగంగా అన్యాయంగా తమ స్థలాలలో ఉన్న నిర్మాణాలను కూల్చివేసేందుకు సిద్ధపడ్డారని విమర్శిస్తూ ఆక్రమణల తొలగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారు ఎంత అడ్డగించే ప్రయత్నం చేసినా సీఐ వెంకటేశ్వరరావు నేతృత్వంలో నలుగురు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయటంతో ఆక్రమణల తొలగింపునకు మార్గం సుగమం అయింది. ఒక దశలో మాదాల పావని ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆక్రమణల తొలగింపు ఆపకపోతే ఆత్మహత్యకు పాల్పడుతానంటూ ఆందోళన చేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు ఆమెను, మాదాల మాల్యాద్రిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే జిల్లా సర్వేయరుకు మరో సారి కొలతలు వేసి కచ్చితమైన హద్దులు తేల్చాలని తాము కోరి ఉన్నామని, ఆ అవకాశం కూడా ఇవ్వకుండా హడావిడిగా ఆక్రమణలు తొలగించారని వారు వాపోయారు.

● అన్నివైపులా తొలగించాలి

పామూరు రోడ్డుకు పడమర వైపున మాత్రమే ఆక్రమణలు తొలగించి తూర్పువైపున ఇంకా చేపట్టకపోవటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పడమర వైపున అధికంగా ఆక్రమణలు ఉన్నాయని అందుకే ముందుగా తొలగిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ ఆక్రమణలు ఎక్కువ ఉన్నా తక్కువ ఉన్నా పూర్తి స్థాయిలో తొలగించకుంటే సర్కిల్ అభివృద్ధికి ఆశించిన లుక్ రాదని అంటున్నారు. విమర్శల సంగతెలా ఉన్నా ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపుకు సిద్ధపడటం సాహసోపేత చర్యగా అభినందిస్తున్న ప్రజలు విమర్శలకు తావులేకుండా అన్నివైపులా తొలగించాలని కోరుతున్నారు.

'డీబీఎస్' చైర్మన్ శీనయ్యతో మంచి అనుబంధం

● నివాళులర్పించిన మంత్రి ఆనం



దామిశెట్టి శీనయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు

కావలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన కావలి డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాసులునాయుడుతో రాజకీయంగా, వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి సోమవారం ఉదయం మంత్రి కావలిలోని దామిశెట్టి నివాసానికి వెళ్లి శీనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంచి వ్యక్తిత్వం గల విద్యాదాత, కావలికి సుపరిచితులైన శ్రీనివాసులు నాయుడు మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.

వేసవి విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

● ఆర్డీవో సన్ని వంశీకృష్ణ



తలసేమియా బాధిత చిన్నారులతో మాట్లాడుతున్న ఆర్డీవో వంశీకృష్ణ

కావలిటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : వేసవి విపత్తులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో సన్ని వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్డీవో ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ముఖ్యంగా పెద్దలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, కావలి శాఖ చైర్మన్ రవిప్రకాష్, డాక్టర్ రవికుమార్, హరినారపరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వలు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు పరామర్శ

రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకుంటున్న తలసేమియా బాధిత చిన్నారులను ఆర్డీవో పరామర్శించారు. చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవల గురించి డాక్టర్లు రమ్య, శ్రీధర్‌లను అడిగి తెలుసుకుని మందులు, పౌష్టికాహారం అందించారు. తలసేమియా బాధిత చిన్నారులు సదరమ్ సర్టిఫికెట్ పొందితే ఆర్టీసీ దివ్యాంగులకిచ్చే రాయితీ బస్సు పాసులు ఇప్పిస్తామన్నారు. చిన్నారులకు ఉచిత వైద్యసేవలందిస్తున్న వైద్యులు గోపి, శ్రీధర్‌లను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్ పాల్గొన్నారు.

శివారు ఆయకట్టులో రెండో పంట సాగు చేయొద్దు

కావలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దిగువన కావలి కాలువ కింద శివారున కావలి, జలదంకి మండలాల ఆయుకట్టుకు రెండో పంటకు సాగునీరు అందడం కష్టమైనందున అక్కడ పంటలు సాగు చేయవద్దని సాగునీటి సంఘాలు, రైతులు నిర్ణయించారు. కావలి, జలదంకి మండలాల సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో సోమవారం కావలి జలవనరుల శాఖ కార్యాలయంలో సాగు నీటి పంపిణీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి కాలం కావడంతో శివారు ప్రాంతాలకు సో మశిల నీరు సక్రమంగా అందదని, కనుక రై తులు రెండో పంట సాగు చేసుకోకపోవటమే మంచిదని అభిప్రాయపడ్డారు. ఒకవేళ చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండి ఒకటి, రెండు తడులకు సోమశిల నీరు అవసరమను కుంటే రెండో పంట వేయాలా, ఆరుతడి పంటలు వేయాలా అనేది నిర్ణయం తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. చెరువుల్లో ఇప్పటికే నీరు లేనివారు మాత్రం రెండో పంట, ఆరుతడి పంటలు వేయకపోవడమే మంచిదని అభిప్రాయపడ్డారు. కాలువ కింద ఉన్న చెరువులకు తాగునీటికి, పశువులకు ఇబ్బంది లేకుండా సోమశిల నీరు ఇస్తారని, వాటిని జాగ్రత్త చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ కావలి ఇన్‌చార్జి ఈఈ పీఎం ఖాన్, డీఈ రామారావు, ఏఈ జంపాని కిరణ్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పీ.మధురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

కావలి రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీన జరగనున్న పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలీసెట్ కోఆర్డినేటర్ సుశీల్‌కుమార్ ప్రియ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాల, రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అ భ్యర్థులను హాల్‌టికెట్‌తో ఉదయం 10 గంటలకు పరీక్ష హాలు లోకి అనుమతిత్తారని పేర్కొ న్నారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ పరీక్షకు 1 నిమిషం ఆలస్యమైనా అనుమతించరని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

అల్లూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : కోడి పందేల స్థావరాలపై దాడులు చేసి ఐదుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ కిషోర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పురిణి సమీపంలో పైడేరు కట్టపై కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు సోమవారం సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3200, ఒక కోడిపుంజు, 5 మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఫొటోలు, వీడియోలు శాశ్వత జ్ఞాపకాలు : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఫొటోలు, వీడియోలను తమ కెమెరాల్లో బంధించి పది కాలాల పాటు జ్ఞాపకాలుగా నిలిపేవారు ఫొటో, వీడియోగ్రాఫర్స్ అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం సోమవారం పట్టణంలోని నారాయణ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్ విన్నపం మేరకు అసోసియేషన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఒక నెలలో చూపుతానని తెలిపారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్ఆర్ ప్రసాద్, కార్యదర్శిగా చిలకపాటి మధు, ఉపాధ్యక్షులుగా అనూక్, మాల్యాద్రి, జాయింట్ సెక్రటరీ చంద్ర, కోశాధికారి మల్లిక్, జాయింట్ కోశాధికారి సుధీర్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అసోసియేషన్ సభ్యులందరికి గుర్తింపు కార్డులు, హెల్మెట్లు పంపిణీ చేశారు. అలాగే అసోసియేషన్ కుటుంబాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు పొందిన వారిని అభినందిస్తూ బహుమతులు అందచేశారు. అసోసియేషన్ భవనానికి చెన్నా శ్రీనివాసులు, ఓంకార్‌లు రూ.3లక్షల విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ జాతీయ అధ్యక్షుడు ఎడిట్‌పాయింట్ రమేష్, జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్, కావలి డీఎస్పీ పీ. శ్రీధర్, మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు, డాక్టర్ రామస్వామి, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, తిరువీది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2వ తేదీన జరుగబోయే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను పురస్కరించుకుని చిలకలూరిపేట ఇన్‌చార్జిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని టీడీపీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం చిలకలూరి పేటకు వెళ్లిన ఎమ్మెల్యే అక్కడ ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావును కలిసి నరేంద్ర మోదీ పర్యటనపై చర్చించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ముస్లిం జేఏసీ ర్యాలీ



ఉగ్ర దాడిని నిరసిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

కందుకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకుల పై ఉగ్రవాదులు పైశాచికంగా దాడి చేసి అమాయక ప్రజల ప్రాణాలు తీయడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి కందుకూరులో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మస్కజ్ మసీదు నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఏ మతం కూడా ఉగ్రవాదాన్ని సమర్థించదని, అమాయక ప్రజల ప్రాణాలు తీసే ఉగ్రవాదులను ముస్లింలుగానే భావించకూడదని అభిప్రాయపడ్డారు. ఈ విపత్తును భారతీయులంతా ఐక్యంగా ఎదుర్కోవాలని ఉగ్రవాదాన్ని పూర్తిగా నాశనం చేయటమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష



ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

కావలిటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎంయు ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు సోమవారం డిపో వద్ద రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు కుందుర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన శిబిరంలో ఎన్ఎంయు జిల్లా కార్యదర్శి మురళీ మోహన్, జిల్లా సహాయ కార్యదర్శి మీరామొహిద్దీన్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి రఘునాథరెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి ఎంఏ కలామ్, సహాయ కార్యదర్శి వీవీ రెడ్డి, ప్రచార కార్యదర్శి మధుసూదనరావు, ముఖ్య సలహాదారుడు జానా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 83 మంది ఎంపిక



జాబ్‌మేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రియాజుద్దీన్

కందుకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో 83 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఫాక్స్‌కాన్ ప్రైవేట్ లిమిటెడ్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, టీవీఎస్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ తదితర 16 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 208మంది నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

'కోర్టు' సమస్యలకు తక్షణ పరిష్కారం

బాధ్యతతో పని చేయండి ● న్యాయాధికారులతో జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రధానమైన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల బదిలీ అయిన మొదటి తరగతి ఐద వ అదనపు జ్యూడిషియల్ న్యాయాధికా రి గండికోట దేవిక, మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి డీ.అఖిల గౌరవార్థం సోమవారం మధ్యాహ్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కో లుసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బార్, బెంచ్ రెండూ బొమ్మాబొరుసు లాంటివన్నారు. న్యాయాధికారులు, న్యాయవాదులు సమన్వయంతో పని చేసినప్పుడే కక్షిదారులకు న్యాయం జరుగుతుంద న్నారు. న్యాయాధికారులు అత్యధిక కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని, వారికి న్యాయవాదులు సహకరించాలని ఆయన సూచిం చారు. అనవసరమైన పిటిషన్లు వేయకుండా, కోర్టు విలువైన సమయాన్ని ఆదా చేయాలని న్యాయవాదులకు హితవు పలికారు. సాయంత్రం ఐదు గంటలు అయిపోగానే ఇంటికి వెళతామని న్యాయాధికారులు అంటే కు దరదని, బాధ్యతతో



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

పనిచేయాలని అన్నారు. కోర్టు ప్రాంగణంలో ప్రధాన సమస్యగా ఉన్న ట్రాఫిక్‌ను వెంటనే పరిష్కరిస్తామని, రేపటి నుంచే కోర్టు ప్రాంగణంలోని గేటును తెరచి రాకపోకలు కొనసాగించేలా చేస్తామన్నారు. అతి త్వరలోనే లిఫ్ట్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కేసులు వేసిన వెంటనే ఎలాంటి కాలయాపన లేకుండా వాటికి నెంబర్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఐఏ పిటిషన్లను ఈరోజు పరిగణలోకి తీసుకుని వాటికి నెంబర్లు ఇచ్చామని తెలిపారు. జైలు స్థలాన్ని జిల్లా కోర్టు ప్రాంగణం లోకి తెచ్చే విషయమై హైకోర్టు దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్‌జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పీ.ఉమా మహేశ్వర్‌రెడ్డి, పీ.సుందరయ్య యాదవ్ ప్రసంగించారు. తమకు జరి గిన ఘనసన్మానానికి బదిలీపై వెళుతున్న న్యాయాధికారులు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయాధికారులు, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

జగన్ అబద్ధాలు నమ్మొద్దు

రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉలవపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అప్పటి చంద్రబాబు పాలనపై ఎలాంటి అబద్ధాలు ప్రచారం చేయించి అధికారం చేజిక్కించుకొన్నాడో అవే అబద్ధాలను నమ్ముకొని మళ్లీ అధికారంలోకి రావాలని జగన్‌మోహన్‌రెడ్డి శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నాడని, వాటిని నమ్మవద్దని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. మన్నేటికోటలో రూ.3.50 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం బద్ధిపూడిలో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు ప్రారంభిం చారు. రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రో డ్లు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడు తూ దుష్ప్రచారాలతో గద్దెనెక్కిన పార్టీ వైసీపీ అని, అబద్ధాలు ప్రచారం చేయడం జగన్ నైజమని విమర్శించారు.


విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి

చంద్రబాబు అంటే బ్రాండ్ : వీపీఆర్

నిశ్చేష్టంగా ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశలో పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక బ్రాండ్ అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పరిశ్రమలు, ఐటీ రంగంలో రాష్ట్రం దూసుకుపోతుందని కొనియాడారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మత్స్యకారులకు వేట నిషేధిత భృతి కింద రూ.30 కోట్లు వారి అకౌంట్లులోకి నిర్ణీత కాలంలో వేశారన్నారు. ఈ సందర్భంగా బద్ధిపూడికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు కూనం రాఘవరెడ్డి తన అనుచరులు సుమారు 400 మందితో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బద్ధిపూడి టీడీపీ సీనియర్ నాయకులు కూనం బ్రహ్మానందరెడ్డి, మన్నేటకోట సర్పంచు పులివర్తి బసవయ్యనాయుడు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

● పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 115 మంది ఫిర్యాదుదారులు వచ్చి వారి సమస్యలు తెలిపారు. డీటీసీ డీఎస్పీ గిరిధర్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేదికలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

● నగరంలోని కరెంటాఫీసులో లైన్‌మన్‌గా పనిచేస్తున్న కత్తి పరంధామయ్య షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి నగదు తీసుకొని మోసం చేశాడని జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన శివకుమార్ ఫిర్యాదు చేశాడు. రూ.1.50


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు

లక్షలు తీసుకుని, ఉద్యోగం ఇప్పించకపోవడంతో నగదు అయినా ఇవ్వాలని అడిగితే మాపైనే కేసులు పెడతానని బెదిరిస్తున్నాడని పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

● హైదరాబాద్‌కి చెందిన ఓ మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.4.75 లక్షల నగదు తీసుకొని నకిలీ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేసిందని కావలి ప్రాంతానికి చెందిన యువకుడు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

● ఇందుకూరుపేట ప్రాంతానికి చెందిన పెనుబర్తి సురేష్, అతడి భార్య ఓ బ్లడ్‌బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్నామని చెప్పి, అదే ప్రాంతానికి చెందిన ఏడు మందికి ఓ వైద్యశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.13 లక్షలు తీసుకున్నారని బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. సంవత్సరం నుంచి ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపింది. న్యాయం చేయాలని ఎస్పీని కోరింది.

పాతకక్షలతో కత్తితో దాడి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరులో మునునూరు రఘురెడ్డి పాత కక్షలను మనసులో పెట్టుకుని బొప్పిడి శ్రీనివాసులు అనే వృద్ధుడిపై సోమవారం కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో భుజం, ఛాతీకి పక్కన రెండు కత్తిపోట్లు పడటంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. కత్తితో దాడి చేసి మళ్ళీ సమ్మెటతో (పెద్దసుత్తి) దాడి చేసే యత్నంలో అప్పుడే అక్కడికి వచ్చిన మరో వ్యక్తి అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. నిందితుడు పరారయ్యాడు. గాయపడిన శ్రీనివాసులును బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

కష్టపడి గద్దెనెక్కి!

ఆదర్శం aadarsham

ఒక వ్యక్తి ఒక రంగంలో రాణించడమే గొప్ప.. అలాంటిది ఏకంగా మూడు రంగాల్లో రాణించడమంటే ఆయన పట్టుదల.. అంకిత భావం కార్యదీక్షాదక్షతలు ఏపాటివో అర్థం చేసుకోవచ్చు. మాస్టర్స్ క్రీడల్లో జాతీయస్థాయి క్రీడాకారుడిగా, వ్యవసాయంలో ఆదర్శ రైతుగా, కోళ్ల పరిశ్రమలో ఉపాధి పొందుతూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు గద్దె వెంకటేశ్వర్లు. కొండాపురం మండలం సత్యవోలు అగ్రహారానికి చెందిన రైతు వెంకటసరసయ్య, అక్కమ్మ దంపతుల 7వ సంతానం వెంకటేశ్వర్లు. 10వ తరగతి వరకు నెల్లూరులో, కావలిలో డిగ్రీ వరకు చదివిన వెంకటేశ్వర్లు స్వగ్రామంలో వ్యవసాయానికే పరిమితం కాకుండా ఏదైనా సాధించాలన్న దృఢసంకల్పం ఏర్పరుచుకున్నారు.

- ● ఇటు వ్యవసాయం చేస్తూ.. అటు చిన్ననాటి కల నెరవేర్చుకుంటూ..
- ● బరిలో నిలిస్తే పతకం అందుకోవాల్సిందే!
- ● కోళ్ల పరిశ్రమ ద్వారా పలువురికి ఉపాధి
- ● ఆదర్శప్రాయుడు వెంకటేశ్వర్లు

కావలిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే క్రీడల్లో ఆసక్తి కలిగి ఉన్నా అప్పటి ఆర్థిక పరిస్థితులు, కుటుంబ నేపథ్యం దృష్ట్యా వెంకటేశ్వర్లు క్రీడలకు సమయాన్ని వెచ్చించలేకపోయారు. పరిస్థితులు సహకరించకపోయినా పట్టుదలతో అవకాశం దొరికినప్పుడల్లా జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటాడు. పెళ్లి, పిల్లలు, వ్యవసాయం సంసార జీవితంతో 40 ఏళ్లు పూర్తయినా క్రీడలపై మక్కువ, చిన్ననాటి కల సాకారం చేసుకునేందుకు ఆయన దృష్టి మాస్టర్స్ క్రీడలపై పడింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటూ రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక విజయాలు తన ఖాతాలో వేసుకున్నారు.

● సాధించిన విజయాలు

100, 200, 400, 800, 1500 మీటర్లు, హాఫ్ మారథాన్, 4100 మీటర్ల రిలే, 4400 మీటర్ల రిలే పరుగు పందేలలో దేశవ్యాప్తంగా జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించారు. 2011లో ముంబాయిలో జరిగిన జాతీయస్థాయి హాఫ్ మారథాన్ (21కెఎమ్) అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం, నెల్లూరులో 2017, 18 సంవత్సరాల్లో వరుసగా రెండుసార్లు మారథాన్ (44కెఎం) బంగారు పథకాలు, 2019లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో బంగా రు పథకం అందుకున్నారు. 2012లో తమిళనాడులోని కడలూరు లో జరిగిన జాతీయస్థాయి 5కేఎం, 1500 మీటర్ల పరుగు పందెం లో బంగారు పథకాలు, 2018లో వారణాసిలో జరిగిన పోటీల్లో 400 మీటర్ల పరుగుపందెంలో రజతం, 2016 హర్యానాలో జరిగిన పోటీల్లో ఏపీ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించి 4100 మీటర్ల రిలే పరుగులో బంగారు పథకం సాధించారు. 2019 గుజరాత్‌లో ని వడోదరలో జరిగిన 100 మీటర్ల పరుగులో బంగారం, 200 మీటర్ల పరుగులో రజత పథకాలు సాధించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎన్నో విజయాలు సాధించి తన చిన్ననాటి కల సాకారం చేసుకున్నారు వెంకటేశ్వర్లు.

● కోళ్ల పరిశ్రమలో రాణిస్తూ..

దగదర్తి ప్రాంతంలో ఒకప్పుడు చిన్న కోళ్ల పరిశ్రమ స్థాపించగా నేడు లక్షకుపైగా కోళ్ల పెద్ద పరిశ్రమగా ఏర్పడింది. ప్రత్యక్షంగా 25 మంది పరోక్షంగా 80 మందికిపైగా ఉపాధి కల్పిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.



అంకితభావంతో కష్టపడాలి!

ఏ రంగంలోనైనా రాణించాలంటే అంకితభావం, పట్టుదలతో పనిచేయాలి. ఓటములు గెలుపునకు మెట్లుగా మలుచుకుని పైకి ఎదగాలి. యువత సక్సెస్ దొరకలేదని కుంగిపోకుండా సమయం వృథా చేయకుండా చిత్తశుద్ధితో శ్రమిస్తేనే విజయం సొంతం చేసుకోవచ్చు.

- గద్దె వెంకటేశ్వర్లు



● ఉత్తమ రైతుగా..

కావలిలో డిగ్రీ పూర్తి చేసుకుని స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ పూర్తిస్థాయి రైతుగా వెంకటేశ్వర్లు స్థిరపడ్డారు. క్రిమిసంహారక మందులు వాడకుండా సంప్రదాయ ఎరువులు వాడుతూ ఎక్కువ దిగుబడులు సాధిస్తూ జిల్లాస్థాయిలో ఉత్తమ రైతుగా అప్పటి రాష్ట్ర మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, అప్పటి కావలి ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

సోమశిలలో 51.268 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 51.268 టీఎసీంలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి వాణి

ముత్తుకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రజలకు పూర్తి అవగాహన అవసరం అని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వాణి తెలిపారు. పిడతాపోలూరులోని సచివాలయంలో ఆవరణలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞానసదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయంలో పనులు కాకపోతే నేరుగా కలిసి ఫిర్యాదు చేసినా.. పోస్టు కార్డ్ రాసినా లేదా టోల్ ఫ్రీ నెంబరుకి కాల్ చేసినా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కేసు ఏస్థాయిలో ఉన్నా లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందుతుందని చెప్పారు. గ్రామ స్థాయిలో చట్టాలపైన అవగాహనకు ఇలాంటి సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు తమ సమస్యలను జడ్జి దృష్టికి తీసుకురాగా తగు సూచనలిచ్చారు. సదస్సులో కోవూరు జూనియర్ సివిల్ జడ్జి శివ నమ్రత పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. జడ్జిలను స్థానిక టీడీపీ నాయకులు దండు శ్రీనివాసులు, కొండారెడ్డి, పెంచలయ్య, కరిముల్లా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ హేమంత్‌కుమార్, డీడీవో శేషగిరిరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయాధికారులను సత్కరిస్తున్న స్థానిక నాయకులు


మద్యం దుకాణం వద్ద ఘర్షణ

నెల్లూరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు - జొన్న వాడ రహదారిలోని ఓ ప్రైవేటు డెయిరీ సమీపాన ఉన్న మద్య ం దుకాణం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో 5 సవర్ల బంగారు గొలుసు అపహరణకు గురైనట్లు రూరల్ సీఐ గుంజి వేణు సోమవారం తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వివరాల్లోకి వెళి తే.... జిల్లా ఫైబర్‌నెట్ ఇన్‌చార్జి ముక్కా ప్రవీణ్‌బాబు తన స్నేహితులతో కలిసి మద్యం సేవించేందుకు ప్రైవేటు డెయిరీ వద్ద ఉన్న మద్యం దుకాణానికి వెళ్లారు. అదే సమయంలో కాగులపాడుకి చెందిన మీరయ్య, మరో ఇద్దరు కూడా వీరితో పాటు మద్యం తాగేందుకు వచ్చారు. వీరంతా మద్యం తాగు తున్న సమయంలో పక్కనే కూర్చుని మద్యం తాగుతున్న నగరంలోని మన్సూర్‌నగర్ వాసులపై పడింది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ మొదలై ప్రవీణ్, అతడి స్నేహితుడు అవినాష్‌కు గాయాలయ్యాయి. ఈ క్రమంలో అవినాష్ మెడలో ఐదుసవర్ల బంగారు గొలుసును మన్సూర్‌నగర్ వాసులు అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు అందిందని సీఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో ఆదివారం సాయంత్రం కోవూరు మండలం చెర్లోపాలెం గిరిజన కాలనీకి చెందిన క వరగిరి రవి (42) తన బంధువులతో కలిసి మైపాడు బీచ్‌లో సేద తీరుతుండగా రవి అదృశ్యమయ్యాడు. దీంతో బంధువులు రవి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని ఆచూకీ కోసం ఆ ప్రాంతమంతా గాలించారు. సోమవారం ఉదయం ముత్తాలు సమీపంలోని రావూరు కండ్రిగ సమీప పొలాల్లో శవమై కనిపించాడు.

డిప్యూటీ స్పీకర్‌పై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం నిరసన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లు కూల్చడాన్ని ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం రఘురామ వాఖ్యలకు నిరసనగా నగరంలోని పూలే బొమ్మ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ అనుచిత వాఖ్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఆయన్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను తిరిగి నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహ న్‌రావు, గోగుల శ్రీనివాసులు, పుల్లయ్య, రెహనా బేగం, కొండాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వలేటివారిపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని మోటారుసైక్లిస్టు మృతి చెందిన ఘటన వలేటివారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అత్తింటివారిపాలెంకు చెందిన కొల్లూరి మాధవరావు(47) మోటారు సైకిల్‌పై అత్తింటివారిపాలెం నుంచి పామూరుకి వెళ్తుండగా జాతీయ రహదారి క్రాస్ రోడ్డులో మట్టి ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి యజమాని మృతితో కుటుంబసభ్యులు బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మరిదినాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మాధవరావు మృతదేహం

వీపీఆర్ దాతృత్వం.. మారుతున్న దివ్యాంగుల జీవనచిత్రం

● ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లతో వారిలో మానసిక ధైర్యం

నెల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్) దాతృత్వంతో జిల్లాలోని దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయి. నడక దుర్లభమై దుర్భరంగా సాగుతున్న వారి జీవితాల్లో వీపీఆర్ చేతుల మీదుగా అందుతున్న ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో ఎదురైన దివ్యాంగులను చూసి చలించిపోయిన వేమిరెడ్డి గెలుపోటములతో సంబంధం లేకుండా ఎన్నికల అనంతరం జిల్లాలోని దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కొన్ని నెలలుగా ఆయన నియోజకవర్గాల వారీగా దివ్యాంగులను గుర్తించి ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందజేస్తున్నారు. ఇప్పటికే ఆత్మకూరు, కందుకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో సుమారు 850 మందికిపైగా ట్రై సైకిళ్లు అందజేశారు. కరెంటు బ్యాటరీ సాయంతో నడిచే ఈ ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ విలువ ఒక్కొక్కటి 40వేల రూపాయలకుపైగా ఉంటుంది. ఇందుకోసం కోసం ఆయన కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అంతేకాదు.. వాటి మరమ్మతుల భారం కూడా దివ్యాంగులపై పడకుండా రెండేళ్లపాటు వాటి నిర్వహణ బాధ్యతలను వీపీఆర్ ట్రస్ట్ నిర్వర్తిస్తుందని వీపీఆర్ ప్రక టించడంపట్ల దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ పంపిణీని ఒక పండుగ వాతావరణంలో నిర్వహించడం విశేషం. సాధారణంగా ఏదైనా ఒక వస్తువును ఉచితంగా పంపిణీ చేయడమే గొప్పగా భావిస్తారు. త్వరలో నెల్లూర నగరం, రూరల్ నియోజకవర్గాలలోనూ దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందజేయనున్నారు.


తన నివాసంలో దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

కోట్లాది రూపాయల సొంత నిధులతో 150 గ్రామాలకుపైగా శుద్ధ జలం అందించడంతో పాటు పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వీపీఆర్ ట్రస్ట్ ఇప్పుడు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు ఇవ్వడంపై నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● నెల్లూరు (హరనాథపురం) : నగరంలోని తన నివాసంలో ఆరుగురు దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను ఎంపీ వీపీఆర్ పంపిణీ చేశారు. ఇప్పటిదాకా జరిగిన పంపిణీల్లో అనివార్య కారణాల వల్ల ట్రై సైకిళ్లు అందుకోలేని దివ్యాంగులకు తన నివాసంలో అందజేశారు.

పీజీఆర్ఎస్‌కు 455 వినతులు

● కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

నెల్లూరు (హరనాధపురం) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. భూ సమస్యలు పరిష్కరించాలని, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇప్పించాలనే కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. జేసీ కే. కార్తీక్ అధికారులను పిలిచి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదికలో వచ్చే అర్జీలను మానవత్వంతో పరిశీలించి, పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మళ్లీ మళ్లీ వస్తున్న అర్జీల విషయంలో రెవెన్యూ అధి కారులు అత్యంత జాగ్రత్త వహించాలన్నారు.ఈ వేదికకు మొత్తం 455 అర్జీలు అందాయి. వీటి లో రెవెన్యూ శాఖకు 194, పోలీస్‌శాఖకు 63, మున్సిపల్ శాఖకు 30, సర్వేకు 43, పంచాయ తీరాజ్ శాఖ సంబంధించిన 31 అర్జీలు అందాయి.

● పిత్రార్జితంగా వచ్చిన భూమిని కొందరు ఆక్రమించారని, వారి బారి నుంచి భూమిని కాపాడాలని పొదలకూరు మండలం మహమ్మదాపురం మాజీ సర్పంచి పల్లిబోయిన వెంకటశేషయ్య జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థల భవనాలు, అగ్ని మాపక నిబంధనల అమలు, స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ వంటి వాటిని అధికారులు తనిఖీ చేయాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శిఖరం నరహరి జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● తండ్రి తనకు ఇచ్చిన 9 సెంట్లు పొలాన్ని ఆదాం అనే వ్యక్తి ఆక్రమించి, గత నెలలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కందుకూరు ప్రకాశంకాలనీకి చెందిన దివ్యాంకురాలు హెబ్సిక జేసీకి వినతిపత్రం సమర్పించారు. అధికారులు న్యాయం చేసి , ఆదాంను కఠినంగా శిక్షించాలని కోరారు.


అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

● టెన్త్ విద్యార్థులకు అభినందన

ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వలేటివారిపాలెం కేజీబీవీ విద్యార్థిని జీ.వైష్ణవి, లింగసముద్రం కేజీబీవీ విద్యార్థిని ఎం.అమృతప్రియ, కలిగిరి కేజీబీవీ విద్యార్థిని పీ.మహిమకు జేసీ కార్తీక్ జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఉదయ భాస్కర్, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్ రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఎంహెచ్‌వో సుజాత, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, విద్యుత్ ఎస్ఈ విజయన్, డీఈవో బాలాజీరావు, సమగ్ర శిక్ష ఏపీఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.